# లోకానికి నేనే వెలుగు

## సువార్తానందం : తెలుగు కతోలికులకు సంకల్ప పత్రం





సంపుటి - 40 జూలై - సెప్టెంబర్ 2017 సంచిక - 3

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ
భక్త యోహాను ప్రాంతీయయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి
ఫాదర్ పిల్లి అంతోని దాస్

## గురువిద్యార్థుల బృందం
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్నకిషోర్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ సూరిపోగుల వినోద్ కుమార్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా St. John's Regional Seminary Society, Hyderabad పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-40 జూలై - సెప్టెంబరు 2017 సంచిక-3

## సువార్తానందం:
## తెలుగు కతోలికులకు సంకల్ప పత్రం

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**ప్రధాన సంపాదకులు**
**&**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక


సంపాదకీయం

ఉద్ఘాటన పత్రం

1. క్రీస్తు ఒక్కడే రక్షకుడా? క్రీస్తు ద్వారా సర్వజనులకు
సకల సృష్టికి రక్షణ సాధ్యమా?............................................ 24
*– ఫాదర్ పి.ఆర్. జాన్, ఎస్.జె.*

2. ద్రవ్యప్రాధాన్యతా సంస్కృతిలో శ్రీసభ ప్రబోధం, పరివర్తనం .......... 40
*– అగ్రపీఠాధిపతులు ప్రకాశ్ మల్లవరపు*

3. సువార్తానందం – సాంఘిక శ్రేయస్సు .................................. 50
*– ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి*

4. నూతన సువార్తీకరణ – విశ్వాస వ్యాపనం.............................. 62
*– ఫాదర్ పోలిశెట్టి జయరాజు*

5. గాయపడి, బాధామయమై,
మలినమైన శ్రీసభలో క్రీస్తు ముఖ దర్శనం ............................ 70
*– ఫాదర్ సగినాల ప్రకాశ్*

6. సువార్తానందం:
ఆంధ్ర, తెలంగాణ శ్రీసభలో సమతుల్య ఆధ్యాత్మికత .................. 83
*– ఫాదర్ దొడ్డ రాజా*

పారిభాషక పదకోశం

# సంపాదకీయం



ఆనందం అన్నది రెండు రకాలు. ఒకటి ఈ ప్రపంచం ఇచ్చే ఆనందం. కొందరికి డబ్బు కూడబెట్టుకుంటే ఆనందం. మరికొందరికి వస్తువుల్ని సమకూర్చుకుంటే ఆనందం. ఇంకొందరికి శారీరక సుఖాలు అనుభవిస్తే ఆనందం. ఇలా జిహ్వాకొక రుచి, పుర్రె కొక ఆలోచన అన్నట్లు, ఒక్కొక్కరి అభిరుచులు వేరుగా ఉన్నా, వీటిలో ఏ ఆనందమైనా ఈ లోకానికి చెందినవే! కనుక, అవి లోకంతోబాటు అశాశ్వితాలు. అంటే క్షణికమైనవి. ఇక రెండవది ఆధ్యాత్మికమైన ఆనందం, అదే సచ్చిదానందం, శాశ్వితానందం. లోకంలో ఏ సంపదైనా తరిగిపోవచ్చు, ఆగిపోవచ్చు. దానితో అవి తెచ్చిన ఆనందం కరిగిపోతుంది. కాని ఆధ్యాత్మికానందం ఎప్పటికి హరించుకుపోదు. అది నిత్యమైంది, సత్యమైంది. దానవున్ని మానవునిగాను, మనిషిని దైవ పుత్రునిగాను మార్చి, అలౌకిక ఆనంద ప్రాప్తిని కలిగిస్తుంది. దివ్యానుభూతికి లోను చేస్తుంది. శుభవార్తల సారాన్ని ప్రబోధించి, కర్తవ్యతాసూత్ర నిర్దేశనం గావిస్తుంది. మనిషిని క్రీస్తుగా మార్చేవరకు ఈ ఆధ్యాత్మికానందం పనిచేస్తూనే ఉంటుంది. సత్య, మార్గ, జీవ త్రిసూత్ర ప్రబోధంతో నిరంతరం జాగృతం చేస్తూనే ఉంటుంది.

జీవితాంతం మంచి వార్తలనే వినాలని అందరికీ అనిపిస్తుంది. కాని అలా అన్ని వేళలా మంచివే వినిపించవు. మంచి వార్తల కోసం ఎదురు చూడటంలో తప్పు లేదు. కాని వసంతం ప్రతీనెల రాదు. మావి చిగురు ప్రతీసారి ఉండదు. అలానే కోయిల ప్రతీసారి కూయదు. మంచి వార్తలు వినటానికి ఇష్టపడే మనసు చెడు వార్తలను ఆస్వాదించలేదు. ఈ లోకంలో మంచిచెడుల కలయికనే గమనిస్తాం. అలాగాక, మనుష్యునిగా జన్మించిన యేసుక్రీస్తు తన కోసంగాక, మనుష్యుల కోసం జీవించాలనే ఆయన ప్రబోధాలను ఆచరించినట్లయితే జీవితంలో ఆనందం వెల్లివిరుస్తుంది. అసూయ, ద్వేషం, ప్రతీకారం వంటి రుణాత్మక భావనతో క్రుగ్గిపోతున్న మానవాళికి ప్రభువు సచ్చిదానందాన్ని స్వయంగా తన శుభవార్తల

ద్వారా రుచి చూపించారు. క్రీస్తు అవలంబులు సువార్తల ప్రబోధంతో సంతోషాన్ని, దు:ఖాన్ని, సుఖాన్ని, కష్టాన్ని సానుకూల కోణంలోంచి చూస్తారు. అది జీవితాన్ని ప్రఫుల్లం చేస్తుంది.

ఈ వరవడిలో యోచన చేసిన ఫ్రాన్సిస్ జగద్గురువులు "సువార్తానందం" అపోస్తోలిక ప్రబోధం అనే గ్రంథాన్ని ఆవిష్కరించి, "యేసు ప్రభువును తెలుసుకున్నవారి హృదయాలు, ఆయనను కలుసుకున్న వారి జీవితాలు సువార్తానందంతో పొంగిపొరలుతూ ఉంటాయి" అని తొలిదొత్తనే ఈ సచ్చిదానందం గురించి చెప్పారు. "ప్రభువు తోడుగా ఉంటే ఆత్మానందానికి కొదువ ఉండదు" అని కూడా అన్నారు. సువార్తా ప్రబోధంలో క్రొత్త అధ్యాయానికి నాంది పలకాలని ఆనందంతో సువార్తను అందించమని, సువార్తా పరిచర్యలో సరికొత్త మార్గాలను ఆయన సూచించారు. సువార్త ఆనందంతో కూడిన మంచి వార్తయని, అది అందరితో పంచుకొనే ఆనందమని, అది నిత్యనూతనంగ ఉంటుందని ఉద్ఘాటించారు. కొత్త ద్రాక్షారసం కొత్త తిత్తులలో పోసినట్లే, సువార్త ఎల్లప్పుడు ఉత్తేజ మనసులకు కొత్తగానే ఉంటుంది, గనుక దానిని సరికొత్త విధానాలలోనే ప్రబోధించాలని నొక్కి వక్కాణించారు. ఆనందకరమైన సువార్త అని ఆనందాన్ని చవిచూచి, ఆనందంగా ప్రకటించమని ఉద్బోధించారు.

ఈ నేపథ్యంలోనే 23,24 ఆగష్టు 2017లో పాపుగారి "ఎవన్జెలిఇ గౌదియుం" అనే అపోస్తోలిక ప్రబోధం ఆధారంగా "రానున్న కాలంలో ఆంధ్ర తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాలలో శ్రీసభ యాత్ర కొరకు ముఖ్యమైన పర్యవసానాల దృష్ట్యా నూతన పంథాలను గుర్తించుటలో కార్యక్రమ ప్రాధాన్యత గల సంకల్ప పత్రమే ఈ "సువార్తానందం" అనే శీర్షికన భక్త యోహాను గురు విద్యాలయ ప్రాంగణంలో, దివ్యవాణి విభాగంలో (హైదరాబాద్) తెలుగు కతోలిక దైవశాస్త్ర విభాగం వారు ఏటా జరిపే సదస్సును ఐదవసారి నిర్వహించారు. ఈ సదస్సులో ఆరుగురు ఉపన్యసితులు నివేదించిన పత్రాలనే ఈ సంచికలో మా ప్రియ పాఠకులకు అందజేస్తున్నాము.

పత్ర వ్యాసాలను అచ్చువేయుటకు ముదముతో అనుమతించిన విభాగ అధ్యక్షులు ఘనశ్రీ మల్లవరపు ప్రకాశ్ అగ్రపీఠాధిపతులకు మొదటగా హృదయపూర్వక అభివందనాలు. అలానే, ముద్రణకు ప్రేమతో అంగీకరించిన విభాగ కార్యదర్శి, ఫాదర్ రెడ్డిమాసు పాపయ్య గారికి కృతజ్ఞతలు. దైవశాస్త్రంలో

పట్టభద్రులయిన వక్తలు: ఫాదర్ పి.ఆర్.జాన్, ఎస్.జె., అగ్రపీఠాధిపతులు ప్రకాశ్ మల్లవరపు, ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడి, ఫాదర్ పోలిశెట్టి జయరాజు, ఫాదర్ సగినాల ప్రకాశ్, ఫాదర్ దొడ్డ రాజా గార్లకు కడు ప్రేమతో నమస్సుమాంజలులు. సదస్సు యొక్క నివేదికను అందించిన సమితికి స్తోత్రాలు. ఆ నివేదికను "ఉద్ఘాటన పత్రం" అనే శీర్షికన అందిస్తున్నాం. చివరిగా సంపాదక వర్గానికిని, రవాణాకు ఉపయుక్తంగా సాయం చేసిన బ్రదర్ల బృందానికి మా ప్రశంసలతో కూడిన సన్నుతులు. పత్రికను ఆదరిస్తున్న మా పాఠక ప్రియులకు నిండు వందనాలు.

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
ప్రధాన సంపాదకులు
& సంచిక సంపాదకులు

# ఉద్ఘాటన పత్రం



తెలుగు కతోలిక పీఠాధిపతుల సమాఖ్య - కతోలిక సిద్ధాంత, దైవశాస్త్ర విభాగ అధికృతులయిన మల్లవరపు ప్రకాశ్ అగ్రపీఠాధిపతుల అధ్యక్షతన, ఫాదర్. రెడ్డిమాసు పాపయ్యగారి పర్యవేక్షణలో అయిదవ సదస్సు 23-24 ఆగష్టు 2017న పునీత యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, రామాంత పురం, హైదరాబాదులో జరిగినది. దీనిలో 35 మంది పాల్గొన్నారు. ఈ సదస్సు ఫ్రాన్సిస్ పాపుగారు వ్రాసిన 'సువార్తానందం' అను అధికార పత్రంపై రాబోయే కాలంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతములలోని శ్రీసభ ప్రబోధ పయనం కోసం నూతన మార్గాలను అందించే కార్యక్రమ ప్రాముఖ్యతను, ముఖ్యమైన పరిణామాలను తెలియజేసే కార్యచరణ అంశాల ద్వారా ఏ విధంగా లబ్ధిపొందగలదని ఆరుగురు వక్తలు చక్కని వ్యాసాలను అందించారు. బృంద చర్చలందు స్థానిక శ్రీసభలో ఎదుర్కొంటున్న భిన్న సంస్కృతుల సవాళ్లు గురించియు, రాగల మార్పులను జాగ్రత్తగా పరిశీలించి ఎంచుకోవలసిన అవసరమగు విషయాలను తిరస్కరించి తమ తమ అభిప్రాయాలను ఉగ్గడించారు.

## 1. పత్రాలు - వాక్పతులు

ఈ సదస్సులో దైవశాస్త్ర నిపుణులైన ఆరుగురు వాక్పతులు, 'సువార్తానందం' పత్రాన్ని ఆధారము చేసుకొని పరిశోధనాత్మకంగా ఉభయ రాష్ట్రాల శ్రీసభను దృష్టిలో ఉంచుకొని ప్రాయోజిత పత్రాలను సమర్పించారు. వరుసగా (1) ఫాదర్ పి.ఆర్.జాన్, యస్.జె., "క్రీస్తు ఒక్కడే రక్షకుడా? క్రీస్తు ద్వారా సర్వజనులకు సకల సృష్టికి రక్షణ సాధ్యమా?" (దోమినుస్ జీసస్, సువార్తానందం ఆధారముగా) (2) అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాశ్, "ద్రవ్యప్రాధాన్యతా సంస్కృతిలో శ్రీసభ ప్రబోధం, పరివర్తనం" (3) ఫాదర్ కొమ్మారెడ్డి లూర్థు మర్రెడ్డి "సువార్తానందం-సాంఘిక శ్రేయస్సు" (4) ఫాదర్ పోలిశెట్టి జయరాజు, "నూతన సువార్తీకరణ-విశ్వాస వ్యాపనం" (5) ఫాదర్ సగినాల ప్రకాశ్, "గాయపడి,

బాధామయమై, మలినమైన శ్రీసభలో క్రీస్తు ముఖ దర్శనం" (6) ఫాదర్ దొడ్డ రాజా, "సువార్తానందం: ఆంధ్ర తెలంగాణ శ్రీసభలో సమతుల్య ఆధ్యాత్మికత", తమ తమ పత్రాలను చక్కగా చదివి సభకు వినిపించారు. వాటిపై స్పందనలు, ప్రతిస్పందనలు కూడ వినవచ్చాయి.

## 2. వాక్పతుల వచనాల సారాంశాలు

### 2.1. క్రీస్తు ఒక్కడే రక్షకుడా? క్రీస్తు ద్వారా సర్వజనులకు సకల సృష్టికి రక్షణ సాధ్యమా?

దోమినుస్ యేసుస్, సువార్తానందం అను రెండు శ్రీసభ అధికారిక పత్రాలు సులభమైనవి కావు. చదివి గ్రహించడం ఒక ఎత్తు, తెలుగులోనికి తర్జుమా చేయడం ఒక ఎత్తు. వాటి సారాంశాన్ని సంగ్రహించి ఒక క్రమపద్ధతిలో పొందుపరచటం ఇంకా కష్టతరమైన కార్యం. అంతకు మించిన శ్రమ ఈ రెండింటి మధ్య పరంపర ఉందా లేక సంఘర్షణ ఉందా అని చర్చించి ఒక జవాబును ఇవ్వడం.

ఈ రెండు పత్రాల మధ్య ఏకత్వం, కొనసాగింపు ఉంది. ఈ పత్రాలలో కనిపించే ప్రధాన పాత్రధారి యేసు ప్రభువే. అనగా క్రీస్తుప్రభువే వీటికి కేంద్రం. ఎలా కొనసాగింపు అని అంటే; ఫ్రాన్సిస్ పాపుగారు క్రీస్తు సంపద అందరిది, అందరికి చేరాలి, అందరూ దాని నుండి రక్షణ లబ్ధి పొందాలి అని విశ్వసించి అందులోని సువార్తానందాన్ని అందరికి పంచి పెడుతున్నారు. కాలగర్భములో, ఈ రెండు పత్రాల మధ్య ఆయా పరిస్థితుల ప్రభావము, వాటిపై విశ్వాస సమాధానాలు అను విషయాలలో చిన్నిపాటి తేడా ఉండవచ్చునేమోగాని, క్రీస్తు అందరి ఆస్తి, అందరికి అందుబాటులో ఉండాలి అనే తపనలో ఖచ్చితముగా తేడా లేదు.

సార్వజనీన రక్షణ అంశాన్ని జగద్గురువులు సువార్తానందంలో పునఃప్రస్తావించారు. ఇదే తియోలజీ ఫ్రం అబౌ అని తియోలజీ ఫ్రం బిలో అని. అది కొన్ని చర్చలకు, వాదోపవాదాలకు దారితీసింది అనేది వాస్తవం. అయితే

ఒక సత్యాన్ని ఇది వెల్లడిస్తుంది అని మనం గ్రహించాలి. క్రీస్తుపై నుండి క్రిందకు దిగివస్తున్నాడు, క్రింద ఉన్న మానవుణ్ణి పైకి తీసుకొని వెళ్తున్నాడు. ప్రభు ప్రేమను, పరుల ప్రేమను ఇది వ్యక్తపరుస్తుంది అనుటలో అతిశయోక్తి లేదు. దోమినుస్ యేసుస్‌లో వలె ప్రభువు కొరకు అన్వేషణ సాగాలి. సువార్తానందంలో వలె పరుల కొరకు అన్వేషణ సాగాలి. అదే మన నిరంతర క్రైస్తవ ప్రక్రియ. మనమే క్రీస్తు ప్రభువుని చాటే సువార్తానందం కావాలి.

## 2.2. ద్రవ్యప్రాధాన్యతా సంస్కృతిలో శ్రీసభ ప్రబోధం, పరివర్తనం

జగద్గురువులు అందించిన అపోస్తలిక ప్రబోధం సువార్తానందం, ఆధారంగా చేసుకొని ఈ ప్రస్తుత కాలంలో సువార్తా ప్రచారం కొనసాగడం అవశ్యమేగాని అది ఎలా కొనసాగించాలి. అందుకు అవసరమైన పరివర్తన మార్పు ఏమిటి?

సువార్తానందం మన అదృష్టం, భాగ్యం, అనుభవం, ఆనందం. ప్రభువు నుండి మనం అనుభవిస్తున్న ఈ ఆనందాన్ని లోకానికి అందించాలి. ఈ కార్యం, ఈ బాధ్యత ఆనాడు శిష్యులకు, ఆది సంఘానికి అప్పగించిన ప్రభువు, ఈనాడు శ్రీసభకు, ఆ శ్రీసభలో సభ్యులమైన మనకు అప్పగిస్తున్నారు. ఫ్రాన్సిస్ పాపుగారు ఈ బాధ్యతను గుర్తు చేస్తూ, వెన్నుతట్టి లేపుతూ, పునరంకితం కమ్మని, విశ్వ శ్రీసభకు తనదైన శైలిలో సువార్తానందం ద్వారా పిలుపునిస్తున్నారు. అందుకే దీనిపై అధ్యయనం జరగాలి, ఆచరణ స్థాయిలో క్రొత్త పద్ధతులలో సువార్తా ప్రబోధం కొనసాగాలి. అధికార పత్రములో ఇందుకు అవసరమైన పరివర్తన యావత్ శ్రీసభతో, దైవప్రజలందరిలో రావాలని చెప్పబడింది. అపోస్తలిక ప్రబోధాలపై, విశ్వలేఖలపై అలక్ష్యం, పట్టించుకోకపోవడం వంటివి విడనాడి, ఈ అపోస్తలిక ప్రబోధం విషయంలో అధిక ఆసక్తి చూపించడమే ఈ పరివర్తనలోని ఒక కీలక అంశం.

**ఇతర కొన్ని కీలకాంశములు:** అతివేగంగా మారుతున్న నేటి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక వాతావరణం నేపథ్యంలో శ్రీసభ గతంలో సూచించిన, ఆచరించిన విధానాలు,

పద్ధతులు సమీక్షించాలి. ప్రధాన లక్ష్యాన్ని స్పష్టం చేయాలి. ప్రధాన ధ్యేయంగా, లక్ష్యంగా, సువార్తా ప్రబోధం కంటే శ్రీసభకు ప్రీతిపాత్రమైనది మరొకటి, వేరొకటి ఉండకూడదు అని శ్రీసభ ఉద్దేశ్యం. ఈ దిశగా శ్రీసభ ముందుకు వెళ్లాలి.

ఇందుకు అవసరమైన క్రొత్త ఒరవడి, యథార్థమైన పరివర్తన, మార్పు కనుమరుగైపోలేదు కాని, స్తబ్ధముగా సుస్థిరముగా ఉన్నట్లు కనబడుతుంది. అందుకు కారణాలు, ఆటంకాలు, అవరోధాలు, సమస్యలు, ఇబ్బందులు గుర్తించాలి, వాటిని అధిగమించాలి. అధిగమించి సువార్త ప్రబోధం చేయపూనుకోవాలని సువార్తానందం అందరిని ఆహ్వానిస్తుంది. యేసుప్రభువు సువార్త ద్వారా ప్రసాదించే ఈ ఆనందాన్ని అందరూ అనుభవిస్తూ, ఈ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలి. దృఢమైన సంకల్పముతో, ఈ ఆనందానుభూతులు తోటి మానవులు కూడా చవిచూచేలా కార్యోన్ముఖులం కావలెను. భౌతికవాదము, ద్రవ్యప్రాధాన్యతవాదము, నిరీశ్వరవాదము గోచరిస్తుంది. అదే జీవిత గమ్యమని భావించటం. దైవం, ఆత్మ, జీవిత పరమార్థం, ఆధ్యాత్మిక, నైతిక విలువలను పాటించక, తావివ్వక ఉండటం ద్రవ్యప్రాధాన్యతవాదము యొక్క పరిణామాలు. దీనికి తోడు వినిమయ సంస్కృతి, విచ్చలవిడిగా విస్తరిల్లడం. ఇది జీవిత స్థాయిని నిర్ధారించే కొలమానంగా తయారవుతుంది. భౌతికవాదం, వినిమయతత్వం, సుఖవాదం అన్న ఈ మూడు సిద్ధాంతాల కలయిక జరుగుతుంది.

ఈ పరిస్థితిలో మానవుడు కోల్పోయే అంతరంగిక, ఆధ్యాత్మిక జీవిత పరమార్థాన్ని గుర్తు చేయాలి. సువార్తా ప్రబోధం ద్వారా మాత్రమే ఈ మార్పు పరివర్తన సాధ్యమవుతుంది. ధరార్జనపైన మోజు పెంచుకొని, మౌలిక విలువలను గాలికి వదిలేసి, జీవించడం తగదు. ఇవి ప్రమాదకరం. ఆత్మ రక్షణకు హానికరం అని బోధించే సువార్తా ప్రబోధాలను ప్రకటించడం అవసరం.

ఫ్రాన్సిస్ పాపుగారి ఈ ప్రబోధం, ఈ పిలుపు స్థానిక శ్రీసభను ఆలోచింపజేయాలి. ఆత్మావలోకనం, స్వీయవగాహన దిశగా ఆలోచించాలి. ఎందుకంటే ధర్మకార్యం అనేది లక్ష్యంగా ముందున్నప్పుడు, ఆ లక్ష్యసాధనకవసరమైన భవిష్య

ద్దర్శనము ఉండాలి. అందుకే సువార్తా ప్రబోధ పరివర్తన చెందాలి అని ఫ్రాన్సిస్ పాపుగారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మన స్థానిక తెలుగు శ్రీసభలో ప్రస్తుత పరిస్థితి గురించి, క్రింది వాస్తవాలు సూచిస్తూ వీటి కారణముగా సువార్తా ప్రబోధం విషయంలో, నిర్లిప్తత, నిస్సహాయం, నిరుత్సాహం చోటు చేసుకున్నాయని అభిప్రాయం.

గతంలో సాంఘీక సేవల ద్వారా, విద్యా, వైద్య రంగాలలో పేద సాదలను ఆదరించాము.

అంతర్గత దైనందిన వ్యవహారాలకే ఎక్కువ సమయం, వనరులు, వినియోగించడం జరుగుతుంది.

లోన ఉన్నవాల్లను చూసుకోవడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని క్రొత్తవాళ్ల దగ్గరకు వెళ్లకపోవడం, క్రొత్త సంఘాలు ఏర్పాటు చేయకపోవడం.

అంతర్గత ఐక్యతా, సమైక్యత లోపం.. ఈ పరిస్థితి శ్రీసభ అభివృద్ధికి, ప్రగతికి అడ్డుగోడగా నిలుస్తుంది. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో సువార్తా ప్రబోధం ఇప్పుడు, ఎప్పుడు శ్రీసభ యొక్క ప్రధాన కర్తవ్యం. అందుకు ప్రస్తుత పరిస్థితులలో అవలంబింపవలసిన మార్గాలను నిత్యం అన్వేషించాలి, ఆచరించాలి.

## 2.3. సువార్తానందం - సాంఘిక శ్రేయస్సు

దేవుడు కయీనును పిలుస్తూ, నీ తమ్ముడు ఎక్కడ అని అడిగినటుల, క్రీస్తు ప్రభువు కూడా కడరా తీర్పు దినమున అందరిని ఇలా అడుగుతారు. నేను ఆపదల్లో ఉన్నప్పుడు నన్ను ఆదుకున్నావా? సహాయం చేసావా? దీనిని బట్టి మనం ఏకాకులం కాదు, సంఘజీవులమని, ఇతరుల పట్ల మనకు బాధ్యత ఉందని, సాంఘిక సంక్షేమం కోసం పాటుపడాలని ఫ్రాన్సిస్ పాపుగారు తెలియజేస్తున్నారు. సంఘ సంక్షేమం అనేది లౌకిక ప్రపంచం పాటిస్తుంది కాని క్రైస్తవులు మాత్రం దయతో కూడిన క్రైస్తవ ఔదార్యం పాటించాలి.

భిన్న ప్రజలు, సంస్కృతులు, భాషలు, మతాలు ఉన్న చోట, సుహృద్భావ చర్చలతో సాంఘిక సంక్షేమం కోసం పాటుబడాలి. చిన్న మతాలైతే సాంఘిక

న్యాయం కోసం, శాంతి కోసం శ్రమించాలి. మరి ముఖ్యముగా పేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వనరులలో, ఆస్తులలో వారికి భాగం ఉందని భావించి, వారికి చెందింది వారికి ఇవ్వాలి, సంఘ ధర్మం పాటించాలి. ఇలా సంఘ సంక్షేమం కోసం పాటుబడితే, దైవరాజ్యాన్ని స్థాపించవచ్చుని, ఇలా సువార్త ప్రబోధంలో ఆనందం అనుభవించవచ్చునని నాలుగవ అధ్యాయంలో ఫ్రాన్సిస్ పాపుగారు బోధించారు. ఈ అధ్యాయంలో ఉన్న అంశాలన్ని భారతదేశపు భిన్న సంస్కృతికి, మతాలకు అన్వయించుకోవచ్చు.

## 2.4. గాయపడి బాధామయమై మలినమైన శ్రీసభలో క్రీస్తు ముఖ దర్శనం

పేదల పక్షాన నిలబడే ఒక మహా కవచం ఫ్రాన్సిస్ పాపుగారు. ఉన్న వారికి లేనివారికి మధ్య ఉన్న అగాధం పూడ్చుట కొరకు వారు ఎంతో ఆర్తితో చేసిన విన్నపాలు, అన్ని రంగాలకు వర్తించినవై యున్నాయి. ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణి, నిర్లిప్త వైఖరి అందులో ఉండకూడదని బోధించారు. వివిధ శృంఖాలాలతో బంధీలమయిన అభాగ్యులకు విముక్తిని కలిగించుట కొరకు, శ్రీసభలో అమలు చేయవలసిన విషయాలు పొందుపరిచారు.

తన చుట్టూ తాను భద్రతా వలయాన్ని గీసుకుని ప్రజలకు దూరంగా ఉండే వ్యవస్థను శ్రీసభ ఆశించకూడదు. ప్రజల కోసం శ్రమించే శ్రీసభగా ఉండాలి. ఆ ప్రయత్నంలో గాయపడిన తిరుసభ, మట్టి కొట్టుకుపోయి, మలినవమై, ప్రజల బాధను తన బాధగా అనుభవిస్తూ, వారి కోసం శ్రమించే శ్రీసభగా ఉండాలి. క్రీస్తు అడుగుజాడలలో మార్గాన్ని అన్వేషిస్తూ, చైతన్యమైన, సజీవ వ్యవస్థగా ఉండాలి.

రక్షణ సందేశాన్ని సామాజిక శ్రేయస్సు నుండి విడదీయలేం. రక్షణ సందేశ ప్రభావంతో సామాజిక జీవనంలో కలిగే సత్పరిణామాలను గుర్తించగలుగుతాం. 'నీ సోదరుడెక్కడ?' అని తండ్రి దేవుడు కయీనును అడిగిన ప్రశ్నలో, మనకు మన సోదరుని పట్ల ఉండవలసిన ప్రేమను, దృక్పథాన్ని సూచిస్తుంది. ఎంతటి ప్రాధాన్యం ఇవ్వాలో స్పష్టంగా బోధపడుతుంది. దేవుడు

ప్రసాదించే ఆధ్యాత్మిక అభివృద్ధిని అంచనావేయడానికి అనువైన పడికట్టు రాయి కూడా ఇదే.

మన సమకాలీన ప్రపంచాన్ని పరిపాలిస్తోన్న దేవుని త్రికరణ శుద్ధిగా ప్రేమించాలన్నదే సువార్తా సందేశ సారాంశం. దైవరాజ్యం, భగవత్పాలన ఏర్పాటుకు చేయవలసిన కృషి. పునీత పౌలుని నిర్వచనంలో దైవరాజ్యమంటే నీతి, న్యాయం, శాంతి, పవిత్రాత్మ ఒసగే సంతోషము (చూడండి రోమీ 14:17). క్రైస్తవులముగా మనం చేసే ప్రబోధాలు, మన క్రైస్తవ జీవనం మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రభావితం చేయగలగాలి, యావత్ ప్రపంచమును సమస్త సృష్టిని అనగా మానవ జీవితానికి సంబంధించిన సర్వస్వమని, వాటిని ప్రభావితం చేయగలగాలని సూచిస్తున్నారు.

గురువులు, గురుత్వ జీవితం, వారి సువార్త పరిచర్య, దివ్యసంస్కారాలను తరచుగా క్రైస్తవులకు అందించుట ద్వారా సువార్తానందాన్ని, సందేశాన్ని అందించగలరు. ఇది ఒక ప్రధాన పాత్ర. కనుక దివ్య పూజలో చేసే ప్రసంగం, సుదీర్ఘంగా ఉండక, సమతూకంగా, లయబద్ధత, క్లుప్తత, స్పష్టత కలిగి ఉండాలి. ప్రసంగాలలో బోధకుల కంటే అధిక ప్రాధాన్యం ప్రభువుకు దక్కేలా చూడాలి. శ్రీసభ మన తల్లి. కనుక, గురువులు తల్లి బిడ్డలకు బోధించునట్లు, వారు వసుదైక కుటుంబము అయిన శ్రీసభ బిడ్డలకు, ప్రేమతో ఆత్మీయంగా సత్య ప్రబోధం చేస్తూ, వారి జీవితాలను తీర్చిదిద్దుతూ, మార్పు తీసుకొని వచ్చుట కొరకు, కృషి చేయవలయును. విశేష నిగూఢ సత్యాలను మాతృభాషలో, శ్రావ్యమైన సరళిలో అందించవలయును.

సామాజిక సమస్యలను పరిష్కరించుకొనుటకు, జటిలమైన, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనుటకు, శ్రీసభ పరిచారకులు, సమాజంలోని ప్రతి మనిషి సమగ్రంగా కృషి చేయాలి. అభిప్రాయాలు వ్యక్తపరిచే వేదికలు అలంకరించాలి.

యథార్థమైన క్రైస్తవుడు, సామాజిక జీవనానికి, సమిష్టి శ్రేయస్సుకు సంబంధించిన తన అభిప్రాయాలను తప్పక సమీక్షించుకుంటాడు, తన నమ్మకాలను

సవరించుకుంటాడు. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా తనను తాను సంస్కరించుకుంటాడు.

విశ్వమానవ శ్రేయస్సు కోరి సువార్తానందం చేసిన ఈ ప్రబోధనలు సమాజంలో సమానత్వం, సమతుల్యత, సర్వమానవ సౌభ్రాతృత్వం, సమాజ శ్రేయస్సు కోరి చేసినవి. క్రైస్తవులు ఈ ప్రస్తానంలో ముందుండి ఇతర ప్రజలకు మార్గదర్శకులు కావాలి. ఇవి ఫ్రాన్సిస్ పాపుగారి ప్రయత్నాలు, ఆచరించవలసిన ప్రతిపాదనలు, క్రైస్తవులందరు, మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి.

## 2.5. సువార్తానందము: ఆంధ్ర తెలంగాణ శ్రీసభలో సమతుల్య ఆధ్యాత్మికత

సువార్తానందం, ఇది ఆధ్యాత్మిక జీవితం గురించి వ్రాయబడిన గ్రంథం కాదు. అయినప్పటికిని ఆధ్యాత్మికతను ఉద్బోధిస్తూ ఒక కోణంలోనే చూడకూడదు. అందుకే క్రీస్తు కేంద్రీకృత, పవిత్ర గ్రంథ ఆధారిత ఆధ్యాత్మికం అనగా అది ఒక జీవిత విధానం లేక ఆత్మతో నడిపించబడిన జీవితం.

ఈ క్రైస్తవ ఆధ్యాత్మిక జీవిత శైలిపై మారుతున్న ప్రపంచం యొక్క ప్రభావం ఎక్కువగా పడింది. దీనిని అధిగమించుట కొరకు, ఆధ్యాత్మిక జీవితం ద్వారా, దేవునికి మనపై గల ప్రేమను తెలుసుకొని, వ్యక్తపరచడం ద్వారా సాధించగలుగుతాం.

సువార్తానందం క్రీస్తు కేంద్రీకృతమైన ఆధ్యాత్మికతకు, సువార్తీకరణ ఆధ్యాత్మికతను కొలమానాలను సూచిస్తుంది. అనగా సమస్యల నుండి పారిపోవడం కాక, బాధ్యతతో చురుకైన పాత్రను పోషించుట. సువార్తీకరణే ఆధ్యాత్మికతకు, నిజమైన కొలమానం.

సువార్తా పరిచారకులు ఇతరులచే ప్రభావితులౌతు, వారి వారి అంతరంగిక ఆనందాన్ని కోల్పోతున్నారు. దీనికి తోడు, తీవ్రమైన శోధనలు, నిరాశావాదం, పోరాడక ముందే పరాజయాన్ని అంగీకరించే తత్వం. ఆధ్యాత్మిక భావనలు కొరవడటమే సువార్తా ప్రచారకులలో విభజనలకు మూలకారణములు.

ఈ నేపథ్యంలో పాపుగారు సువార్తానందం ద్వారా నూత్నీకరణకు పిలుపునిచ్చారు. క్రైస్తవ జీవితాలకు ఇది తప్పనిసరి. సువార్త సందేశం ద్వారా పరివర్తన లభిస్తుంది. దప్పిక గొనువాడు నా యొద్దకు వచ్చి తన దప్పిక తీర్చుకొనును గాక! నన్ను విశ్వసించువాని అంతరంగము నుండి జీవజలనదులు ప్రవహించును. (యోహాను 7:37-38).

తెలుగు క్రైస్తవులు వ్యక్తిగత ప్రార్థన, ప్రార్థనా జీవితం పాటించుట ద్వారా దైవవాక్య పఠనం ద్వారా, దివ్యసంస్కారాల ద్వారా, తిరుసభలో ఆచరించవలసిన నిత్యభక్తి కృత్యాల ద్వారా వారి ఆధ్యాత్మికతను పెంపొందించుకొనగలరు.

అలాగే, వారి విశ్వాసం ద్వారా సాక్షీ జీవితం జీవించుట ద్వారా సువార్తా ప్రబోధం చేయగలుగుతారు. ప్రేమ పవిత్రతకు దారి కనుక పేదలను, పొరుగువారిని ప్రేమించుట ద్వారా క్రైస్తవ పరిపూర్ణతను పొందగలుగుతారు. ఐక్యమత్యము శాంతి సమాధానములు ఇందులోని భాగము.

సువార్తానందంలో శ్రీసభ చేసే ప్రచారంలో, జీవితంలో మరియమాత శైలి కనిపిస్తుంది. అలాగే ఆమె పాత్ర ప్రధానమైనది. ఆమె ప్రార్థనల ద్వారా, ఆ తల్లి సహాయము ద్వారా క్రైస్తవులందరు పటిష్టమైన శ్రీసభను, క్రైస్తవ సమాజాన్ని, నిర్మించ సాధ్యపడగలరు. వారు నింపుకొనిన, అనుభవించిన సువార్తానందాన్ని అందరితో పంచుకొనగలరు.

## 3. బృంద చర్చలు - నివేదికలు

ఈ సదస్సులో పాల్గొన్నవారు బృందాలుగా ఏర్పడి, ఇచ్చిన ప్రశ్నలను చర్చించి, నివేదికలను సమర్పించారు. ఈ చర్చలు రెండు దఫాలుగా జరిగాయి. ఈ రెండింటి నివేదికలను కూడ ప్రశ్న జవాబుల రూపంలో మీ ముందు ఉంచుచున్నాము.

### 3.1. సువార్తనందం ప్రబోధం ఆధారం చేసుకొని, క్రీస్తు ఎవరు? క్రీస్తు అంటే ఏమిటి? రక్షణ అంటే ఏమిటి? చర్చించండి?

క్రీస్తు లోకరక్షకుడు. మానవాళికి రక్షకుడు. సువార్తానందం ప్రకారం క్రీస్తు ఎవరు అనగా ఆనందాన్ని వెలుగును ఇవ్వడానికి వచ్చిన దేవుని కుమారుడు.

పాపం అనే అంధకారం నుంచి తన వెలుగులోనికి నడిపించేవాడు క్రీస్తు. రక్షణ అనగా పాప దాస్యం నుండి విముక్తి. దేవుని బిడ్డలుగా స్వాతంత్ర్యం కలిగి జీవించడమే రక్షణ. పవిత్ర జీవితాన్ని జీవించడం, పరివర్తన చెందడమే రక్షణానందం. ఆనందం అనగా భావసంచలనం మాత్రమే కాదు, కాని అది రక్షణానందం.

సువార్తనందం ప్రకారం క్రైస్తవులు ఎవరు అనగా ఆనందంతో జీవించేవాళ్లు. ఆ ఆనందాన్ని,వెలుగును ఇతరులలో కూడా పరిచయం చేసేవాళ్ళు. పైన చెప్పినవి సువార్తానందం నెం.5 & 6లో చూడవచ్చు. మనలోన ఉన్న వ్యక్తిగతమైన దృఢ విశ్వాసం, ప్రభువును తారసిల్లుట జరిగితే సువార్తానందాన్ని చాటుతాం. ఇతరులకు ఈ సువార్తానందం అందాలి అన్న దృక్పథంలో మనం అందరం కృషి చేయాలి. ఇందుకు చక్కటి ఉదాహరణ మన పునీత మగ్దలా మరియ.

కుటుంబం యొక్క స్థితిగతులకు తగ్గ విధంగా మన సువార్త ప్రబోధం ఉండాలి. క్రైస్తవ అనుభవం ఒక్కొక్క సంఘంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. కనుక మనం పంచుకోవాలి. క్రీస్తును ఒక వ్యక్తిగా మనం ఇతరులకు ప్రకటించాలి కాని ఒక శక్తిగా చిత్రీకరించకూడదు.

ఆంతరంగిక ఆనందాన్ని అనుభవించి దాన్ని ఇతరులకు పరిచయం చేసినప్పుడు, ఇతరులు కూడా దానిని అనుభవించేటట్లు చేస్తే బాగుంటుంది. మన సంభాషణలతో ఆధ్యాత్మిక సంభాషణ ఎక్కువగా ఉండాలి. ఆనందానుభవం ప్రజలను చర్చికి రప్పిస్తుంది. కావున ఈ సువార్తానందం ప్రజలు అనుభవించేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

**3.2. సువార్త ప్రబోధం – శ్రీసభలో అంకిత భావము సువార్తబోధ పరివర్తనము. సువార్త ప్రబోధం చేయడానికి అనుకూల వాతావరణం శ్రీసభలో ఉన్నదా? ఏ సమకూల మార్పులు తేవాలి? ద్రవ్య ప్రాధాన్యతావాదము శ్రీసభను, క్రైస్తవులను ప్రభావితం చేస్తున్నదా? సువార్త ప్రబోధానికి ఇవి ఏ విధముగా ఆటంకాలుగా ఉన్నాయి?**

**అభిప్రాయాలు:** ప్రత్యక్ష సువార్తీకరణ చాలా వరకు తగ్గిపోయింది.

పరోక్ష సువార్తీకరణ మాత్రం మన విద్యాలయాలు, వైద్యాలయాలు, సాంఘిక సేవాకేంద్రాలు, ఆర్థిక సహాయాలు, సలహాలు, సాంస్కృతికపరమైన అవగాహ లందించడం ద్వారా చాలా వరకు సమాజానికి చేరుతుంది.

శ్రీసభలో వ్యాపార ధోరణి, కుల, వర్గ, ఆర్థిక, సామాజిక విభేదాలు పెరిగిపోయాయి. శ్రీసభలో సమన్వయ లోపం కనబడుతుంది. శ్రీసభలో గురువులకు నిరాశా, నిస్పృహలు పెచ్చు పెరిగాయి. సామాన్య క్రైస్తవులు ఆర్థికాభివృద్ధికిచ్చిన ప్రాధాన్యత ఆత్మీయ, ఆధ్యాత్మిక విలువలు పెంచుకోవడానికి ఇష్టపడటం లేదు, ప్రయత్నాలు చేయడం లేదు.

**సూచనలు:** బోధకులు, సువార్తీకులు గృహస్థ క్రైస్తవులతో మమేకమై కలిసి సువార్తా ప్రబోధం చేయాలి. వ్యాపార దృక్పథాన్ని విడిచిపెట్టి విద్యా, వైద్య, సాంఘిక సేవలు పేదలకు అందుబాటులోకి తేవాలి.

మేత్రాసన స్థాయిలో పనిచేస్తున్న అన్ని సంస్థల పెద్దలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ సరియైన కార్యాచరణ ప్రణాళికలతో పేదలకు చేరువలోకి వెళ్లే ప్రయత్నం చేయాలి.

**3.3. సువార్తానందం-సాంఘిక శ్రేయస్సు. పేదలకు అగ్రతర ప్రాధాన్యం లేదా వారిలో సంఘీభావం తెలుపుతూ, మన మేత్రాసనంలో అభివృద్ధి చేయగలమా? బహుమత కులాలున్న, బాషలున్న ఇంకా వ్యతిరేక మార్పిడి చట్టం ఉన్న మన ప్రాంతంలో సాంఘిక బాధ్యతతో సువార్తీకరణ ఎలా జరగాలి? మత ఛాందస భావజాలం ఉన్నప్పుడు, మతాల మధ్య, ఎలాంటి సుహృద్భావ చర్చలు జరుపుకోవచ్చు?**

అందరిని కలుపుకొనిపోవటం ద్వారా, సంకుచిత భావాలకు దూరంగా ఉండటం.

తన ఉనికిని కాపాడుకోవటం కోసం కాక, సువార్తీకరణం, సువార్తానందం కోసం చేయడం. తనను తాను పరిత్యజించుకొని, అనగా అహాన్ని చంపుకొని, ముందుకు కొనసాగిపోవాలి.

సాంఘిక సేవల ద్వారా కొంత మేరకు అందిస్తున్నా, ఇంకా మేత్రాసన, విచారణ, వివిధ సంస్థల స్థాయిలలో పేదల, వెనుకబడిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ, దృష్టి సారించటం, ఆదుకోవడం అవసరం. అన్ని రంగాలలో క్రైస్తవులలో, ఇతరులలో కావలసిన చైతన్యం తీసుకురావటం.

శ్రీసభ ఆలోచనా విధానంలో, మార్గనిర్దేశనలో, నిర్ణయాలలో, క్రీస్తు తనను తాను రిక్తుని గావించుకొనిన విధానాన్ని అవలంబించటం కూడా అవసరం. పేదలను, అభాగ్యులను, లేవనెత్తుటకు కావలసిన ప్రయత్నాలు చేపట్టడం ముఖ్యం. ఆరంభ దశ నుండి అలాగే తర్ఫీదు కాలము నుండి, పేదల పట్ల, పేదరికం పట్ల సరియైన సానుభూతిని పెంపొందింప చేయాలి. పేదరికం పరలోకానికి సోపానం.

అలాగే గురువులు మఠవాసుల జీవితాలలో కూడా, కారుణ్యము, సానుభూతి అందుబాటులో ఉండటం, వారి అవసరాలు గుర్తించడం వంటివి. సాధారణ శైలి కావాలి. దివ్యసంస్కారాలను తరచుగా అందించుట, అవసర సమయాలలో ఆర్థిక ఇతర సహాయం అందించటం అవసరం.

ప్రభుత్వరంగంతో పాటు, మేత్రాసనాలు, మఠవాసులు, సామాజిక శ్రేయస్సు కొరకు చక్కని ప్రణాళికలను, సిద్ధాంతాలను ఏర్పాటు చేసుకొని అవి కేవలం కాగితాలకు పరిమితం కాకుండా, ఆచరణాత్మకంగా ఉండేలా చూడాలి. బాధలో కలిసి నడవడం, సంఘీభావం తెలుపడం మన ధర్మం.

## 3.4. నూత్న సువార్తీకరణ:

### 3.4.1. స్థానిక ప్రజలను ఉత్తేజపరచటానికి ముందు దానిని ఆవశ్యకత అవగాహన అవసరమా?

స్థిరముగా ఉండ విశ్వాసులను ఉత్తేజపరచడానికి విశ్వాస పథములో అస్థిరత్వతతో అతలాకుతలమవుతున్న విశ్వాసులను ఉత్తేజపరచడానికి అన్ని కోణాలలో సువార్తీకరణను సమాలోచన చేసుకోవడం ఎంతైనా అవసరం.

విశ్వాసులు పరిస్థితులు బేరీజు వేసుకోవాలి. నూత్న సువార్తీకరణకు అందుబాటులో వస్తురూపంలో కాదు వ్యక్తి రూపంలో ఉండాలి.

దైవవాక్య ప్రాముఖ్యతను దానిలో నిగూఢమైన సజీవత్వమును విశ్వాసులకు అనుభవ శైలిలో విశదపరచాలి. నూతన సువార్తీకరణ క్రొత్తది కాదు కాని మూడు విధానాలు కొత్తవి: (ఎ) శ్రీసభ నుంచి దూరమైన విశ్వాసులు. (బి) బలమైన వేర్లు లేనివారు. (సి) నూతన సువార్తీకరణకు అనేక సమస్యలున్నాయి. (డి) గృహస్థ క్రైస్తవులకు సరైన పాత్ర లేకపోవడం. (ఇ) యువతా ప్రోత్సాహం లేకపోవడం.

### 3.4.2. ఆంధ్ర తెలంగాణ శ్రీసభలలో సమతుల్య ఆధ్యాత్మికత

పాపుగారి పిలుపు ప్రజా సమస్యలతో మమేకమై ఉండాలని ప్రేషితులు, అంకితులు, అర్పితులు, అభిషిక్తులను కోరుతున్నారు.

### 3.4.3. బహుమత కులాలున్న, భాషలున్న ఇంకా వ్యతిరేక సంస్థలు లేదా వ్యతిరేక మార్పిడి చట్టం ఉన్న మన ప్రాంతంలో సాంఘిక బాధ్యతతో సువార్తీకరణ ఎలా జరగాలి? మత ఛాందస భావజాలం ఉన్నప్పుడు, మతాల మధ్య, ఎలాంటి సుహృద్భావ చర్చలు జరుపుకోవచ్చు?

క్రైస్తవ జీవితం, జీవిత విధానం, సాక్షీభూతమైన జీవితం ద్వారా, సువార్తీకరణ జరగాలి. ఉదా: పునీత మదర్ థెరిసా. స్నేహపూర్వక, సామరస్య సంబంధాలు కలిగి వివిధ మతాలతో సుహృద్భావ చర్చలు జరుపవచ్చును. మన ఉనికి, ఇతరులకు అభద్రతను కలిగించనంత వరకు చర్చలు సాధ్యం.

ఇతరుల పట్ల ఇతర మతాల పట్ల, తగిన మర్యాద, గౌరవం, సహనం, సరియైన అవగాహన కలిగియున్నప్పుడు, సుహృద్భావ చర్చలు జరుగవచ్చును. విశ్వాస ప్రకటన జీవితం చాలా ముఖ్యం. గురువులు, మఠ కన్యలు బయటకు వచ్చి పనిచేయుటకు మార్పు కావాలి.

చేసే పని కేవలం ప్రసంగాల ప్రార్థనలు మాత్రమే కాకుండా ఇతర శాఖలకు కూడా చేరాలి. ఉదా: సాంఘిక సేవ, యువత సేవ, పేదవారికి సేవ, హెచ్.ఐ.వి.

బాధితులకు సేవ చేయటం మొదలగునవి. గురువులు, మఠకన్యలు అభివృద్ధి చెందిన ప్రాంతములలో కాకుండా, మారుమూల గ్రామాలకు సేవలను విస్తరించాలి.

గురువులకు, మఠకన్యలకు ప్రాపంచిక వస్తువుల వలన సుఖమయ జీవితం కాదు కాని అవసరత, వినియోగం ముఖ్యం. కులం సమస్య వలన క్రైస్తవ సంఘం చాలా నష్టపోతుంది. కులం సమస్యను ప్రక్కన పెట్టి, సంఘం అభివృద్ధి పనుల మీద దృష్టి పెట్టాలి. కులం సమస్య దాని వలన వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పించాలి.

**3.5. గాయపడి బాధామయమై మలినమైన శ్రీసభ కావాలి అన్న ఫ్రాన్సిస్ పాపుగారి పిలుపు నేపథ్యంలో మన స్థానిక శ్రీసభలో గురువులు, మఠకన్యలు, గృహస్థ క్రైస్తవులు తమ వ్యవస్థ కల్పించే భద్రతావలయాల నుండి బయటకు రావడానికి ఇష్టపడుతున్నారా? వినిమయ దృష్టి, సుఖమయ జీవితం, వ్యాపార దృష్టి నుండి బయటకు రావడానికి ఇష్టపడుతున్నారా? కుల, ప్రాంతీయ దృష్టి క్రైస్తవ భావాలకు చేసే నష్టాన్ని గుర్తించగలుగుతున్నారా?**

గురువులు, గురుత్వ జీవితం, వారి సువార్త పరిచర్య, దివ్య సంస్కారాలను తరచుగా క్రైస్తవులకు అందించుట ద్వారా సువార్తానందాన్ని, సందేశాన్ని అందించగలరు. ఇది ఒక ప్రధాన పాత్ర. కనుక దివ్యపూజలో చేసే ప్రసంగం, సుదీర్ఘంగా ఉండక, సమతూకం, లయబద్ధత, క్లుప్తత, స్పష్టత కలిగి ఉండాలి.

ప్రసంగాలలో బోధకుల కంటే అధిక ప్రాధాన్యం ప్రభువుకు దక్కేలా చూడాలి. శ్రీసభ మన తల్లి. కనుక, గురువులు తల్లి బిడ్డలకు బోధించునట్లు, వారు వసుదైక కుటుంబము అయిన శ్రీసభ బిడ్డలకు, ప్రేమతో ఆత్మీయంగా సత్య ప్రబోధం చేస్తూ, వారి జీవితాలను తీర్చిదిద్దుతూ, మార్పు తీసుకొని వచ్చుట కొరకు, కృషి చేయవలయును. విశేష నిగూఢ సత్యాలను మాతృభాషలో, శ్రావమైన సరళిలో అందించవలయును.

సామాజిక సమస్యలను పరిష్కరించుకొనుటకు, జటిలమైన, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనుటకు, శ్రీసభ పరిచారకులు, సమాజంలోని ప్రతి మనిషి సమగ్రంగా కృషి చేయాలి. అభిప్రాయాలు వ్యక్తపరిచే వేదికలు అలంకరించాలి.

**3.6.1. మనలో లేనిది ఇతరులకు ఇవ్వలేము. మనలను మనము క్రీస్తు ప్రేమలో కేంద్రీకరించుకోవాలి. అలా కేంద్రీకరించుకున్న మన జీవితమే సజీవ సువార్త.**

**సువార్తీకరణలో మరియతల్లి యొక్క శైలి, సేవక విధానమును అనుసరించాలి. దేవదూత ద్వారా దేవుడు మరియమ్మకు అందించిన సందేశాన్ని తనలోనే ఉంచుకొనక ఎలిజబేతమ్మ దగ్గరకు వెళ్లి ఆమెకు సేవలను అందించడంలో నిమగ్నమైనారు. ఈ విధానమునే మనము అనగా గురువులు, మఠకన్యలు అనుసరించాలి, ఆచరించాలి. ఆధ్యాత్మిక జీవితం మతం కాదన్న క్రీస్తు ధోరణిలో మనం పయనించాలి. (ఆత్మలో వివేచనం లేదా విచక్షణా విధానం) ఇది ఎలా వస్తుంది?**

ప్రార్థన, దివ్యగ్రంథ పఠనము ద్వార వస్తుంది. అక్కడే ఆనందం వస్తుంది. ఆ ప్రార్థనను సొంత ప్రార్థనగా మార్చుకొని అర్థవంతముగా ప్రార్థించాలి.

**3.6.2. అంతరంగిక ఆధ్యాత్మిక జీవితం అంటే దేనినైనా అధిగమించు కోవచ్చు. ఆధ్యాత్మిక జీవితం అనేది దివ్యసంస్కారాల ద్వారా, ప్రత్యేక ప్రార్థనా జీవితం ద్వారా బలపడుతుంది.**

గురువులు ఆధ్యాత్మికముగా స్థిరపడినవాళ్లు. వారు సంఘ సమస్యలు తెలుసుకొని ప్రజలను అర్థము చేసుకొని, ప్రజలకు దేవుని కరుణను, ప్రేమను క్రీస్తు వలె చూపిస్తూ, వారి సమస్యల కోసం ప్రార్థిస్తూ, ఆధ్యాత్మిక విలువలను సంఘానికి నూరిపోయాలి. ఇది ప్రతి ఒక్క గురువు, మఠకన్యలు ఆచరించ వలసిన అంశము.

ఉదా: గురువును అభిషేకించినది ప్రజలను దీవించడానికి, కాని కొంతమంది గురువులు బలిపూజ, బలిపీఠము నందు నిలబడి ప్రజలను శపిస్తున్నారు.

ఇది చాలా బాధాకరమైన అంశము.

సామాన్య ప్రజలు క్రీస్తు యొక్క విలువలను బోధ కంటే ఎక్కువగా గురువులు, మఠకన్యలు జీవించు విధానము ద్వారా మరింతగా నేర్చుకుంటున్నారు. అందుచే గురువులు, మఠకన్యలు మన జీవితం ఒక మార్గదర్శకముగా ఉండాలి. అంతరంగిక ఆధ్యాత్మికత లోపించిన గురువులు, మఠకన్యలు, సువార్త ప్రచారానికి లేదా క్రీస్తు విలువలకు అడ్డంకులుగా నిలుస్తున్నారు.

ఉదా: గురువు విచారణను చేరక ముందే సామాన్య ప్రజలు ఏ కులానికి చెందినవాడు అని తెలుసుకోవడం. సామాన్య ప్రజలు కూడా గురువు ఏ కులానికి చెందినవారు అని కనుక్కోవడం ప్రస్తుతం జరుగుచున్నది. ఇలా జరుగకూడదు సుమా!

**ఫాదర్ పాపయ్య రెడ్డిమాసు**
కార్యదర్శి
తెలుగు కతోలిక దైవశాస్త్ర విభాగం
హైదరాబాదు

ఫాదర్ రెడ్డిమాసు పాపయ్యగారు బెల్జియం నగరంలోని లువేన్ విశ్వ విద్యాలయమునందు సైద్ధాంతిక దైవశాస్త్రం నందు లైసెన్సియేట్, డాక్టరేట్ పొందారు. భక్త యోహాను గురువిద్యాలయం హైదరాబాదులో సైద్ధాంతిక దైవశాస్త్ర ఆచార్యులుగా పదిహేను సంవత్సరాలు సేవలందించారు. వీరు తెలుగు కతోలిక సిద్ధాంత దైవశాస్త్ర విభాగానికి ప్రస్తుత కార్యదర్శి.

# 1. క్రీస్తు ఒక్కడే రక్షకుడా ?

## క్రీస్తు ద్వారా సర్వజనులకు సకల సృష్టికి రక్షణ సాధ్యమా ??
## ("దోమినుస్ జీజస్", "సువార్తానందం" ఆధారంగా...)

**- ఫాదర్ పి.ఆర్. జాన్, ఎస్.జె.**



*ఫాదర్ పి.ఆర్. జాన్ గారు ఆస్ట్రియాలోని ఇన్స్‌బ్రూక్ నందుగల లెపాల్డ్ ఫ్రాంజెన్స్ విశ్వవిద్యాలయం నందు దైవశాస్త్రములో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రస్తుతం వారు న్యూఢిల్లీలోని విద్యాజ్యోతి దైవశాస్త్ర కళాశాలలో ప్రధానాధికారిగా, దైవశాస్త్ర ఆచార్యులుగా పనిచేస్తున్నారు. వీరు అనేక దైవశాస్త్ర కళాశాలలో సందర్శన ఆచార్యులుగా సేవలందింస్తున్నారు. వీరు దైవశాస్త్రములో అనేక పుస్తకాలు, వ్యాసాలు రచించి ప్రముఖమైన పత్రికలలో ప్రచురిస్తున్నారు.*

### 1. ఉపోద్ఘాతము

కార్డినల్ జోసఫ్ రాట్సింగర్ (16వ బెనెడిక్ట్ జగద్గురువులు) - రెండవ జాన్ పాల్ జగద్గురువుల పాలన కాలంలో (2000 సంవత్సరంలో) "జగన్నాథుడు యేసు Dominus Jesus" అనే సైద్ధాంతిక ప్రకటన వెలువరించారు. రెండవ వాటికన్ మహాసభ అధికార పత్రాలలో తమ (CDF) సిద్ధాంతానికి అనుకూలమైన అంశాలను మాత్రమే తీసుకుని - ఈ ప్రకటనను రూపొందించారు. నిజానికి శ్రీసభ అధికార ప్రబోధాల ప్రకారం - రెండవ వాటికన్ మహాసభ శ్రీసభలో ఎంతోకాలంగా మూతబడి ఉన్న కిటికీలను తెరిచింది, విశ్వాసుల భక్తి జీవనంలో సరికొత్త మార్పులకు దోహదం చేసే వినూత్నమైన ఆలోచనలకు నాంది పలికింది.

కానీ – కార్డినల్ రాట్సింగర్ (16వ బెనెడిక్ట్ జగద్గురువులు) వెలువరించిన "జగన్నాథుడు యేసు" అనే అధికార ప్రకటన – "రెండవ వాటికన్ మహాసభ తెరచిన కిటికీలను తిరిగి మూసివేసే ప్రయత్నం చేసింది" అనే వాదన వెలుగులోనికి వచ్చింది. ఈ అధికార ప్రకటనలో ఆరవ పౌలు జగద్గురువుల ప్రబోధాలు గాని, రెండవ జాన్‌పాల్ జగద్గురువులు జారీ చేసిన 30 అధికారిక పత్రాలు, మూడు విశ్వలేఖల (RM-22, TMA, EA) లోని ఏ ఒక్క అంశాన్ని గానీ ప్రస్తావించలేదు. అంతేకాదు అఖిల ఆసియా పీఠాధిపతుల సమాఖ్య (FABC) – ఆసియా శ్రీసభకు, విశ్వశ్రీసభకు వర్తించే దైవశాస్త్రపరమైన అనేక నిర్ణయాలను తీసుకొంది గానీ, వాటి ప్రస్తావన కూడ "జగన్నాథుడు యేసు (DJ)" అధికార ప్రకటనలో కనిపించదు. కనుకనే ఈ "జగన్నాథుడు యేసు" అధికార పత్రం ఎవరి కోసం రాశారు, ఎందుకు రాశారు, ఎలాంటి ఫలితాలను ఆశించి రాశారనే సంశయాలను పలువురు దైవశాస్త్రులు లేవనెత్తారు. ఆసియా దేశాలకు ముఖ్యంగా భారతదేశానికి చెందిన కొందరు దైవశాస్త్రులు "జగన్నాథుడు యేసు" అధికార ప్రకటనను తిరస్కరించారు. ముఖ్యంగా "దోమినుస్ జీజస్" అధికార పత్రాన్ని – "సంస్కృతీకరణం" "మతాంతర సుహృద్భావ చర్చ"లను సమర్థించే దైవశాస్త్రులు కూడ తిరస్కరించారు.

అయితే యేసుక్రీస్తు రక్షణ సువార్తకు గల "సార్వజనీనతను" పునరుద్ఘాటిస్తూ ఫ్రాన్సిస్ జగద్గురువులు "సువార్తానందం" అధికార పత్రం జారీ చేశారు. 2013 నవంబరు 24న, అంతర్జాతీయ విశ్వాస సంవత్సరం సందర్భంగా వెలువరించిన "సువార్తానందం" ప్రపంచవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందింది, అనతికాలంలోనే ఆయనను "ప్రజల పాపుగారు"గా జగత్ ప్రసిద్ధుణ్ణి చేసింది. ఆశ్చర్యకరమైన విశేషం ఏమిటంటే.. ఫ్రాన్సిస్ జగద్గురువులు విశ్వశ్రీసభ పాలకులుగా బాధ్యతలు చేపట్టిన మొదటి సంవత్సరంలోనే ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవేతరుల ఆదరాభిమానాలను పొందగలిగారు. సరికొత్త భావజాలంతోను, సంచలనాత్మకమైన జీవనశైలితోను, శిక్ష కంటే రక్షణకే అధిక ప్రాధాన్యమిస్తూ ప్రజల పక్షాన, ముఖ్యంగా పేదల పక్షాన, నిలుస్తోన్న ఫ్రాన్సిస్ పాపుగారు – వర్ణ, వర్గ, జాతి, భాషా భేదాలకు అతీతంగా విశ్వ జనులందరి ఆదరాభిమానాలను చూరగొనడం విస్మయానికి గురి చేస్తుంది.

అంతేకాదు – ఎనభై యేళ్లప్రాయంలో కూడా ఫ్రాన్సిస్ జగద్గురువులు సామాన్య ప్రజల కష్ట సుఖాల గురించి ఆలోచించడం, వారి మధ్యనే జీవిస్తూ, వారికి ప్రభు క్రీస్తు ప్రేమ కారుణ్యాలను చవిచూపడం, సువార్తా విలువల మార్గంలో శ్రీసభలోని అన్ని శ్రేణుల విశ్వాసులకు దిశానిర్దేశం చేయడం – మొదలైనవన్నీ ఇటు శ్రీసభను, అటు శ్రీసభేతర ప్రపంచాన్నీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నాయి.

అయితే ఫ్రాన్సిస్ జగద్గురువుల భావజాలంతో, విలక్షణమైన ప్రబోధాలతో ఏకీభవించనివారు కూడా కొందరు ఉన్నారు. అయినా తాను నమ్మిన ప్రభుక్రీస్తు దారిలో ఫ్రాన్సిస్ జగద్గురువులు నిర్భయంగా నడుస్తూనే ఉన్నారు, అదే బాటలో శ్రీసభనూ నడిపిస్తున్నారు.

ఏదేమైనా అధిక సంఖ్యాకుల దృష్టిలో – ఫ్రాన్సిస్ జగద్గురువులు నిజాయితీపరులు, సద్వివేచన గల విమర్శకులు, పరిణామ సిద్ధాంత వ్యతిరేకులకు విరోధి. స్థూలదృష్టితో చూస్తే ఆయన సంప్రదాయ వాది. అంతేకాదు – సంపన్న దేశాల పీఠాధిపతులకయితే కంటిలో నలుసు, అభివృద్ధి చెందుతున్న దేశాల పీఠాధిపతులకు మాత్రం ఆయనొక సుమాతృక, సన్మార్గదర్శి.

చివరిగా – ఫ్రాన్సిస్ జగద్గురువుల ఆలోచనా సరళిని గానీ, మాటలను చేతలను గానీ నిశితంగా పరిశీలించే వారికి మాత్రం ఫ్రాన్సిస్ పాపుగారు "క్రీస్తు కేంద్రకం"గా పరిచర్య చేస్తున్నారనీ వాటికన్ (రోమా) కేంద్రకం"గా పనిచేయడం లేదని స్పష్టంగా బోధపడుతుంది. అవును. మన జగద్గురువులు తాము ఆచరించే ధర్మాన్నే బోధిస్తున్నారు, తాము బోధిస్తున్న సువార్తా విలువలను తూ.చ. తప్పక పాటిస్తున్నారు. మరోమాటలో చెప్పాలంటే – పేతురు వారసులుగా, విశ్వశ్రీసభ అధినాయకులుగా ఫ్రాన్సిస్ జగద్గురువులు సువార్తా మార్గంలో ముందు తాను నడుస్తూ తన వెంట శ్రీసభ నడిపిస్తున్నారు, దారితప్పిన విశ్వాసులను వాత్సల్యంతో చేరదీసి ఆదరిస్తున్నారు. తన ఆదర్శ జీవనం ద్వారా సమకాలీన ప్రపంచాన్నీ ప్రభు మార్గానికి "ఆకర్షిస్తు"న్నారు.

ఫ్రాన్సిస్ జగద్గురువుల అభిప్రాయం ప్రకారం రాబోయే రోజులలో శ్రీసభ సువార్తా పరిచర్య – క్రీస్తు సాహచర్యం ద్వారా కలిగే పరమానందాన్ని ఇతరులతో

పంచుకోవడం ద్వారా జరగాలి. ఇలా క్రీస్తు ద్వారా కలిగే పరమానందాన్ని పదుగురితో పంచుకోవడమే సువార్తా ప్రబోధం ప్రధాన లక్ష్యం కావాలి.

"సువార్తా ప్రబోధం చేసే క్రమంలో క్రైస్తవులు ఇతరుల మీద నియమ నిబంధనల భారాన్ని మోపేవారుగా కాకుండా, తాము అనుభవిస్తున్న సువార్తానందాన్ని సాటివారితో పంచుకొనే వారుగా ఉండాలి. దేవుని సన్నిధానంలో జరిగే గొప్ప విందు భోజనానికి వారిని ఆహ్వానిస్తున్నట్లు ఉండాలి. ఇక్కడ మనం తెలుసుకోవలసిన సత్యమేమిటంటే – శ్రీసభ ఎదుగుదల మతాంతరీకరణం మీదనో, మత మార్పిడుల మీదనో ఆధారపడి ఉండదు. ఇతరులను "ఆకర్షించేశక్తి" వల్లనే శ్రీసభ ఎదుగుతుంది, విస్తరిస్తుంది" (సువార్తానందం–15).

"తెలుగు కథోలిక దైవశాస్త్ర సమాఖ్య" నిర్వాహకులు నాకిచ్చిన అంశం "క్రీస్తు ఒక్కడే రక్షకుడా? క్రీస్తు ద్వారా సర్వజనులకు సకల సృష్టికి రక్షణ సాధ్యమా?". అత్యంత జటిలమైన ఈ అంశాన్ని దైవశాస్త్ర పరంగా చర్చించడం, వ్యాఖ్యానించడం – కత్తిమీద సాములాంటిదని మనందరికీ తెలుసు. "దోమినుస్ జీజస్", "సువార్తానందం" అధికార పత్రాల ఆధారంగా చర్చను కొనసాగించడానికి ప్రయత్నిస్తాను.

ప్రస్తుతం మనం "సుహృద్భావ చర్చల యుగం"లో ఉన్నాం. మొండిగా చేసే వాద ప్రతివాదాలకు కాలం చెల్లింది. కనుకనే ఆధునిక క్రీస్తుశాస్త్రం అన్యమతానుయాయులతో జరిపే సుహృద్భావ చర్చలకే అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇదే స్ఫూర్తితో ఈ దిగువ అంశాలను మీముందుంచుతున్నాం. సమిష్టిగా చేసే సత్యశోధనకు మీ అందరికీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

## ద్వితీయ వాటికన్ మహాసభ ప్రబోధాలలో క్రీస్తు

ద్వితీయ వాటికన్ మహాసభ అధికారపత్రం – "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ (GS 22)" క్రీస్తు తత్త్వ మహత్త్వాల గురించి ఇలా చెబుతోంది:

మానవుడుగా అవతరించిన దైవకుమారుడు యేసుక్రీస్తు. ఆయన అవతార తత్త్వాన్ని అర్థం చేసుకుంటేనే ప్రపంచంలోని మానవులకున్న మౌలిక విలువ,

ఆత్మ గౌరవం, వారి జీవన గమ్యం తాలూకు నిగూఢ సత్యాలు మనకు బోధపడతాయి.

ఆదాము ఆదిమానవుడు – అని బైబుల్ గ్రంథం చెబుతోంది. నిజానికి – ఆదాము రాబోయే కాలంలో అవతరించబోయే పరిపూర్ణ మానవుడు క్రీస్తుకు ఒకానొక నమూనా మాత్రమే. క్రీస్తు ప్రభువే నూతన మానవుడు, పరిపూర్ణ మానవుడు. ఆయనే తండ్రి భగవానుని ప్రేమతత్త్వాన్ని మానవులకు వెల్లడించాడు. అలానే – దేవుని సృష్టి ప్రణాళికలో మానవుడికి గల ప్రత్యేక స్థానాన్ని ప్రాధాన్యాన్నీ, అతడికి దేవుడు నిర్దేశించిన జీవన మార్గాన్నీ, జీవన గమ్యాన్నీ స్పష్టంగా తెలియజేశాడు. అంతేకాదు – మానవుడిలో ఉండవలసిన సద్గుణాలన్నీ క్రీస్తు ప్రభువులో మూర్తీభవించి ఉంటాయి, గనుకనే ఆయన పరిపూర్ణుడైన మానవుడు.

మరో మార్గంలో చెప్పాలంటే "నిరాకారుడైన దేవునికి సాకార రూపం" యేసుక్రీస్తు ప్రభువు (కొలస్సీ 1:15). ఆయనే ఆది మానవులు చేసిన తొలిపాపం కారణంగా కళంకితమైన మానవరూపాన్ని కడిగిన ముత్యంలా మార్చాడు. వికృతంగా మారిన మానవతత్త్వాన్ని సంస్కరించి చక్కదిద్దాడు. దేవుడితో తెగిపోయిన ఆధ్యాత్మిక బంధాన్ని పునరుద్ధరించాడు. తిరిగి మానవుణ్ణి దేవుని ప్రతిరూపంగా మలిచాడు.

అంతేకాదు – మచ్చలేని గొర్రెపిల్లలాంటి క్రీస్తుప్రభువు, స్వచ్ఛందంగా తన రక్తాన్ని ధారపోసి మనకు నవజీవం పోశాడు; క్రీస్తు ప్రభు అర్పించిన సిలువ బలి ద్వారా దేవుడు మన పాపాలను మన్నించి మనలను తిరిగి తన ఆత్మీయులనుగా స్వీకరించాడు. మనకూ మనసాటి వారికీ మధ్య సఖ్యతా సంబంధాలను పునరుద్ధరించాడు. ఇదంతా – పాపపు బంధాల నుండి సైతాను దాస్యం నుంచి మనలను విముక్తులను కావించడం ద్వారా చేశాడు. కనుకనే – అపోస్తలుల మాదిరిగా నేడు మనలోని ప్రతి ఒక్కరమూ "దైవ కుమారుడు నన్ను ప్రేమతో చేరదీశాడు. నా కోసమే ఆయన మరణించాడు" (గలతీ 2:20) అని రూఢిగా చెప్పుకోవచ్చును.

ఇది కేవలం క్రైస్తవులకు మాత్రమే వర్తించే సత్యం; ఎవరి హృదయాల్లో దేవుని కృపావరాలు అదృశ్యంగా వర్షిస్తూ ఉంటాయో – అలాంటి సహృదయులందరు క్రీస్తు మరణ పునరుత్థానాలలో భాగస్వాములవుతారు. ముక్తిని పొందగలుగుతారు. ఎందుకంటే – క్రీస్తు మానవులందరి విమోచనం కోసం మరణించారు. కనుక పవిత్రాత్మ నేతృత్వంలో మానవులందరు – దేవునికి మాత్రమే తెలిసిన నిగూఢ మార్గంలో – క్రీస్తు మరణ పునరుత్థానాలలో భాగస్వామ్యాన్ని పొందగలుగుతారు.

మరణం ద్వారా మరణాన్ని జయించిన విజేత క్రీస్తు ప్రభువు; తన మరణం ద్వారా మనకు పరిపూర్ణమైన జీవాన్ని ప్రాప్తింపజేసిన జీవ ప్రదాత ఆయన; ఆ దైవకుమారుని ద్వారానే మనమూ దేవుని కుమారులుగా కుమార్తెలుగా మారి, పవిత్రాత్మ ద్వారా మహోన్నతుడైన దేవుని "అబ్బా, తండ్రీ" అని నోరారా పిలుచుకోగలుగుతాం!

ఇలా మానవ రక్షణ చరిత్రను "క్రీస్తు కేంద్రం" దృక్కోణం నుండి – అర్థం చేసుకొనే ప్రయత్నం చేయడం క్రీస్తు శాస్త్రంలో మనకు కనిపించే మరో ప్రధానాంశం. "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" (జి.ఎస్. 22) అధికార పత్రంలో మనకు కనిపించే యథార్థం కూడ ఇదే.

అవును. క్రీస్తు కేంద్రక దృక్పథంతో చూచినపుడే మనం మానవ మనుగడలోని పరమార్థాన్ని అర్థం చేసుకోగలుగుతాం. మానవులమైన మనం మన మనుగడ ద్వారా – క్రీస్తు మనుష్యావతార పరమ రహస్యాన్ని గ్రహించలేం. క్రీస్తు అవతార తత్త్వం ద్వారా మాత్రమే మానవ జాతి పుట్టు పూర్వోత్తరాలను అర్థ పరమార్థాలను తెలుసుకోగలుగుతాం.

దేవుని కుమారుడైన క్రీస్తు ప్రభువే లోకానికి తండ్రి దేవుని దివ్య మంగళ మూర్తిని సాక్షాత్కరింపజేస్తాడు; నిజానికి – చరాచర జగత్ సర్వస్వానికీ తండ్రి దేవుని ఆవిష్కరించేవారు క్రీస్తు భగవానుడేనని గ్రహించాలి. ఇదే సత్యాన్ని "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" అధికార పత్రం (జి.ఎస్. 22) మరింత స్పష్టంగా వివరిస్తుంది:

> "క్రీస్తు ప్రభువే అంతిమ ఆదాము, నూతన మానవుడు, పరిపూర్ణ మానవుడు. ఆయనే తండ్రి భగవానుని ప్రేమ తత్త్వాన్ని మానవులకు వెల్లడించారు. అలాగే – దేవుని సృష్టి ప్రణాళికలో మానవుడికి గల ప్రత్యేక స్థానాన్నీ ప్రాధాన్యాన్నీ, అతడికి దేవుడు నిర్దేశించిన జీవన మార్గాన్నీ జీవన గమ్యాన్నీ, స్పష్టంగా తెలియజేశారు"

ఇలా క్రీస్తు ప్రభువే "కేంద్రం"గా జీవించడం వలననే మానవులమైన మనం మన ఆలోచన శక్తిని మార్చుకోగలుగుతున్నాం. మానవులమైన మనం దేవుళ్లం కామని మనుష్యావతారం దాల్చిన క్రీస్తును, దేవుని ప్రతిరూపమైన క్రీస్తును చూచినపుడు మాత్రమే తెలుసుకోగలుగుతాం. అంతేకాదు – మానవులమైన మనకు గల ఔన్నత్యాన్ని తెలుసుకోడానికి కూడ మనుష్యావతారుడైన క్రీస్తు వైపు మన దృష్టిని మరల్చాలి. అలాగే – మనిషిని మనషి అర్థం చేసుకోవాలన్నా, మానవులు పరస్పరం గౌరవించుకోవాలన్నా, ప్రేమాదరణలతో సహజీవనం చేయాలన్నా– మనం క్రీస్తు ప్రభువు వైపు మరలక తప్పదు. రెండవ వాటికన్ మహాసభ ఇలా బోధిస్తోంది: "మనుష్యావతారుడైన క్రీస్తు వెలుగులోనే మనం మన మానవత్వపు గొప్పతనాన్ని గ్రహించగలుగుతాం".

అదే విధంగా – పునీత పౌలుగారు "నాలో జీవించునది నేను కాదు, క్రీస్తు" అని పలికినపుడు ఆయన తన మానవత్వాన్ని పోగొట్టుకోలేదు. అలాగే – ప్రభు క్రీస్తు మనలో ఉంటే మనమూ మన మానవ స్వభావాన్ని నూత్నీకరించు కుంటామో తప్ప పోగొట్టుకోము. దీని ద్వారా మనకు అర్థమయ్యేది ఏమిటంటే – మానవ సంబంధమైనది, దేవునితో సంబంధం లేనిదీ కూడ – దేవుని ఉనికిని కనుగొనడానికి ఒక సాధనంగా సహకరిస్తుంది. ఇది మనుష్యావతారం దాల్చిన క్రీస్తు ద్వారానే సాధ్యమవుతుందని కూడ పునీత యోహాను స్పష్టం చేస్తున్నారు: "ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను" (యోహాను 1:14). ఇలా దైవ కుమారుడు మనుష్యావతారం దాల్చడం ద్వారా, లోకంలోని మానవులందరితోను (స్త్రీ పురుషులందరితోను) నిగూఢమైన రీతిలో సత్సంబంధాలు ఏర్పరచుకో గలుగుతారు. తద్వారా మానవ మాత్రులు సైతం దైవ కుమారుని శరీరంలో అంతర్భాగాలు కాగలుగుతారు.

ఇలా ప్రభు దేహంలో అవయవాలుగా మారాలంటే – విధిగా మనం ఆత్మశుద్ధీకరణం పొందాలి, దైవరాజ్య విలువలతో జీవనయాత్ర సాగించాలి, సాటి వారితో కలిసి ప్రభు మార్గంలో లౌకిక జీవన యాత్రను కొనసాగించాలి. ఇదే సత్యాన్ని ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రం "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ" (జి.ఎస్.24) మరింత స్పష్టంగా ప్రబోధిస్తుంది.

"మానవులంతా ఉమ్మడి కుటుంబంగా మారాలని, పరస్పరం సోదరుల్లా మెలగాలనీ తండ్రి భగవానుని ఆకాంక్ష. అవును, తండ్రిదేవుడు – తన అనురాగాన్ని పొందే మానవులందరు పరస్పరం అనుంగు సోదరుల్లా కలసి మెలసి జీవించాలని కోరుకుంటున్నారు.

నిజానికి – దేవుడే తన స్వహస్తాలతో తన రూపు రేఖలతో సృష్టించిన మానవులు – ఏ జాతికి ఏ ప్రాంతానికి ఏ సంస్కృతికి చెందిన వారైనా అందరి గమ్యమూ ఒక్కటే: అదే మరణానంతరం తమను సృజించిన భగవానుడి సన్నిధానానికి చేరుకోవడం. ఎందుకంటే – "ఒక్క పురుషుని నుండియే ఆయన అన్ని జాతుల జనులను కలిగించి, భూలోకమంతట వారిని నివసింపజేసెను. ఆయన ముందుగానే వారి వారి కాలపరిమితులను వారి వారి నివసించు స్థలముల సరిహద్దులను స్థిరపరచెను" (అ.చ.17:26).

ఒక్కడే దేవుడు. ఆయన సృష్టించిన మానవులంతా ఒకే సంతతి. కనుక – దేవున్ని ప్రేమించేవారు, ఆయన సంతతినీ ప్రేమిస్తారు. కనుక దైవ ప్రేమకు, సోదర ప్రేమకూ తేడా లేదని, తేడా చూపరాదని పవిత్రగ్రంథం స్పష్టంగా చెబుతోంది. "ఈ ఆజ్ఞలన్నియును, ఇతర ఆజ్ఞ లేవియైనను 'నిన్ను నీవు ప్రేమించుకొనునట్లే నీ పొరుగువారిని ప్రేమింపుము' అను ఒకే ఆజ్ఞయందు ఇమిడియున్నవి. కనుక ప్రేమ కలిగియుండుట ధర్మశాస్త్రమును నెరవేర్చుటయే" (రోమీ.13:9–10; చూడండి 1 యోహాను 4:20).

ముఖ్యంగా మానవుల మధ్య అంతరాలు తరిగి, లోకమంతా ఏకమవుతున్న ఈ ఆధునాతన ప్రపంచంలో మానవులు పరస్పరం సఖ్యతా సౌహార్దాలతో మెలగడం, శాంతియుత సహజీవనం పట్ల మొగ్గు చూపడం

ఎంతయినా అవసరం. అంతేకాదు త్రిత్వైక దేవునిలో గల ముగ్గురు వ్యక్తుల (పిత పుత్ర పవిత్రాత్మల) మధ్య గల అనురాగ బంధానికీ, దేవుని సంతానమైన మానవుల మధ్య ఉండే సోదర బాంధవ్యానికీ దగ్గరి పోలికలున్నాయని కూడా పవిత్ర గ్రంథం వెల్లడిస్తోంది. "ఓ తండ్రీ! నేను నీయందును, నీవు నాయందును ఉండునట్లు వారిని మనయందు ఉండనిమ్ము.. వారు ఒకరుగ ఐక్యమై ఉండనిమ్ము" (యోహాను 17:21-22) అంటూ యేసు ప్రభువు చేసిన ప్రార్థన మనకు ఇదే సత్యాన్ని బోధిస్తుంది. మానవుల మమతానుబంధాలకు గల దివ్యత్వాన్ని వెల్లడిస్తుంది. సత్యం, ప్రేమ పునాదులపై నెలకొనే మానవ సంబంధాలు దేవునితో మానవులకు గల సాన్నిహిత్యానికి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

అలాగే యావత్ సృష్టిలోను, సమస్త జీవకోటిలోను కేవలం మానవున్ని మాత్రమే దేవుడు ప్రత్యేకంగా ఎన్నుకున్నాడు. అతడి జీవితం సార్థకమయ్యే మార్గాన్ని ఉపదేశించాడు. ఆయన సత్యోపదేశం ప్రకారం చూచినా 'ఆత్మ సమర్పణం ద్వారానే మానవుడు తన సత్యస్వరూపాన్ని తెలుసుకోగలుగుతాడు': "తన ప్రాణమును కాపాడుకొన యత్నించువాడు దానిని కోల్పోవును. తన ప్రాణమును కోల్పోవువాడు దానిని కాపాడుకొనును" అంటే దైవోపదేశం ప్రకారం అహంభావాన్ని వీడి, స్వార్థ ప్రయోజనాలను తెగనాడి, పరార్థాన్నీ, పరుల క్షేమాన్ని కోరుకుంటూ స్నేహ హస్తాలను చాచగలిగినపుడే మానవుల మధ్య సఖ్యాతా సంఘీభావాలు వర్ధిల్ల గలుగుతాయి.

## "సువార్తానందం" Vs "దోమినుస్ జీజస్"

## పరంపర (Continuity)

ఫ్రాన్సిస్ జగద్గురువులు 2013లో వెలువరించిన అధికార ప్రబోధం "సువార్తానందం". ద్వితీయ వాటికన్ మహాసభ స్ఫూర్తితో, విశ్వశ్రీసభ ద్వారా సువార్తా పరిచర్యకు సరికొత్త దిశానిర్దేశం చేయడానికే ఈ అధికార పత్రాన్ని వెలువరించారు. "ప్రభువు తెచ్చిన పరమానందంలో అందరు భాగస్వాములే, ఎవరికీ మినహాయింపులు లేవు'' అంటూ కతోలిక విశ్వాసులను, ఇతర మతానుయాయులను ఫ్రాన్సిస్ జగద్గురువులు 'సువార్తానందం'లో పాలు పంచుకోడానికి సాదరంగా ఆహ్వానిస్తున్నారు (సువార్తానందం, నెం. 3).

ఫ్రాన్సిస్ జగద్గురువుల ఉద్దేశ్యం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా వినిమయ సంస్కృతి సృష్టిస్తోన్న సమస్యలను సవాళ్లను పరిగణలోనికి తీసుకుంటూ సువార్తా పరిచర్య చేయాలి. అప్పుడే సువార్తా పరిచర్య అర్థవంతం అవుతుంది, సంపూర్ణ మానవుని సంపూర్ణ సువార్తగా వర్ధిల్లుతుంది.

ఇలా వర్ణ, వర్గ, జాతి, మత వ్యత్యాసాలకు అతీతంగా స్త్రీ పురుష వివక్షకు, ధనిక పేద విచక్షణకు వ్యతిరేకంగా, పీడిత జన పక్షపాతిగా శ్రీసభ సువార్తా పరిచర్య జరగాలని ఆదేశించడం, ప్రయోగాత్మకంగా కార్యాచరణకు పూనుకోవడం – ఫ్రాన్సిస్ జగద్గురువుల ప్రత్యేకత. ఈ ప్రత్యేకత “సువార్తానందం”లో మనకు అడుగడుగున కనిపిస్తుంది (ఇ.జి.50, 186, 193).

ఈ నేపథ్యంలోనే ఫ్రాన్సిస్ జగద్గురువులు – 16వ బెనెడిక్ట్ పాపుగారి సామాజిక ప్రబోధంలోని కీలకమైన అంశాలను ‘‘సువార్తానందం’’లో పొందుపరిచారు.

ఈ నేపథ్యంలోనే ఫ్రాన్సిస్ జగద్గురువులు – 16వ బెనెడిక్ట్ పాపుగారి సామాజిక ప్రబోధంలోని కీలకమైన అంశాలను ‘‘సువార్తానందం’’లో పొందుపరిచారు:

> “క్రైస్తవ జీవితము అంటే మనంతట మనం ఎన్నుకొని అనుసరించే నీతి మార్గమో, ఆదర్శ మార్గమో కాదు. క్రైస్తవ జీవితమూ అంటే వ్యక్తిగతంగా దేవుని ప్రేమానుభవం పొందడం, దేవుని ప్రేమ స్వరూపుడైన క్రీస్తు ప్రభువును వ్యక్తిగతంగా తెలుసుకోవడం, తద్వారా లభించే సరికొత్త భవిష్యద్దర్శనానికి అనుగుణంగా – క్రీస్తు చూపిన దిశలో క్రీస్తు చూపిన మార్గంలో జీవన యాత్ర కొనసాగించడం. అదే క్రైస్తవ జీవితం” (సువార్తానందం నెం.7)

ఇదంతా దేవుని రక్షణ ప్రణాళికకు అనుగుణంగానే జరుగుతున్నదని ఇరువురు జగద్గురువులూ స్పష్టం చేస్తున్నారు. పైన పేర్కొన్న వేదాంత సత్యాలను వీరు పవిత్ర గ్రంథ పఠన ధ్యానాల ద్వారానే ఆకళింపు చేసుకోగలుగుతున్నారు, అదే సత్య సంపదను సాటి విశ్వాసులతో పంచుకోగలుగుతున్నారు:

**"సువార్తానందం"లో ఫ్రాన్సిస్ జగద్గురువులు పేర్కొన్న బైబులు వచనాలు:**

- "అందుకు యేసు 'ఏడు కాదు, ఏడు డెబ్బరి పర్యాయాలు (క్షమించాలి)' అని సమాధానమిచ్చెను" (మత్తయి 18:22).
- "ప్రభూ నీ జనులకు మహదానందమును ఒసగతివి, వారిని సంతోష చిత్తులను గావించితివి (యెషయా 9:3)
- "ఆకసమా! ఆనందనాదము చేయుము,
  భూమీ, సంతసింపుము,
  పర్వతములారా, సంతోషముతో పాడుడు,
  ప్రభువు తన ప్రజలను ఓదార్చును
  బాధలకు గురియైన తన జనుల మీద జాలి చూపును" (యెషయా 49:13)
- "దేవదూత వారితో ఇట్లనెను:
  మీరు భయపడవలదు.
  సమస్త ప్రజలకు పరమానందము కలిగించు
  శుభ సమాచారమును మీకు వినిపంచెదను" (లూకా 2:10).
- "అట్లే హృదయ పరివర్తనము అవసరములేని
  తొంబది తొమ్మిది మంది నీతిమంతుల కంటె,
  హృదయ పరివర్తనము పొందు
  ఒక పాపాత్ముని విషయమై పరలోకమున ఎక్కువ
  ఆనందము ఉండునని నేను మీతో చెప్పుచున్నాను" (లూకా 15:7).

**16వ బెనెడిక్ట్ జగద్గురువులు "దోమినుస్ జీజస్" అధికార ప్రకటనలో పేర్కొన్న బైబులు వచనాలు :**

- "లోక రక్షకునిగ దేవుడు తన కుమారుని పంపెననుట
  మనము చూచితిమి, పరులకు బోధించితిమి" (1 యోహాను 4:14).
- "...యేసుక్రీస్తు పేరిట నీవు నడువుము..." (అ.చ.3:1-8).
- "ఆయన యందు తప్ప వేరొకని యందు రక్షణ లభింపదు.

ఏలయన, ప్రపంచమున రక్షణ కలిగించు నామము
వేరొకరికి ఇవ్వబడలేదు" (అ.చ. 4:12)

- "...జీవితులకు మృతులకు తీర్పరిగా
దేవుడు నియమించినవాడు ఈయనయే" (అ.చ. 10:42-43).
- "మానవులు అందరును రక్షింపబడవలయుననియు,
సత్యమును తెలిసికొనవలయుననియు దేవుని అభిలాష.
దేవుడు ఒక్కడే.. మధ్యవర్తియు ఒక్కడే..." (1 తిమోతి 2:4-6).

## సత్య సంఘర్షణ?

"దేవుడు మనతో ఉన్నారని యేసుక్రీస్తు ప్రభువు తెలియజేశారు. మనల్ని పాపాంధకారం నుంచి, మరణ బంధనాల నుంచి విముక్తులను చేయడానికి, మనకు నిత్యజీవాన్ని ప్రసాదించడానికే దేవుడు మన మధ్యకు విచ్చేశారని వెల్లడించారు. ఇలా తాను ఆవిష్కరించిన దైవ ప్రణాళికను ప్రభువు తానే నెరవేర్చడం విశేషం" (దైవవాక్కు నెం:4).

దీనిని బట్టి దేవుని పిలుపు లోకంలోని మానవులందరికీ వర్తిస్తుంది. దేవుడు క్రీస్తు ప్రభువు ద్వారా ఆవిష్కరించిన నిగూఢ సత్యాలనన్నింటినీ అందరికీ ప్రకటించాలనీ, దేవుని అపారమైన ప్రేమ కారుణ్యాలను అందరూ చవిచూడ గలగాలనీ ప్రభువు కోరుతున్నారు.

లోకంలోని మానవులందరు క్రీస్తు ప్రభువు ద్వారా దేవుడు ప్రసాదించే రక్షణ భాగ్యంలో భాగస్వాములు కాగలుగుతారని "దైవవాక్కు (Dei Verbum)" అధికారపత్రం ఇంత స్పష్టంగా చెబుతున్నప్పటికీ "దోమినుస్ జీజస్" అధికార ప్రకటన మాత్రం ఈ సత్యాన్ని పాక్షికంగా మాత్రమే ప్రస్తావించడం ప్రశ్నార్థక మవుతోంది, వేదాంతపరమైన సంఘర్షణలకు దారితీస్తోంది (చూడండి. దోమినుస్ జీజస్, నెం. 5).

ఇలా "దోమినుస్ జీజస్" అధికార ప్రకటన తిరస్కరించిన సార్వజనీన రక్షణ అంశాన్ని ఫ్రాన్సిస్ జగద్గురువులు "సువార్తానందం"లో పున: ప్రస్తావించారు. వేదాంత వర్గాల్లో కూడా ఇది చర్చనీయాంశమయింది. ఇదే "థియోలజీ ఫ్రం

అబౌ", "థియోలజీ ఫ్రం బిలో" అనే వేదాంత చర్చలకు, వాదోపవాదాలకు దారితీసింది.

## క్రీస్తు ఒక్కడే రక్షకుడా?

## క్రీస్తు ద్వారా సర్వజనులకు సకల సృష్టికి రక్షణ సాధ్యమా?

సత్యం గొప్పది. వేదాంత పరిజ్ఞానంతోనే మనం సత్యాసత్యాల తారతమ్యాన్ని గ్రమించాలి. సంపూర్ణ సత్యం మనకు దేవుని వద్దనే లభిస్తుంది. చారిత్రక స్థితిగతుల నేపథ్యంలోనే మనం సత్యాన్ని తెలుసుకోగలుగుతాం.

మానవమాత్రుడు దైవాన్నీ, దేవుని సార్వత్రిక ఉనికినీ పూర్తిగా తెలుసుకోలేడు. దేవుని గురించి మనకు గల అవగాహన కూడా పాక్షికమైనదే. అయినప్పటికి ప్రభువు శిష్యులు క్రీస్తు ప్రభువును "ముక్తిమార్గం"గా భావించారు. అదే అవగాహనతో మనం కూడ క్రీస్తును రక్షణ మార్గంగా అర్థం చేసుకోవాలి. అప్పుడే మనం ఇతర మతాలకు చెందిన వారిని కూడ రక్షణ ప్రస్థానంలో సహయాత్రికులుగా భావించగలుగుతాం, ప్రేమతో ఆహ్వానించగలుగుతాం.

## సార్వజనీనత

రక్షణ భ్యాగం వ్యక్తిగతం మాత్రమే కాదు, అది సామూహికం కూడ. పతనమైన మానవ జాతిని క్రీస్తు తన శ్రమలు మరణ పునరుత్థానాల ద్వారా తండ్రి దేవుని సాన్నిధ్యానికి చేర్చడమే సార్వజననీ రక్షణం. అలాంటి రక్షణ భాగ్యాన్ని పొందడమే మానవ మనుగడ పరమార్థం.

"Salvation is a Cosmic Project, that is working itself in history according to the plan of God. The whole of history is therefore salvation. Salvation is not simply the saving of individual souls. It is social and cosmic. The whole world is moving towards a transformation. God, the Word and the Spirit and active in teaching the universe to its ultimate consummation when God will be all in all"

ఈ రక్షణ భాగ్యం లోకంలోని మానవులందరికీ చెందినది. కనుక రక్షణ కేవలం క్రైస్తవులకు మాత్రమేననుకోవడం పొరపాటు. ఈ రక్షా సాధనమనే మహాయాగంలో క్రీస్తు ప్రభువొక సేవకుడు, శ్రీసభ ఒక సేవకురాలు. వీరు ఈ

సేవకధర్మాన్ని నిష్ఠగా నిర్వర్తించినపుడే ఇహలోకంలో దేవుని రాజ్యస్థాపన జరుగుతుంది. ఈ దైవరాజ్యంలో అల్పులు అధికులు అనే తారతమ్యం లేకుండా ధనికులు పేదలనే వ్యత్యాసం చూపకుండా దేవుని పూర్ణ హృదయంతో ప్రేమిస్తూ, తన సహోదరుని కూడా తనవలె ప్రేమించగలిగినపుడే మనకు రక్షావరం సిద్ధిస్తుంది, క్రీస్తు సార్వజనీనత సాకారమవుతుంది.

## ఏకత్వం (Unicity)

ఈ సార్వజనీనత చారిత్రక క్రీస్తుతో ముడిపడి ఉంటుంది, క్రీస్తు ద్వారానే మన అనుభవానికి వస్తుంది. అయితే ఈ దైవానుభవం కూడ ఉత్థాన క్రీస్తు పవిత్రాత్మల అనుగ్రహంతోనే లభిస్తుంది. ఇదే సత్యాన్ని ఫ్రాన్సిస్ జగద్గురువులు "సువార్తానందం"లో ఇలా వివరించారు:

"క్రీస్తు ప్రభు పునరుత్థానం గతానికి చెందిన ఒకానొక సంఘటన కాదు. అది అన్ని కాలాలకు చెందిన అపూర్వ ఘటన. క్రీస్తు పునరుత్థాన మహాశక్తి నేటికీ యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. ఎక్కడ అంతా మృతప్రాయంగా కనిపిస్తుందో, అక్కడ హఠాత్తుగా పునరుత్థాన సంకేతాలు ఆవిష్కృత మవుతాయి. అదే ప్రభు పునరుత్థాన శక్తి ప్రభావం. ఈ పునరుత్థాన శక్తిని ఎవరూ నిరోధించలేరు" (సువార్తానందం, నెం. 276).

మరోమాటలో చెప్పాలంటే క్రీస్తు ద్వారా క్రీస్తుని యందు క్రీస్తుతో సాన్నిహిత్యం పెంపొందించుకున్నపుడు, మానవులమైన మనం కూడ క్రీస్తు ప్రతిరూపాలుగా మారగలుగుతాం, మానవులకు గల ఔన్నత్యాన్ని గుర్తించ గలుగుతాం (It is a matter of seeing through the Eyes of the one who is seeing us).

## ముగింపు

ఈ "సువార్తానందం", "దోమినుస్ జీజస్" అధికార పత్రాల అధ్యయనం ద్వారా మనం రెండు అంశాలను స్పష్టంగా తెలుసుకోగలుగుతున్నాం. ఒకటి – సువార్తా పరిచర్య (Salvation), రెండు – క్రీస్తు శాస్త్ర పురోగమనం (the development of Christology). ఈ రెండు అంశాలపై శ్రీసభలో ఎన్నడు ఏకాభిప్రాయం కనిపించేది కాదు, సైద్ధాంతికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉండేవి.

"దోమినుస్ జీజస్" అధికార ప్రకటనలోని ప్రధానాంశాలన్నీ - ఖాల్సెడాన్ మహాసభ ప్రతిపాదించిన క్రీస్తు శాస్త్ర బోధనలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. కనుకనే, ఆ అధికార ప్రకటనలో సాంప్రదాయక ఛాయలే అధికంగా కనిపిస్తాయి; నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే "దోమినుస్ జీజస్" అధికార ప్రకటనలో కొత్తదనమేదీ అగుపించదు.

ఇందుకు భిన్నంగా "సువార్తానందం"లో ఫ్రాన్సిస్ జగద్గురువులు క్రైస్తవ జీవనానికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చారు, నవీన విశ్వాస పరిభాషను శ్రీసభ పరిచర్యలో ప్రవేశపెట్టారు, మనలోని ప్రతి ఒక్కరినీ ప్రభు యేసు ప్రతిరూపాలుగా పరివర్తనం చెందమని ఆహ్వానిస్తున్నారు (సువార్తానందం నెం. 160).

విశ్వాసంలో దృఢపడటమూ అంటే మత సిద్ధాంతాలకు బానిసలం కావడం కాదు, ప్రభు యేసు ప్రేమాజ్ఞను నిష్ఠగా పాటిస్తూ, ఉత్థాన క్రీస్తు వెలుగులో, సాటి మానవులందరితో కలిసి సువార్తానందాన్ని పంచుకోవడం (సువార్తానందం నెం. 164).

చివరగా - "క్రీస్తు ఎవరు? క్రీస్తు అంటే ఏమిటి? రక్షణ అంటే ఏమిటి? క్రీస్తు ఏ విధంగా ఆసియా ప్రజలకు ఒక 'మార్గం' అవుతారు?" అంటూ అఖిల ఆసియా పీఠాధిపతుల విశ్వ శ్రీసభ అధిష్టానాన్ని అడిగారు. కానీ వీరు లేవనెత్తిన అంశాలపై నేటికీ సమగ్రమైన శాస్త్రీయ అధ్యయనం జరుగనే లేదు.

పైగా క్రీస్తు తత్త్వ మహత్త్వాలను కూడ గ్రీకు-లాటీను భాషల్లోనే బోధించడం ఆనవాయితీ అయింది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. గ్రీకు-రోమను ఆలోచనా సరళికి స్వస్తి చెప్పి, మనం స్పృశించే క్రీస్తును (1 యోహాను 1:1-4) విశ్వజనీన రక్షకునిగా, రక్షణ మార్గంగా, "మంచి మనస్సు"తో, ఆదర్శ జీవనం"తో - సువార్తా ప్రబోధం చేయాలి.

మరో మాటలో చెప్పాలంటే - క్రైస్తవ జీవనం తటస్థమైనది కాదు, అది నిత్యమూ చైతన్యంతో పరవళ్లు త్రొక్కే జీవనది. ఈ జీవన క్రమాన్నే కార్ల్ రానర్ (Karl Rahner) గారు "అన్వేషిస్తోన్న క్రీస్తుశాస్త్రం" అన్నారు. ఈ అన్వేషణ కొనసాగాలి, ప్రభువు మరల వచ్చేవరకు మన అన్వేషణ కొనసాగుతూనే ఉండాలి.

**REFERENCES**

Jacques Dupuis, Towards a Christian Theology of Religious Pluralism (Maryknoll: Orbis Books, 1999).

Pope John Paul II, Christ is mediator and fullness of Revelation (Friday, 28 January, 2000).

Congregation for the Doctrine of Faith, Declaration Dominus Iesus: On the Unicity and Salvific Universality of Jesus and the Church (Vatican City: Liberia Editrice Vaticana, 2000).

G. Gispert-Sauch, "The Declaration Dominus Iesus," VJTR 64/9 (2000): 782-784.

J. Neuner, "The Fullness of Revelation: Reflections on the Declaration Dominus Iesus," VJTR 65/1 (2001): 07-13.

Sebastian Painadath (ed.), Dominus Jesus: A Theological Response, Jeevadhara, XXXI/183 (2001): 171-248.

S. Arul Pragasam, "Dominus Iesus and its Invitation to Theology: Exploring the Christological Implications of the Declaration," VJTR 65/6 (2001): 581-588.

David Alexander, "Jesus' Theological Methodology for 21st Century Asian Christians," East Asian Pastoral Review 49/4 (2012): 313-318.

Pope Francis, Evangelii Gaudium: The Joy of the Gospel, Gunturu Yesudpadam (trans.), Suvaratanandam (Secunderabad: Jeevan Institute of Printing), 2014.


Klaus Kraemer and Klaus Vellguth (eds.), Evangelii Gaudium: Voices of the Universal Church (Phillipines: Claritian Communication Foundation), 2015.

Francis X. Clooney, https://www.americamagazine.org/content/all.../dominus-iesus-10-years-later-part-i-ii-iii, (accessed on 16.08.2017).

❁ ❁ ❁ ❁

# ౨. "ద్రవ్యప్రాధాన్యతా సంస్కృతిలో శ్రీసభ ప్రబోధం, పరివర్తనం"

**– అగ్రపీఠాధిపతులు ప్రకాశ్ మల్లవరపు**



*మహా ఘనతవహించిన డా॥ ప్రకాశ్ మల్లవరపు అతిమేత్రాణులు తత్వశాస్త్రములో డాక్టరేట్ పట్టం, దైవశాస్త్రంలో అధికారపూరిత అనుమతిని పొందారు. వీరు హైదరాబాద్‌లోని భక్త యోహాను ప్రాంతీయ గురు విద్యాలయం నందు రెక్టర్‌గాను, ఆచార్యులుగా సేవలు అందించారు. వీరు చాలా వ్యాసాలను రచించి ప్రచురణ చేశారు.*

## 1. ఉపోద్ఘాతము

ఈ రెండు రోజుల సదస్సులో మన ప్రియతమ జగద్గురువులు ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలనుద్దేశించి అందించిన అపోస్తలిక ప్రబోధం "సువార్తానందం" ఆధారంగా చేసుకొని శ్రీసభకున్న ప్రధాన బాధ్యతైన సువార్తా ప్రబోధం అన్న అంశంపై సమాలోచన చేస్తున్నాం. నాకివ్వబడిన ఉపన్యాసాంశము ద్రవ్య ప్రాధాన్యతావాదము ప్రముఖ ప్రాధాన్యత ఆపాదించుకుని (సంతరించుకుని) ఈ ప్రపంచాన్ని శతవిధాలుగా ప్రభావితం చేస్తూ మానవ జీవిత విధానాన్ని శాసిస్తున్న ఈ ప్రస్తుత కాలంలో సువార్తా ప్రబోధం కొనసాగడం ఆవశ్యమేగాని అది ఎలా కొనసాగించాలి? అందుకు అవసరమైన పరివర్తన, మార్పు ఏమిటి?

## 2. సువార్తానందం

మన అదృష్టం, మన భాగ్యం. ఈ ఆనందాన్ని అనుభవించే మనం, ఇతరులతో పంచుకోవాలి కదా! మానవ జాతికి సువార్త ఇచ్చే ఈ ఆనందం అవసరం. ప్రభువు వలన మనం అనుభవిస్తున్న ఆనందం ఈ లోకానికి ఇవ్వాలి. తెలుసుకున్న మనం, అనుభవిస్తున్న మనం ఆ ప్రభుని దూతలం, ప్రబోధకులం, సేవకులం. ఈ కార్యం, ఈ బాధ్యత ఆనాడు శిష్యులకు, ఆది సంఘానికి అప్పగించిన ప్రభువు ఈనాడు శ్రీసభకు, ఆ శ్రీసభలోని సభ్యులమైన మనకు అప్పగిస్తున్నారు. సువార్తానందం అన్న తన అపోస్తలిక ప్రబోధంలో పోప్ ఫ్రాన్సిస్ సభ్యులమైన మనకు అప్పగిస్తున్నారు. సువార్తానందం అన్న తన అపోస్తలిక ప్రబోధంలో పోప్ ఫ్రాన్సిస్ గారు సువార్తా ప్రబోధం అన్న బాధ్యత గురించి గుర్తుచేస్తూ, వెన్నుతట్టి లేపుతూ పునరంకితం కమ్మని విశ్వ శ్రీసభకు తనదైన శైలిలో పిలుపునిస్తున్నారు. ఈ అధికార పత్రం విడుదలై మూడు సంవత్సరాలైంది. తెలుగులోకి అనువదించి కూడా మూడు సంవత్సరాలయింది. అధ్యయనం జరగాలి. ఆచరణ స్థాయిలో నూతనోత్తేజముతో క్రొత్త క్రొత్త ప్రయత్నాలకు పూనుకోవాలి. ఇది జగద్గురువుల అభిలాష, శ్రీసభ అభిలాష! స్థానిక శ్రీసభలో గురుపీఠములో, పీఠాధిపతుల ఆధ్వర్యములో, విచారణ స్థాయిలో క్రొత్త పంథాలో సువార్త ప్రబోధం కొనసాగాలి. అయితే అందుకనుగుణంగా పరివర్తనం రావడం అవసరం. అందుకే ఈ అధికార పత్రములో పరివర్తన యావత్ శ్రీసభలో రావాలి. ప్రతి దైవబిడ్డలో రావాలి. ముఖ్యంగా నాయకత్వం వహించే బాధ్యత గల వారిలో పీఠాధిపతులు, మఠవాసులు, సువార్తా సేవకులు, ఉపదేశకులు, దైవ ప్రజలందరిలో పరివర్తన రావాలి.

మన తెలుగునాట ఇరు రాష్ట్రాలలోనున్న శ్రీసభ కూడా సువార్తా ప్రబోధంలో నిమగ్నమైయుండాలి. అవసరమైన నూత్నీకరణ చెందాలి, పునరంకితం కావాలి. అంటే పునరాలోచన జరగాలి. వాస్తవ పరిస్థితులను, అనుకూల, ప్రతికూల శక్తుల ప్రభావాలను, వాటి పరిణామాలను బేరీజు వేయాలి. అన్నిటికంటే మించి ఈ మార్పు, పరివర్తన అవసరం అన్నది గుర్తించాలి. కాని సువార్తానందం లాంటి అధికార ప్రకటనలు కాని, రచనలు పట్ల ఆసక్తి కనబరచే విషయానికొస్తే అంతటా

పట్టించుకోవడం లేదు, నిర్లక్ష్య భావము ఉంటుంది అని స్వయంగా పాపుగారే అంటున్నారు. "ఇటీవల కాలంలో శ్రీసభ జారీ చేసే అధికార పత్రాలు (అపోస్తలిక ప్రబోధాలు, విశ్వ లేఖలు) గతంలో మాదిరి విశ్వాసులకు అంత ఆసక్తికరంగా ఉ ండటంలేదని, వాటిని ప్రజలు మర్చిపోతున్నారనీ నాకు తెలుసు అయినప్పటికీ పంపుతున్నాను" (సువార్తానందం నెం. 25). అంటే పట్టించుకోకుండా ఉండటం, ఇలాంటి మనోవైఖరి యొక్క పరిణామమేమిటి? "మేము ఎప్పుడూ ఇలానే చేస్తున్నాం? అనే ధోరణి విడనాడాలంటున్నారు మన జగద్గురువులు ఇక్కడ ఈ సదస్సులలో పాల్గొంటున్న మనం ఈ అపోస్తలిక ప్రబోధం విషయంలో ఆసక్తి చూపించేవాళ్లంగా ఉన్నామా? లేదా? అని చూడాలి. ఈ పరివర్తన చెందే దిశలో ఆలోచించాలి.

### 3. కొన్ని కీలకాంశాలను పరిశీలించాలి

సువార్తా ప్రబోధం చేయడం అవసరమా లేదా అని కాదు. అతివేగముతో మారుతున్న నేటి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక వాతావరణ నేపథ్యంలో శ్రీసభ గతంలో సూచించిన, ఆచరించిన విధానాలను, పద్ధతులను సమీక్షించాలి. ప్రధాన లక్ష్యంగా ఏ విషయాన్ని పెట్టుకొని మన స్థానిక శ్రీసభ అనుదిన కార్యక్రమాలను, విధివిధానాలను రూపొందించుకొని ముందుగా వెళ్తున్నది అన్నది స్పష్టం కావాలి. ప్రధాన ధ్యేయంగా, లక్ష్యంగా సువార్తా ప్రబోధం కంటే శ్రీసభకు ప్రీతిపాత్రమైనది మరొకటి, వేరొకటి ఉండకూడదు అని మరొకసారి విశ్వ శ్రీసభ మనలనందరినీ ఉద్దేశించి ఆదేశిస్తుంది. ఔత్సాహికులమై శ్రీసభ సభ్యులమైన మనమందరమూ కంకణం కట్టుకుని ముందుకు వెళ్లాలి.

ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రశ్న లేక సంశయము, ఈ సువార్తా ప్రబోధం గురించి విషయాలు ఇవాళ కొత్తగా చెప్తున్నవి కాదు కదా? వాటికన్ సభకు ముందు, తరువాత అనేక పర్యాయాలు, అనేక సందర్భాలలో చెప్పే విషయమే కదా! ఆసియా దేశాలలో (క్రీస్తు కథనం చెప్పడం, యేసుక్రీస్తు మహోత్సవం) "యేసుక్రీస్తు మహోత్సవం" అన్న కార్యక్రమాల ద్వారా సువార్తా ప్రబోధం, యేసుక్రీస్తునందు అందరికీ రక్షణ అన్న శుభవార్త చాటుట అవసరం అని ప్రకటించబడింది కదా! అవును కానీ క్రొత్త ఒరవడి, యథార్థమైన పరివర్తన, మార్పులు రావాలి, బయటకు వెళ్లాలి అన్నటువంటి ఉనికి కంటికి కనబడేలా

ప్రత్యక్షంగా స్థానిక శ్రీసభలో కనబడు తున్నాయా? క్రియాశీలకమైన సువార్తా ప్రచార ఒత్తిడి అనేది ఇంకా కనబడటం లేదు. కనుమరుగైపోలేదు కానీ వెలికి రావడం లేదు అన్నట్లు ఒక విధమైన స్తబ్ధత శ్రీసభలో సుస్థిరంగా తిష్టవేసుకుని ఉన్నట్లుంది. అందుకు కారణాలు, ఆటంకాలు, అవరోధాలు, సమస్యలు, ఇబ్బందులు గుర్తించాలి. వాటిని అధిగమించాలి. అధిగమించి సువార్తా ప్రబోధం చేయ పూనుకోవాలని 'సువార్తనందం' అందరినీ ఆహ్వానిస్తుంది.

ఇక్కడ ఒక కీలకమైన విషయమేమిటంటే, "సువార్త ప్రసాదించే తృప్తి, ఆనందం తనివితీరా అనుభవిస్తున్నవాళ్లంగా శ్రీసభ సభ్యులమైన మనమందరం ఉండాలి. ఈ ఆనందం అందరికోసం ఉద్దేశింపబడింది. ఆనందోత్సాహాలతో సువార్తా ప్రబోధం చేయమని ప్రోత్సహించాలనుకున్నాను" అని మన జగద్గురువు లంటున్నారు (నెం.1) కాని ముందు మనం అనుభవించాలి, నిరంతరం అనుభవిస్తూ ఉండాలి. ఆరవ పౌలు పాపుగారి మాటల్లో " ప్రభువు తెచ్చిన పరమానందంలో అందరూ భాగస్వాములే ఎవరికీ మినహాయింపుల్లేవు". యేసుప్రభువు, ఆయన సువార్త ప్రసాదించే ఈ ఆనందం అనుభవించే వాళ్లమైయుంటేనే, ఒక విధంగా ఈ ఆనందాన్ని ఇతరులతో పంచుకోవాలి అన్న ఆశ, ఉత్సాహం, మనలో చోటు చేసుకుంటాయి. సువార్తా ప్రబోధం తనివితీరా, తరచుగా ఆస్వాదించే వాళ్లమై యుండాలి. ఇది కీలకం. అంటే అనుభవ పూర్వకముగా మనలో దృఢమైన నిర్ధారణ (కన్విక్షన్) ఏర్పడి మనల్ని ఈ సువార్త ద్వారా పొందే ఆనందానుభూతులు తోటి మానవులు కూడా చవి చూడగలందులకు కార్యోన్ముఖులం అవ్వాలి.

## 4. ద్రవ్యప్రాధాన్యమైన సందర్భం(మెటీరియలిస్టిక్ కాన్‌టెక్స్ట్)

దీన్నే భౌతికవాదము, ద్రవ్యప్రాధాన్యతావాదము, నిరీశ్వరవాదము అని అనువదిస్తున్నారు. అంటే మానవ జీవితపు మనుగడ. అభివృద్ధి భౌతిక వస్తువుల సేకరణ, ఆస్తిపాస్తుల విస్తరణతో ముడిపడి ఉందన్న దృక్పథంతో జీవించేటట్లు తయారు కావడం. భౌతిక ప్రపంచమే అంతా అన్న మనో వైఖరితో దృక్పథంలో జీవించేటట్లు తయారు కావడం. భౌతిక ప్రపంచమే అంతా అన్న మనో వైఖరితో దృక్పథములో మానవ జీవితాన్ని, జీవిత గమ్యాన్ని చూపటం. దైవం, ఆత్మ, జీవిత

పరమార్థం, ఆధ్యాత్మిక, నైతిక విలువలను పాటించడం అన్న వాటికి తావివ్వకుండా ఉండటం, వాటిని నమూన సూచీగా పెట్టుకోకుండా ఉండటం మొదలైనవి భౌతికవాదానికి లేక ద్రవ్యప్రాధాన్యతావాదం యొక్క పరిమాణాలు. ఇంకొక పరిణామము వినిమయ సంస్కృతి ఆకాశమే హద్దు అన్నట్లు విస్తరిల్లడం, ఎంత అనుభవిస్తే అంత మంచిది, ఎన్ని వస్తువులు వినియోగించగలిగితే అంత మంచిది (consume as much as possible, Happiness and contentment are promised in the material possessions and material prosperity becomes the measuring rod of happiness in life). ఇది జీవిత స్థాయిని నిర్ధారించే కొలమానంగా తయారవుతుంది. ఈ వస్తు ప్రాధాన్యతా తత్వాన్ని పెట్టి పోషించే, శక్తివంతంగా ప్రచారం చేసే శక్తులు ఉన్నాయి. వీటినే నేను భౌతికవాదం, వినిమయతత్త్వంల ప్రచారకులు అని అంటాను. ఈ కోవకు చెందినవే మార్కెట్, ప్రసార మాధ్యమాలు, బహుళజాతి వ్యాపార సంస్థలు. జీవిత ప్రమాణాలు (లివింగ్ స్టాండర్డ్స్) మెరుగుపరచడానికని, అభివృద్ధి పథంలో దూసుకుపోతూ ఉంది మన సమాజం అని, ఇదంతా మీరు కూడా పొందవచ్చు. సొంతం చేసుకోవచ్చు అని ప్రచారం చేస్తూ, సగటు మనిషిని శోధిస్తున్నాయి. భౌతిక, వినిమయ, సుఖవాదాలు అన్న ఈ మూడు సిద్ధాంతాల కలయిక జరుగుతుంది. ఆనందించాలి. అంటే వస్తువులు, డబ్బు, సౌకర్యాలు, వినోదాలు, ఇత్యాదులు కావాలి. ఇవి కావాలంటే ధనం కావాలి, కానీ ఇవన్నీ సామాన్య "మనిషి" కోరుకునే ఆనందం, తృప్తి ఇస్తున్నాయా? అక్కడే సువార్తా ప్రబోధం అవసరం, సువార్తానందం గురించి ప్రకటించడం అవసరం.

జీవిత పరమార్థాన్ని, ఆధ్యాత్మిక నైతిక విలువలను, నిజమైన ఆనందానికి మార్గాలను మార్గదర్శకాలను సువార్త ఇచ్చే ఆనందం కనుగొన్న వాళ్లమైన క్రీస్తు అనుచరులు భౌతిక జీవిత అవసరాలను నిరాకరించడం కాదు. శారీరక సుఖ భోగాలు చెడ్డవి అని భావించడం కూడా కాదు. సువార్త బోధించేది అవసరానికి మించి వస్తువులపైన, ధనార్జనపైన మోజు పెంచుకుని అవే ప్రధానమంటూ, అవి సొంతం చేసుకోవడానికి, కూడబెట్టుకోడానికి, తాపత్రయముతో ప్రాకులాడటం, అందుకు ఎలాంటి మార్గాన్నైనా అనుసరించవచ్చు, ఏ పద్ధతిలోనైనా వెళ్లవచ్చు, ఇంకా పైపెచ్చు మౌలిక విలువలను గాలికి వదిలేసి, సాటి మనిషికి అన్యాయం జరిగినా పర్వాలేదన్న ధోరణికి దాసోహమై జీవించడం తగదు అని, ఉచితం కాదు అని బోధించే సువార్తా ప్రబోధాలను ప్రకటించడం అవసరం.

ఫ్రాన్సీస్ పాపుగారి ఈ ప్రబోధం ఈ పిలుపు స్థానిక శ్రీసభను ఆలోచింపచేయాలి. ఆత్మావలోకనం / స్వీయావగాహన దిశగా ఆలోచించాలి. ఎందుకంటే ధర్మకార్యం మిషన్ అనేది లక్ష్యంగా ముందున్నప్పుడు ఆ లక్ష్యసాధనకవసరమైన భవిష్యద్దర్శనము (మిషన్) ఉండాలి. లక్ష్యసాధనకై చేసే కృషి సాఫల్యము కావాలి. అందుకు స్థానిక శ్రీసభ తనను గూర్చి తాను ఏమనుకుంటోంది? తన వాస్తవ పరిస్థితి ఏమిటి? శ్రీసభ చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలు ముందున్న లక్ష్యం. ఆ లక్ష్యసాధనకై చేయవలసిన కృషి మొదలైనవన్నిటి మధ్య సమన్వయ ముండాలి, అయితే ప్రధాన కర్తవ్యంగా స్థానిక శ్రీసభ ముందున్నదేమిటి? అన్న ప్రశ్నలకు ఉన్న వాస్తవాన్ని ఆధారంగా చూపించి జవాబులివ్వాలి.

ఆంధ్ర, తెలంగాణలోని 13 గురుపీఠముల సముదాయం తెలుగు ప్రాంతీయ శ్రీసభ. కానీ ఈ స్థానిక శ్రీసభ తీరుతెన్నులు అన్ని గురుపీఠాలలో ఒకే తీరులో లేవు అన్నది అక్షరాల నిజం. అయితే విశ్వ శ్రీసభ ప్రబోధించే విషయాలు, నిర్దేశించే దశ దిశలు అన్ని గురు పీఠాలలో ఉన్న క్రైస్తవ సంఘానికి సమానంగా వర్తిస్తాయి. క్రియాశీలకంగా స్పందించడానికి అవసరమైన స్థితిగతులు, పరిస్థితి అన్నింటా ఒకేవిధంగా లేవు అన్నది వాస్తవం. సువార్తా ప్రబోధానికి అనుకూలించేటట్లు బాహ్య పరిస్థితులు కూడా ఉండకపోవచ్చు. అయినా మన ధర్మంగా, మన కర్తవ్యంగా ప్రభువు ఇస్తున్న పిలుపుగా నిరంతరం సువార్తా ప్రబోధం చేస్తూనే ఉండాలి. కానీ శ్రీసభలో అంతర్గత వాతావరణం, పరిస్థితులు సువార్తా ప్రబోధానికి అనుకూలముగా ఉండకపోతే, సువార్తా ప్రబోధాలకే విరుద్ధంగా, సువార్తా విలువలకు కట్టుబడి ఉండడం లేదన్నట్లుగా పరిస్థితి ఉంటే దీనికంతటికీ శ్రీసభ సభ్యులే, శ్రీసభ కార్యకలాపాలను నిర్వహించే విధానాలే కారణమైతే సువార్త ప్రబోధానికి ఆవశ్యమైన శక్తి, ఉత్సాహము, ఆసక్తి అనేవి క్షీణిస్తాయి. కనుమరుగై పోతాయి కూడా. అందుకే 'సువార్తా ప్రబోధ పరివర్తన' (మిషనరీ కన్వర్షన్) చెందాలి అని ఫ్రాన్సీస్ పాపు గారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆలోచించమని తగురీతిలో స్పందించమని ఆహ్వానిస్తున్నారు (నెం. 24,25,48,57).

మన ఆంధ్రా, తెలంగాణాలలో శ్రీసభ ప్రస్తుత ముఖ చిత్రం ఎలా ఉంది అని చూడాలి. సువార్తను దాన్ని పంచిపెట్టే విధానంలో, సువార్త ప్రబోధం చేసే

ఉత్సాహపూరిత సంసిద్ధతను ప్రదర్శించే స్థానిక శ్రీసభగా ఉన్నదా? అసలైన మౌలిక ప్రశ్న ఏంటంటే మన స్థానిక శ్రీసభ ఏ విషయాలకు ప్రథమ ప్రాముఖ్యత ఇస్తూ ఉంది? స్థానిక శ్రీసభ ఇలాంటి ప్రశ్నలకు జవాబు ఇవ్వాలి. శ్రీసభలో ఉన్న ప్రస్తుత పరిస్థితి గురించి ఇప్పుడు నాలుగు వాస్తవాలను మీముందుంచుతున్నాను. వీటి కారణంగా సువార్తా ప్రబోధం విషయంలో నిర్లప్తత, నిస్సహాయత, నిరుత్సాహం అన్న స్థితిలో మన స్థానిక శ్రీసభ ఉన్నట్లుందని నా అభిప్రాయము.

## 1. గతంలో సాంఘిక సేవలు వైద్య, విద్యారంగాలలో సేవలు

పేదల మధ్య, పేదల కోసం ఏర్పాటు చేయగలిగాం, పేదసాదలను ఆదరించాము. వారి అభివృద్ధికి దోహదపడ్డాము. ముఖ్యంగా పల్లె ప్రాంతంలో దళిత, బడుగు వర్గాల ప్రజలకు తోడుగా ఉంటూ వచ్చాము. వీటితోపాటు సువార్తా ప్రబోధం విస్తృతం చేయగలిగాము. శ్రీసభ విస్తరిల్లడానికి ఇలాంటి తోడ్పాటు ప్రజలకు ఇవ్వగలిగాము. మన ఎయిడెడ్ పాఠశాలలు, బోర్డింగులు, హాస్టళ్లు ఇందుకు ఎంతగానో తోడ్పడ్డాయి. మరి ఇప్పుడు ఈ విద్య వైద్య సాంఘిక సేవలు అదే స్థాయిలో అందించలేకపోతున్నాం. ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు అధిక సంఖ్యలో స్థాపించబడ్డాయి, బోర్డింగులు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. మూతపడ్డాయి కూడా. ఆర్థిక వనరులు సమకూర్చుకునే విషయంలో బయట నుండి వచ్చే ప్రోత్సాహాలు, సహాయాలు తగ్గిపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఈ కారణంగా పేదలకు, బడుగు వర్గాలకు దళితులకు దూరమౌతున్నామా అన్న అనుమానం వస్తుంది. ఇది నిజమే అనేవాళ్లు ఉన్నారు. క్రైస్తవేతరులకు కూడా సువార్తా సందేశాన్ని ఇవ్వడంలో మన విద్య వైద్య సాంఘిక సేవా సంస్థలు ఎంతవరకు దోహదపడుతున్నాయి. ఈ ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించాలి. వాస్తవాన్ని చూడాలి, తగిన చర్యలు తీసుకొనే దిశలో మన తెలుగునాట శ్రీసభ పయనించే ప్రయత్నం చేయడం ఎంతైనా అవసరము. పరివర్తన అవసరము.

## 2. అంతర్గత దైనందిన వ్యవహారాలకే ఎక్కువ సమయం, వనరులు, వినియోగించడం జరుగుతుంది

వ్యవస్థీకరణ (ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రాసెస్), స్థిరీకరణల్లో (స్టెబిలైజేషన్) నిమగ్నమై వస్తూ ఉంది శ్రీసభ. గత మూడు, నాలుగు దశాబ్దాల స్థానిక శ్రీసభ చరిత్రను

గమనిస్తే క్రొత్త గురుపీఠాలు ఏర్పడటం, ఉన్న గురుమండలాలను విభజించి క్రొత్త గురుమండలాలను ఏర్పరచడం, క్రమంగా పెరుగుతూ వస్తున్న గురువుల, మఠవాసుల సంఖ్య కారణంగా వాళ్లందరికీ ఉన్నదాంట్లోనే ప్రేషిత సేవకు అవకాశం కల్పించడం, అందుకు అవసరమైన విభజనలు, కొత్త భవన సముదాయాలు, విద్యా సంస్థలు, వాటికి అవసరమైన భవనాలు, సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం మొదలైనవన్నీ స్థానిక శ్రీసభను అధికమధికముగా లోలోపల ఉండే శ్రీసభగా, లోపల విషయాలకు పరిమితమై ఉండే శ్రీసభగా ఎక్కువగా కనిపిస్తుంది. వ్యవస్థీకరణలో భాగంగా ఉత్పన్నమైన పరిణామం (ఇన్‌స్టిట్యూషనలైజేషన్, ఎజుకేషన్, సోషల్ + హెల్త్ మొ॥) ఆర్థిక (మానవ) వనరులు సమకూర్చుకోవడం ఒక పెద్ద సవాలుగా తయారైంది. పాశ్చాత్య దేశాలలో ఉన్న శ్రీసభ, దాని అనుబంధ ధార్మిక సంస్థలు ప్రాజెక్టుల రూపంలో పెద్ద ఎత్తున గతంలో అండగా నిలిచాయి. పైన పేర్కొన్న పరిస్థితుల వలన కొత్తవారిని సందర్శించి సువార్తా ప్రబోధం ద్వారా, ప్రేషిత కార్యము ద్వారా బయటకు చూటం కంటే లోపలికి చూడ్డంలోనే ఎక్కువగా నిమగ్నమైపోయే పరిస్థితి వచ్చింది. ఆంగ్ల మాధ్యమం గల పాఠశాలల వలన వీటికి తోడు మారుతున్న సామాజిక వాతావరనం ఇతర మతాల ప్రజల నుండి ప్రతిఘటనలు, ఇతర మతముల ద్వారా కూడ రక్షణ ఉంటుంది అన్న శ్రీసభలోని భావాలు, క్రైస్తవేతరులతో సంఘీభావం ఉండాలి మొదలైన కారణాలు కూడ సువార్తా ప్రబోధంపై ప్రభావం చూపిస్తున్నాయి.

## 3. లోన ఉన్నవాళ్లను చూసుకోవడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామా?

దైవార్చన నియమావళిని అనుసరించి దైవ ప్రజలను అనుదిన విశ్వాస జీవితంలో కొనసాగడానికి గురుమండలముల ద్వారా ప్రతి గురు పీఠము స్థానిక శ్రీసభ సభ్యులను, సంఘాలను పరామర్శిస్తూ, సంరక్షిస్తూ, కాపాడే బాధ్యత వహిస్తూ ఉంది. ఇక్కడ ప్రధాన పాత్ర వహించేవారు యాజకులు, మఠవాసులు, ఉపదేశులు, ఉజ్జీవకులు, ప్రేషితకార్యము, సంఘపరిచర్య చాలా వరకు దివ్య సంస్కారాల నిర్వహణ, ఆదివారపు దివ్యబలి, వివిధ భక్తి కార్యక్రమముల నిర్వహణ ద్వారా సంఘాన్ని, విశ్వాసులను స్థిరంగా ఉంచే ప్రయత్నం కొనసాగుతుంది. వాక్య పరిచర్య కూడా అధిక శాతం దైవార్చన సమావేశాలు, దివ్య సంస్కారాలు కొనియాడ

బడినపుడు చేయబడుతుంది. దేవుని వాక్కు ప్రకటించడం ఈ మధ్యకాలంలో ప్రాముఖ్యతను సంతరించుకుంది. పవిత్రాత్మ సూత్రీకరణ ఒక ఉద్యమంలా వచ్చిన తరువాత వాక్య పరిచర్య విస్తృతంగా జరుగుతుంది. ఇది శుభ పరిణామమే కానీ "సువార్తా ప్రబోధం" క్రైస్తవేతరులకు చేయాలి. ఇది ఆధునిక సమాజానికి క్రైస్తవులు ఇవ్వగలిగిన ఒక ప్రత్యేక కానుక. లోపల ఉన్నవాళ్లకు సువార్తా ప్రబోధము చేయడంతో పాటు, క్రొత్త వాళ్ల దగ్గరకు వెళ్లడం శ్రీసభ కర్తవ్యం అని గుర్తుచేయడం అవసరం. క్రొత్త సంఘాలు ఏర్పడడానికి కృషి చేయడం మాట ఏమోగానీ లోపల ఉన్నవాళ్లు కతోలిక సంఘ సభ్యులను ఆకర్షింప గలుగుతున్నారు. క్రొత్త సంఘాలు ఏర్పాటు చేయడంలో సఫలీకృతులౌతున్నారు. మరి శ్రీసభలో ఇదెందుకు సాధ్యం కావడం లేదు? అసలు వెళ్తున్నామా? పోప్ ఫ్రాన్సిస్ గారు ఈ ప్రశ్న వేస్తున్నారు. "శుభవార్తను చాటుటకు మీరు తరలి వెళ్లండి" అన్న ప్రభువు మాటల్ని గుర్తు చేస్తున్నారు. అందుకు అవసరమైన పరివర్తన రావాలి అని పిలుపునిస్తున్నారు. ఈ మార్పు అవసరము అని గుర్తించి ఆ దిశలో అడుగులు వేయాలి. అందుకు సిద్ధమేనా? లేక మేము ఎప్పుడూ ఇలానే చేసేవాళ్లం అంటూ యధాస్థితిలో కొనసాగడమా? బయటికి వెళ్లలేకపోతున్నామా లేక నిరాసక్తి చోటు చేసుకున్నదా?

### 4. అంతర్గత ఐక్యతా, సమైక్యతా లోపం...

ఈ పరిస్థితి శ్రీసభ అభివృద్ధికి, ప్రగతికి అడ్డుగోడగా నిలుస్తుంది. మన దేశం, మన ప్రాంతంలో ఉన్న సామాజికపరమైన విభజనలు, వర్గతత్వము, కులాల కారణంగా వున్న విభేదాలు, పరస్పర సత్సంబంధాలు లేకుండా ఉండడం, వర్గస్థాయి, విభజన, ఒంటరిపాలు మొదలైనవి ప్రత్యక్షంగా నిత్యము మనముందుండే వాస్తవాలు, అనుభవాలు. క్రీస్తు ప్రభువునందు ఒకటిగా చేయబడిన శ్రీసభ సభ్యుల సమూహం మీద కూడా పైన పేర్కొనబడిన వాటి ప్రభావం ఉంటుంది. ఒకటిగా ఉండలేకపోతున్నాం. ముఖ్యంగా గురువులు, మఠవాసుల మధ్య ఐక్యత, సంఘీభావము నిండుగ లేవు అన్నది వాస్తవము. కొన్ని సందర్భాలలో కొన్ని సంఘటనలు జరిగినప్పుడు ఇవి బహిరంగమౌతున్నాయి. పదవులకు, అధికారాలకు, ఆధిపత్యాలకు పోటా పోటీగా ప్రయత్నాలు జరుగుతున్న మాట సత్యదూరం కాదు. చాప క్రింద నీరులా స్థానిక శ్రీసభలో ఈ అనైక్యత బలంగా

విస్తరిస్తున్నట్లుంది. ఇలాంటి పరిస్థితిలో శ్రీసభ ఉన్నప్పుడు సువార్తా ప్రబోధం ఎలా చేయగలదు?

**ముగింపు**

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో ఉన్న సాధనిక శ్రీసభ ముందు సువార్తానందం, ఎన్నో విషయాలను, ప్రశ్నలను, జవాబులను పెడుతుంది. సువార్తా ప్రబోధం ఇప్పుడూ ఎప్పుడూ శ్రీసభ యొక్క ప్రధాన కర్తవ్యం. అందుకు కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో తెలుగునాట శ్రీసభ అవలంబింపవలసిన మార్గాలను అన్వేషించాలి. అంకితభావముతో సువార్త ప్రకటనకు, ప్రచారానికి పూనుకోవాలి. ఈ నా ఉపన్యాసాన్ని పోప్ ఫ్రాన్సిస్ గారి మాటలతో ముగిస్తున్నాను. "నిరంతరం ముందుకు కదలివెళ్తూ ఉండే" శ్రీసభ నిజానికి ఒక సువార్తా బోధకుల సంఘం, ప్రభువు చేత పంపబడిన శిష్యుల సంఘం. అవును, ప్రభు శిష్యులు సువార్తా ప్రబోధ దీక్షతో తొలి అడుగు ముందుకు వేస్తారు. ప్రజా జీవనముతో మమేకమౌతారు. ప్రజలకు అండగా ఉంటారు, కడవరకు ఫలిస్తారు, పరమానందభరితులౌతారు" (నెం. 24).

❊ ❊ ❊ ❊

# 3. సువార్తానందం - సాంఘిక శ్రేయస్సు

**- ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**



*ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి గారు బెంగుళూరులోని ధర్మారం విద్యాక్షేత్రం నందు నైతిక వేదాంత శాస్త్రంలో ఉన్నత స్థాయిలో (యం.టి.హెచ్) పట్టభద్రులయ్యారు. వీరు ఫిలిప్పీయన్సలోని మనీలా నందుగల సాంతో తోమస్ విశ్వవిద్యాలయములో నైతిక దైవశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. వీరు ప్రస్తుతం హైదరాబాదులోని భక్త యోహాను గురువిద్యాలయంలో నైతిక దైవశాస్త్ర ఆచార్యులుగా ఉన్నారు.*

## 1. ఉపోద్ఘాతము

ఆదికాండము 4:9 - 'నీ తమ్ముడు ఎక్కడ? నీ సోదరుడెక్కడ? (సు.ఆ.211) అని ప్రభువు కయీనును అడిగెను. దానికి కయీను "నాకు తెలియదు, నేనేమైన వానికి కావలి యున్నవాడనా?" అని యెదురు చెప్పెను.' ఈ ప్రశ్నకు ఫ్రాన్సీస్ జగద్గురువులు తాము రచించిన 'సువార్తానందం' ద్వారా జవాబు చెపుతున్నారు. మానవత్వమే ఈ ప్రశ్నకు సమాధానం కాదు. రక్షణ భాగ్యంలో కూడా సంఘ ప్రమేయం ఉంది. శ్రీసభ సాంఘిక సిద్ధాంత సంగ్రహము (కంపెండియుం ఆఫ్ ద సోషల్ డాక్ట్రిన్ ఆఫ్ ద చర్చ్) ప్రకారం సు.ఆచ,178, ఇలా అంటుంది, "రక్షణ భాగ్యము సామాజికమైనదని. అంటే, దేవుడు క్రీస్తుద్వారా మానవులను కేవలం వ్యక్తులుగా రక్షించటం మాత్రమే కాకుండా, మానవుల మధ్యగల సామాజిక సంబంధాలను పునరుద్ధరిస్తున్నారు (178). దీనిని బట్టి చూస్తే, 'ఇతరుల పట్ల నాకు నైతిక బాధ్యత ఉన్నది' అని తెలుసుకోవాలి.

కాని ఈ ఆధునిక సమాజంలో మనం ఏమి చూస్తున్నాము? ఎలాంటి మనుషుల్ని మనం గమనిస్తున్నాము. మానవుడు ఏకాకి కాదు, ఏకాకిగా జీవం పోసుకోడు, జీవించలేడు, మానవుడు వివేకము, జ్ఞానము కలిగిన సంఘ జీవి. వసుధైక కుటుంబ జీవి. మరి ఏమైంది ఈ మానవ జీవికి? ఎక్కడ చూసినా పోటీతత్వం, స్వార్థం... నేను, నాది అనే 'స్వీయ' సిద్ధాంతంతో, మనిషి ఇంకొక మనిషిని పట్టించుకోకపోవటమే కాక, ఇతరులను హానికరంగా, అపాయంగా, అడ్డుగా చూస్తున్నాడు. ఇది నాకేమి, అది నా పని కాదు అని చేతులు ముడుచుకొని, కొన్నిసార్లు చేతులు దులుపుకొని పోతున్నాడు. అలాగే ఘోరాలు, నేరాలు చూసినప్పుడు, పెదవి విప్పక, చెయ్యి కదపక నాకెందుకు అంటు, ఎవరి గోల వారిది, ఎవరి దారి వారిది అంటు.. ఎవ్వడు ఏ గంగలో దూకుతే నాకేమి అనే ధోరణిలో బ్రతుకుతున్నాడు. ఇంకా ఘోరం ఈ స్మార్టు కెమెరా, చరవాణీ వచ్చిన తరువాత మానవుడు ఎంత స్వార్థపరుడో 'సెల్ఫీ'లో తెలుస్తుంది; మానవత్వానికి మచ్చ తెచ్చే ఘోరాలు, అన్యాయాలు, దాడులు జరిగితే, వీడియోలు తీసి, చిత్రాలు తీసి, ఫేస్ బుక్కులో పెట్టాలనే ఆరాటం, వాట్సప్‌లో షేర్ చేయాలనే ఉబులాటం, టి.వి.ఛానెల్లో టెలికాస్టు చెయ్యాలనే కుతూహలం. ఇదేనా మానవ సమాజం? వీల్లా మానవులు? ఇదా మానవుల్లో ఉన్న సంఘు జీవనం? పాపుగారు 'సువార్తానందం' ద్వారా క్రైస్తవులు సాంఘిక సిద్ధాంతాల ద్వారా, సాంఘిక శ్రేయస్సు కోసం పాటుబడాలని, బాధ్యత తీసుకోవాలని ఆహ్వానిస్తున్నారు.

## 1. సామాజిక సమస్యలలో – దైవరాజ్య విలువలతో సంఘు స్థాపన

'సువార్తానందం' 4వ అధ్యాయం – సువార్తా ప్రబోధం – సామాజిక సందేశం'లో ఈ అంశాలన్ని బోధిస్తున్నారు. ఇవన్ని కూడా సు.ఆ.176–258 సంఖ్యల్లో కనిపిస్తాయి. ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవురాలు సామాజిక బాధ్యత కలిగి జీవిస్తే, నిజమైన, సంపూర్ణమైన సువార్తానందం పొందుతారని పాపుగారి బోధ, ఆలోచన, నమ్మకం.

నేను గురు విద్యార్థులకు నైతిక వేదాంత శాస్త్రం బోధించే ముందు, ఒక గురువు యొక్క చిత్రం గీసి, అతని ఒక చేతిలో దిన పత్రిక, మరో చేతిలో బైబుల్ గ్రంథం ఉంచి చూపిస్తాను. దానికి అర్థం, దిన పత్రిక మనకు ప్రస్తుత

సమాజ స్థితిగతులను తెలిపితే, క్రీస్తు, బైబుల్ ద్వారా సాంఘిక పరిస్థితులకు ఎలా స్పందించాలో, ఎలాంటి సందేశం ఇవ్వాలో తెలుపుతున్నారు.

సు.ఆ. 176 - అంటుంది, సువార్తను సామాజిక స్థితిగతులకు అన్వయించనట్లైతే సువార్త ప్రబోధ లక్ష్యాన్ని విస్మరిస్తున్నాం, సువార్తనే వక్రీకరిస్తున్నాము. సు.ఆ. 177 ఈ విషయాన్ని చక్కగా, క్లుప్తంగా తెలుపుతుంది. సామాజిక జీవనం, సాటి మానవులలో సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలో సువార్తా ప్రబోధం విపులీకరిస్తుంది. ప్రేమ సేవగా, సేవ ప్రేమగా మారాలి. నిజమైన ఆనందం కేవలం ఆలోచనల్లో, మాటల్లో కాదు సాంఘిక సేవ కార్యక్రమాలు, సంఘ సంక్షేమ కార్యాలు చేస్తేనే, నిజమైన సువార్తానందం లభిస్తుందని పాపుగారు క్రైస్తవులకు బోధిస్తున్నారు.

సు.ఆ. 258 – క్రైస్తవ విశ్వాసులందరు సువార్తా సందేశం ద్వారా ప్రభువు తమకు అప్పగించిన సామాజిక ధర్మాలను తమ మాటల ద్వారా, చేతల ద్వారా, తమ జీవన విధానం ద్వారా – చిత్తశుద్ధితో నిర్వర్తించవలసిందిగా కోరుతున్నారు. అందుకే మత్తయి 7:21 – ప్రభు ప్రభు అని మాటలు పలికితే సరిపోదు, పరలోకపు 'తండ్రి' చిత్తాన్ని కార్యాల్లో చూపితేనే పరలోక రాజ్య ప్రాప్తి.

అదే ప్రకారం, యాకోబు 2:14-16 అంటుంది – క్రియలులేని విశ్వాసం నిరుపయోగమని. ఇదే విషయం కడరా తీర్పునందు అడిగే ప్రశ్న. కొలిచే త్రాసు. మత్తయి 25:40 – నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి (సాంఘిక సేవ క్రియలు) చేసినప్పుడు అవి నాకు చేసితిరని వక్కాణించుచున్నాను. అందుకే మనం ఇలా చెప్పుకోవచ్చు. క్రీస్తు బోధనే సామాజిక సందేశం – సంఘసేవ. అలాగే సంఘ సేవలోనే క్రీస్తు సందేశం ఉందని. అదే ఆనందం ఇస్తుందని, దైవం వైపు నడిపిస్తుందని గ్రహించాలి. అందుకే ఆరవ పౌలు పాపుగారు, 'దైవంలో ఆనందం' అను శ్రీసభ అధికార ప్రబోధం ద్వారా ఇలా అంటున్నారు, "ప్రభువు తెచ్చిన పరమానందంలో అందరూ భాగస్వాములే, ఎవరికీ మినహాయింపులేదు". త్రిత్వైక దేవున్ని నమ్మిన క్రైస్తవులు దివ్య సంఘీభావము కలిగి జీవిస్తూ, సంఘ సంక్షేమము, మానవ పురోభివృద్ధి కోరుకున్నట్లయితే, అదే నిజమైన సువార్తా ప్రబోధం. మనం తోటి వారితో ఎలా ఉంటే అలాగే దేవుడు మనతో ఉంటారు

(మత్తయి 7:2; లూకా 6:36-38). ఇలా మనం స్వార్థ ప్రయోజనాలను వీడి, సంఘ ప్రయోజనాల కొరకు శ్రమించాలి. మానవ సంక్షేమ సేవే, సువార్త ప్రబోధంలో, శ్రీసభ ప్రవృత్తిలో ఉన్న అంతర్ భాగము. ఇలా ఉంటేనే సంఘంలో దైవరాజ్య నిర్మాణం సాధ్యమౌతుంది. సు.ఆ. 180 – దైవరాజ్య విలువల ద్వారా, సద్గుణాల ద్వారా మన చుట్టు ఉన్న సమాజాన్ని గొప్ప గుణాలతో నింపవచ్చు, ప్రభావితం చేయవచ్చు. అందుకే ఆరవ పౌలు పాపుగారు, పాపులోరుమ్ ప్రోగ్రెసియోలో, ఇవాంజెలి నున్సియాందిలో ఇలా అంటున్నారు: దైవరాజ్య జ్ఞానాన్ని మానవుల మధ్య సంబంధాలను పెంచితేనే పరిపూర్ణత వస్తుంది. రోమీయులు 14:17, "దేవుని రాజ్యం అనగా తినుట, త్రాగుట కాదు. పవిత్రాత్మ ఒసగు నీతి, శాంతి, సంతోషములే." ఈ పని శ్రీసభ చెయ్యాలి. మారుతున్న సమకాలీన స్థితిగతులను, సవాళ్లను, జటిలమైన సమస్యలను పరిష్కరించాలి, మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవాలి శ్రీసభ. ఇదే లక్ష్యం కావాలి. ఉన్నతమైన సమాజ నిర్మాణం, ఇతర సంఘ, సంస్థలతో కలిసి నిర్మించుకోవాలి. ఎందుకంటే ఈ భూగోళం మన ఉమ్మడి కుటుంబం కాబట్టి. అందుకే 16వ బెనెడిక్ట్ పాపుగారు, 'దేవుడు ప్రేమ స్వరూపుడు' అనే పత్రంలో ఇలా అన్నారు: సమాజ సమస్యలను చూస్తూ నిరాసక్తంగా ఊరకుండరాదని.

ఈ విధంగా సమాజ నిర్మాణం అభివృద్ధి జరగాలంటే రెండు అంశాలపై దృష్టి పెట్టాలి. 1) పేదలకు తగిన గౌరవ స్థానం కలిపించాలి. 2) ఇతర విశ్వాస, విశ్వాసేతర సంఘాలతో కలిసి శాంతిని, న్యాయాన్ని స్థాపించాలి.

## 2. సంఘ శ్రేయస్సు

### ఎ. పేదవారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి గౌరవిస్తూ, సమానత్వ భావం కలిపించాలి.

సు.ఆ. 186 – సమాజంలో అట్టడుగున ఉన్నవారు అన్ని విధాల అనాదరణకు గురవుతున్నవారు. అలాంటి పేద ప్రజల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తేనే ఆనందం. ఇలా చేయటానికి క్రీస్తు ప్రేషిత క్రియాబోధలే అందరికి ఆదర్శం. క్రైస్తవులు పేద ప్రజల మొరనాలకించి వికాసపథంలో నడిపించాలి. సు.ఆ. 188 – పేదల పక్షాన నిలిచి వారికి సేవలు చేయుట ఏ ఒక్కరిదో కాదు; ఇది క్రైస్తవులందరి ప్రధాన ధర్మం. పేదవారిని అభివృద్ధిపరచడానికి చిత్తశుద్ధి ఉండాలి.

వారి పట్ల సంఘీభావమును ప్రదర్శించాలి. గౌరవంగా జీవించడానికి తోడ్పడాలి. సంఘీభావం అంటే అమావాస్యకో పున్నమికో దానం చేయడం కాదు. మూడ్ వచ్చినప్పుడో, సంబరం వచ్చినప్పుడో చేసేది సేవకాదు. సంఘీభావం అంటే పేద ప్రజలకు అనుకూలమైన సరికొత్త ఆలోచన సరళిని పెంపొందించుకోవటం, సమాజ సమిష్టి శ్రేయం గురించి ఆలోచించటం, సామాజిక వనరులు ఏ కొద్ది మందికో స్వంతం కాకుండా, సామాజిక వనరులు ప్రజలందరి సంక్షేమానికే దోహదపడేలా కృషి చేయడం (188). అంటే పేదప్రజలకు చెందిన వానిని (ఆర్థిక వనరులను) వారి స్వంతం చేయడానికి కృషి చేస్తే సంఘీభావం. ప్రాంతాలకు అతీతంగా పేదలకు సహాయం చేయుటయే అంతర్జాతీయ సంఘీభావం అని తెలుసుకోవాలి. అధిక వనరులున్నవారు ఇతరుల సంక్షేమం కోసం వినియోగించాలని 6వ పౌలు పాపుగారు అంటున్నారు. ఫ్రాన్సీస్ పాపుగారు తాను కార్డినల్‌గా ఉన్నప్పుడు, మరిప్పుడు పాపుగారిగా ఉండి సంఘీభావంతో ప్రేషిత సేవలు చేస్తున్నారు. ప్రపంచంలో అందరికి సరిపడే ఆహారం ఉంది, కాని ఇంకా ఆకలి చావులున్నాయంటే మనిషిలోని స్వార్థం వల్లే. ఆదాయ వనరుల పంపిణీలో అసమానతలు, పేద ప్రజల పక్షాన నిలబడాలి. సంపద అందరికి చేరేలా ప్రయాసపడాలి. విద్య, వైద్య సేవలు చేస్తూ, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

ప్రభువు సువార్తకు కట్టుబడి వున్నవాడు పేద ప్రజల బాధామయ జీవనాన్ని గమనిస్తాడు, పరిష్కరిస్తాడు. "దయామయులు ధన్యులు వారు దయను పొందుదురు" (మత్తయి 5:7). పేదవారి పట్ల కనికరము దయ ఉండాలని యాకోబు 2:2లో తెలుపుతున్నారు. దానియేలు 4:27 అంటున్నారు, దయవల్ల పాపక్షమాపణ జరుగును, దీర్ఘకాలం జీవింతురు. దానం మృత్యువు నుండి కాపాడునని, పాపము కడిగివేయబడునని, దీర్ఘాయువు లభించునని తోబీతు 12:9 అంటుంది. ఇలాంటి ఆశీర్వాదాలు సిరా 3:30, 1 పేతురు 4:8లో కూడా కనిపిస్తాయి. ఇవన్ని చేయాలంటే క్రీస్తు మనకు ఆదర్శం. పౌలుగారు అంటున్నారు, పేద ప్రజలను మరువకుండా కొనసాగించే సువార్త పరిచర్య సార్థకమవుతుంది (గలతీ 2:10). ఉదాసీనంగా ఉండరాదు. సమాజంలో అత్యల్పులైన పేదలు, ఇతరుల అనాదరణకు, నిర్లక్ష్యానికి గురవుతున్నపుడు వారి పక్షాన నిలబడాలి.

వస్తు వినియోగానికి, చిత్త భ్రమలకు గురవుతు, లోకాశల ప్రవాహంలో కొట్టుకుపోతూ, ఏకాకితనానికి గురవుతున్నాం, సంఘీభావంలేని ఏ సంఘమైన ఏకాకితనముతో సతమతమవుతుంది. క్రీస్తు ఆదర్శం – నిరుపేద కుటుంబంలో జన్మించారు (2 కొరింతి 8:9); పేదలకు సువార్తను బోధించడానికి ఆయన నన్ను అభిషేకించెను (లూకా 4:18); పేదలు ధన్యులన్నారు (లూకా 6:20); క్రైస్తవులమైన మనము కూడా పేదల పట్ల క్రీస్తు మానవత్వం కలిగి ఉండాలి. శ్రీసభ పేదల పక్షాన నిలుస్తుది, పేదలకు ఉద్దేశింపబడిన ప్రాధాన్య ఎంపికను (ప్రిఫెరెన్షియల్ ఓప్షన్ ఫార్ పూర్) ఇస్తుంది.

పేదలు తమ పేదరికం ద్వారా బోధిస్తున్నారు. పేదల పట్ల మాట్లాడాలి, వారితో ఆప్తమిత్రుల్లా మెలగాలి. ఆత్మ ప్రేరణ కలిగినవాడే, ఇలా పేదల మేలు కోరుకుంటాడు. ఎప్పుడు కూడా సేవ, స్వార్థం కోసం ఉండకూడదు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు. పేదవారిని విమోచించాలి. అప్పుడు పేదలు స్వేచ్ఛగా, ఆత్మీయులుగా జీవిస్తారు. పేదవాడి శ్రేయస్సు కోరిన క్రీస్తు సందేశం అపార్థాలకు గురవుతుంది. ఆధ్యాత్మిక వికాసంలో కూడా పేద ప్రజలు తీవ్రమైన వివక్షతకు గురవుతున్నారు. వారికి ఆధ్యాత్మిక పరిచర్యలు చేయాలి. పేద ప్రజల సంక్షేమ వికాసం, సామాజిక న్యాయ సాధనకు అందరు చిత్తశుద్ధితో శ్రమించాలి.

ఆదాయ వనరుల పంపకం న్యాయంగా జరగాలంటే ఆర్థిక వ్యవస్థలను తప్పక సంస్కరించాలి. ఆర్థిక, సామాజిక అసమానత్వమే సామాజిక సమస్య లన్నింటికి మూల కారణం. అందుకే స్వావలంబనతో నిరంకుశ ఆర్థిక ఆధిపత్యాన్ని, విధానాలను తిరస్కరించాలి. క్రైస్తవులు సూక్ష్మస్థాయి సంబంధాలకు (మైక్రొ రిలేషన్‌షిప్) మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకూడదు. వారు స్థూలస్థాయి సంబంధాలు (మాక్రొ రిలేషన్‌షిప్) కలిగి జీవించాలి. సు.ఆ. 205 అంటుంది – "ఏ రాజకీయ నాయకులైతే సమాజ దుస్థితిని చూసి, సమస్యల్లో చిక్కుకున్న జనాన్ని చూసి, పేద ప్రజల దుర్భర స్థితిని చూసి చలిస్తారో, వారే నిజాయితీగా పని చేయగలుగుతారు". ఏ క్రైస్తవ సంఘమూ, పేద ప్రజలు గౌరవంగా జీవించటానికి తోడ్పడదో, అవసరాలలో ఉన్నవారిని ఆదుకోదో, క్రీస్తు విలువలను విస్మరించనట్లే. సంఘములోనున్న వ్యక్తిగత వాదాన్ని, పేదలపట్ల ఉదాసీనతను, స్వార్థాన్ని పెరికివేసి,

మహనీయమైన ఆలోచనలు పెంచితే, పేదలు గౌరవంగా జీవిస్తారు, సంఘ అభివృద్ధి జరుగుతుంది.

**బి) నిస్సహాయులకు అండగా ఉండాలి**

క్రీస్తు ప్రభువు అల్పులైన, నిస్సహాయులైన మానవుల్ని (ద లిటిల్ ఒన్స్) తన ప్రతిరూపాలుగా పేర్కొన్నారు. ఇలాంటి బలహీనులకు మనం అండగా ఉంటే, క్రీస్తుకు ఉన్నట్లే, నేను బాగుపడాలి, గెలవాలి అని స్వార్థంతో వున్న మానవుడు బలంలేక పడిపోయిన వారిని లేపలేకపోతున్నాడు. దీనులలో, పేదవారిలో, అల్పులలో, బలహీనులలో బాధామయ క్రీస్తును చూడాలి, సేవలందించాలి. నిరాశ్రయులు, మాదక ద్రవ్యాలకు బానిసలైనవారు, ప్రవాసులు (వలస ప్రజలు), మానవ రవాణా వ్యాపారానికి (హ్యూమన్ ట్రాఫికింగ్) గురైనవారు, ప్రాంతీయ సాంప్రదాయాల కనుగునంగా బలహీనులుగా పరిగణింపబడిన స్త్రీలు, గర్భస్థ శిశువులు (ఫిటెస్) వీరంతా క్రీస్తు ప్రతిరూపాలు. ప్రవాసులను విశాల హృదయంతో ఆహ్వానించాలనని, ఆదరించాలని పాపుగారు కోరుతున్నారు. మానవ రవాణా వ్యాపారానికి గురైన నిస్సహాయులైన సహోదరి, సహోదరులు చీకటి బజార్లలోను, వేశ్యా గృహాలలోను, యాచక వృత్తిలోను, శ్రమ దోపిడి జరిగే కర్మాగారాలలోను మోసానికి గురవుతున్నారు. స్త్రీలు, తరచూ వివక్షకు, అవమానాలకు, అనాదరణకు, ఇంటా బయటా దారుణ హింసలకు గురవు తున్నారు. గర్భస్థ శిశువులు సంపూర్ణ మానవులే, అత్యంత బలహీనులైన, భద్రతలేని, అన్యం పుణ్యం ఎరుగని మానవులు. వారి హక్కు బ్రతకటం. గర్భస్రావం జరుగకుండా గర్భంలో ఉన్న శిశువును రక్షించాలి.

213 – ప్రపంచంలోని ప్రతి మనిషి జీవితము అమూల్యమైనది, గౌరవనీయమైనది, దానికి ఎలాంటి హాని తలపెట్టరాదు. పునీత 2వ జాన్ పాల్ పాపుగారు, 'సామాన్య క్రైస్తవులు' (క్రిస్టిఫిదెలెస్ లైచి) అనే అధికార పత్రంలో, 37వ సంఖ్యలో ఇలా అన్నారు: "మానవులలో ఏ వ్యక్తి గౌరవాన్ని ఉల్లఘించినా, అది సృష్టికర్తకు వ్యతిరేకంగా చేసిన అపరాధమవుతుంది, దేవునిపై పగబూని తలపెట్టే ప్రతీకార చర్య అవుతుంది".

### 3. ఉమ్మడి శ్రేయం – సామాజిక శాంతి

హింసను అణచివేస్తే శాంతి కాదు, దానిని ఎదుర్కొని, పరిష్కరిస్తేనే శాంతి, యుద్ధాల విరామం శాంతి కాదు, పేదవాడి నోరు మూయిస్తే శాంతి కాదు, పేదవాడిని అభివృద్ధి చేస్తేనే. ఎప్పుడైతే తమ దేశాల ఆదాయ వనరులను సమాజ సంపదలను అందరికీ సమానంగా పంచుతామో, పేద ప్రజల శ్రేయానికి పురోగమనానికి తగిన చర్యలు తీసుకుంటామో, మానవ హక్కులను పరిరక్షిస్తామో, అప్పుడే శాంతి. ప్రపంచాన్ని అనుదినము క్రమబద్ధంగా అంకిత భావంతో ముందుకు నడిపే కృషియే శాంతి. శాంతి స్థాపించాలంటే, న్యాయం వర్ధిల్లాలి (6వ పౌలు పాపుగారు, పోపులోరుమ్ ప్రోగ్రెసియోలో, 76వ సంఖ్యలో అన్నారు). సంపద కంటే మానవ గౌరవం మిన్న. మానవుల సమగ్రాభివృద్ధియే నిజమైన శాంతి. అందరు బాధ్యత గల పౌరులుగా అంకిత భావంతో పనిచేసిననాడే సుస్థిర సమాజ నిర్మాణము జరుగుతుంది.

221 – శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయంతో 'ఒక ప్రజ'ను, ఒక సమాజాన్ని నిర్మించాలంటే నాలుగు సూత్రాలు మూలాధారమవుతాయి.

1) అవధులులేని కాలం పరిమితిగల స్థలం కంటే గొప్పది.

2) సంఘర్షణ కంటే సమైక్యత గొప్పది.

3) ఆలోచనకంటే వాస్తవాలు ముఖ్యమైనది.

4) ఒక భాగం కంటే మొత్తం ఉత్తమమైనది.

ఈ నాలుగు సామాజిక సూత్రాల ద్వారా సమాజాన్ని విశ్లేషించి, వ్యాఖ్యానించవచ్చు. ఈ సూత్రాలను పాటిస్తే అనేక విభిన్న వ్యత్యాసాలు ఉన్నను 'ఒక ప్రజ'గా శాంతియుతంగా జీవించవచ్చు.

1) ఎప్పుడు కూడా పరిపూర్ణత్వానికి (ఫుల్‌నెస్), పరిమితత్వానికి (లిమిటేషన్) మధ్య నిరంతర ఘర్షణ జరుగుతుంది. పరిపూర్ణత ముందుకు వెళ్లడానికి ప్రోత్సహిస్తే, పరిమితత్వం అడ్డంకులు చూపించి ఆపేస్తుంది. పరిపూర్ణత్వం ప్రగతిశీల కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యమిస్తుంది, దీర్ఘకాల కార్యాచరణ విధానాలను తెలుపుతుంది. మందుకాలంలో అభివృద్ధి జరుగును అని ప్రోత్సహిస్తుంది.

2) సంఘర్షణ ఉంది అని తల తిప్పుకొని పోయినా, ఘర్షణను ఘర్షణతో శాంతింపజేయాలన్నా కుదరదు. సర్వోత్తమ మార్గం ద్వారా శాంతిని నెలకొల్పాలి. దీని ప్రకారం సంఘర్షణలల్ని సుహృద్భావ చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించే ప్రయత్నం చేయాలి, ప్రజల సమగ్రాభివృద్ధికై కార్యాచరణలు తయారు చేసుకోవాలి. అందుకే అంటారు, "సంఘర్షణ కంటే సమైక్యత శక్తివంతమైనదని. ఇలాంటి సంపూర్ణ శాంతి ఉండాలంటే సమైక్యతా సాధన (సొలిడారిటి) మార్గం ద్వారా ఏకత్వాన్ని సాధించాలి. భిన్నత్వంలో ఏకత్వం సాధించటానికి ఉపయోగపడుతుంది. ఏకత్వ బంధాన్ని పెంపొందించుతుంది. పవిత్రాత్మ ప్రేరణలో సువార్త విలువల ప్రకారం నడిస్తే మూడవ సర్వోత్తమ మార్గం పాటించినట్లు.

3) ఆలోచనలకంటే వాస్తవాలు ముఖ్యమైనవి. ఆలోచనలకు, వాస్తవాలకు మధ్య నిరంతరం ఘర్షణ. వాస్తవాలు ఎప్పుడూ వాస్తవాలే. వాస్తవాలకు మనం కప్పే అన్ని ముసుగులను తొలగించుకోవాలి. ఉదా:: పవిత్రతా వాదాలు, నిరంకుశసాపేక్షతా వాదాలు, నిరర్థకమైన బోధలు, అవాస్తవికమైన ఆదర్శాలతో ఏర్పరచుకొనే అవాస్తవిక లక్ష్యాలు, పలు రకాల ఛాందస వాదాలు, కారుణ్యానికి తావులేని నైతిక వ్యవస్థలు, యథార్థమైన జ్ఞానానికి చోటులేని వైజ్ఞానిక చర్చలు. ఇవన్నీ వాస్తవాలకు మనం కప్పే ముసుగులు. వీటిని తొలగించుకొని వాస్తవాలను వాస్తవాలుగా చూడాలి.

4) ప్రపంచీకరణకు స్థానీకరణకు (గ్లోబలైజేషన్ – లోకలైజేషన్) మధ్య కూడా అంతర్గత ఘర్షణ జరుగుతూ ఉంటుంది. ప్రపంచ దృష్టి స్థానిక దృష్టి సమతుల్యంగా ఉండాలి. ఒక భాగం కంటే మొత్తం ఉత్తమమైనదని గ్రహించాలి. మన దృష్టిని, దృక్పథాలను విస్తృతపరచి ప్రపంచంలోని మానవులందరికి మంచి జరగాలని కోరుకోవాలి, అందరి శ్రేయం కోసం కృషి చేయాలి. ఇది జరగాలంటే మన దృక్పథం విశాలంగా ఉండాలి, మన లక్ష్యం విశ్వశ్రేయంగా ఉండాలి.

### 4. సుహృద్భావ చర్చలు – శాంతి సాధన మార్గాలు (కోర్డియల్ డయోలాగ్)

సుహృద్భావ చర్చలు, భిన్నత్వంగల ప్రజల మధ్య ఏకత్వ సాధనకు దోహదం చేస్తాయి. సుహృద్భావ చర్యలను మూడు రకాలుగా జరుపుకోవచ్చు. 1) వివిధ దేశాలలో జరిపే సుహృద్భావ చర్చలు; 2) సమాజంతో జరిపే సుహృద్భావ

చర్చలు (భిన్న సంస్కృతులతో, శాస్త్ర విజ్ఞాన రంగంతో; 3) కతోలిక శ్రీసభలో భాగస్వాములు కాని ఇతర విశ్వాసులతో.

1) చర్చలన్నీ శాంతిని నెలకొల్పటానికే. క్రైస్తవులు శాంతిని గూర్చిన సువార్తను ప్రకటించాలి (ఎఫెసీ 6:15). జ్ఞానస్నానం పొందిన ప్రతి క్రైస్తవుడు క్రీస్తుతత్త్వం కలిగి, శాంతిని స్థాపించాలి. ఈ చర్చల ద్వారా అన్ని వర్గాలు శాంతిని పొందాలి. శ్రీసభ కూడా దేశ సంస్థలతో కలిసి శాంతిని స్థాపించాలి.

2) శాస్త్ర విజ్ఞానానికీ, విశ్వాసానికి మధ్య సదవగాహనను పెంపొందించటం కూడా – శాంతి స్థాపన కోసం చేసే సువార్తా ప్రబోధము, లౌకిక శాస్త్రం, తత్వశాస్త్రం, దైవశాస్త్రం వంటి పారలౌకిక విజ్ఞాన శాస్త్రాలను, అలాగే – మానవ మేధస్సుకు అందని నిగూఢ సత్యాలను సైతం తెలియజేసే విశ్వాసాన్ని సమ్మిళితం చేయాలని శ్రీసభ ప్రతిపాదిస్తుంది. వివేచన కాంతి, విశ్వాస కాంతి (రీసన్ అండ్ ఫెయిత్) రెండు దేవుని నుండి వస్తున్నాయి. ఒకదానికి ఇంకొకటి విరోధం కావు. విశ్వాసం శాస్త్ర విజ్ఞానానికి మహనీయతను నేర్పుతుంది. శ్రీసభ విశ్వాసంతో మానవ మేధాశక్తిని గుర్తించి, దేవున్ని స్తుతిస్తుంది. శాస్త్రీయ పరిశోధనలు, శాంతికి భంగం కలిగిస్తే, విశ్వాసం అలాంటి పొరపాటుల్ని చర్యల ద్వారా సవరిస్తుంది.

3) సమైక్యత కోసం – మతపరమైన చర్చలు

యోహాను 17:21 అంటుంది, 'వారందురు ఒకరుగా ఉండాలని' క్రైస్తవ ఐక్యత కోసం ప్రభువు ఆశిస్తున్నారు. క్రైస్తవ సంఘాల మధ్య అనైక్యతను అధిగమించి, సమైక్యంగా జీవిస్తే దృఢంగా సువార్తను బోధించినవారమౌతాము. ద్వితీయ వాటికన్ కూడా చర్చల గూర్చి దృఢపరచింది. అందరము సహయాత్రికులం. పారలౌకిక గమ్యం వైపు యాత్ర సాగిస్తున్నాము. కాబట్టి శాంతి సఖ్యతా సాధనకు కంకణం కట్టుకోవాలి. సర్వక్రైస్తవ సమైక్యత కోసం చేసే కృషి సర్వమానవ ఏకతకు తోడ్పడాలి. మనలోనే అనైక్యత ఉంటే, అది క్రైస్తవ జీవమునకే ప్రతికూలమైన సాక్ష్యం అవుతుంది. క్రైస్తవులమైన మనం విభిన్న సంఘాలుగా ఉన్నను, మనం ఉమ్మడిగా నమ్మే విషయాలు చాటిచెప్పుదాం. క్రైస్తవుల్లో సమైక్యతనే ఒక ప్రబోధం, మన సమైక్యతను చూసి యుద్ధ పగతో ఉన్న దేశాలు కూడా శాంతిస్తాయి.

**ఎ) యూదా మతంతో - క్రైస్తవ చర్చలు**

యూదా మతానికి, కతోలిక విశ్వాసానికి ఎన్నో పోలికలున్నాయి. యూదులను ప్రత్యేకంగా గౌరవించాలి. వారితో సత్సంబంధాలు ఏర్పరచుకోవటం మన కర్తవ్యం. యూదా మతానికి, క్రైస్తవ మతానికి ఉన్న పరస్పర అంశాలను బహిర్గతం చేయాలి. అదే ప్రకారం నైతిక నియమాలు, న్యాయ సాధన, ప్రజల సమగ్రాభివృద్ధి దృఢపరచాలి.

**బి) మతాంతర సుహృద్భావ చర్చలు**

సత్యాన్ని తెలుసుకొనుటకు ప్రగాఢమైన ప్రేమతో క్రైస్తవేతర మతాలతో సుహృద్భావ చర్చలలో పాల్గొనాలి. ఈలాంటి చర్చలకు ఛాందసభావజాలం (ఫండమెంటలిజం) ప్రధానమైన అవరోధము అవుతుంది. ఇతర మతాలతో సఖ్యతా సంఘీభావాలను కోరుతూ, ప్రపంచ శాంతిని నిర్మిస్తామనే ఆశతో చర్చలు జరగాలి. సుహృద్భావ చర్చలు మానవ మనుగడకు సంబంధించిన నిగూఢ సత్యాలను సామరస్యంగా చర్చించాలి. భారతీయ పీఠాధిపతులు (250) చెప్పిన విధంగా "సుహృద్భావ చర్చలంటే ఇతర మతాల వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవటం". న్యాయసాధనకు, శాంతి స్థాపనకు అనువైన కార్యక్రమాలను ఇతరులతో కలిసి చేపట్టాలి. ఇలాంటి గొప్ప విలువలకు పాటుబడితే ఇతర మతాల్లో అంతరంగిక శుద్ధి కలుగుతుంది. ఇక్కడ మత చట్టాలను గౌరవిస్తే, సుహృద్భావ చర్చలు సజావుగా సాగుతాయి. ఈ చర్చలను సత్యనిష్ఠితో, చిత్తశుద్ధితో, నిజాయితీగా నిర్వహించాలి. ఈ సుహృద్భావ చర్చలు సువార్త ప్రబోధంలో భాగమే. ఇస్లాంలో ఉన్న ఉమ్మడి ఆధ్యాత్మిక సంబంధాన్ని గౌరవించాలి. అబ్రహామును గౌరవిస్తారు, వారి పవిత్ర గ్రంథంలో యేసు, మరియ గూర్చి అధ్యాయాలున్నాయి. మనవలే ప్రార్థనకు ప్రాధాన్యతను ఇస్తారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తూ, దయచూపే మతం ఇస్లాం. అలాంటి దయనే ప్రవాసులకు చూపాలి. మత ఛాందసవాదం కారణంగా హింసలు జరుగుతున్నాయి. అలా అని అందరు ముస్లింలు హింసావాదులనుట సరికాదు. అసలు ఇస్లాం హింసను ఖండిస్తుంది.

బహుళ మతాలున్న చోటు ఆరోగ్యపరమైన మత బహుళత్వం ఉండి, ఇతర మతాలను, వాటిలోని భిన్నత్వాన్ని గౌరవించాలి. ఎవరి మీద నిర్బంధాలు వేయరాదు. ఎవరి మతాన్ని పాటించే స్వేచ్ఛ వారికి కలదు. ఇతర మతాల పవిత్ర

సాహిత్యమును గౌరవించాలి. పాటించే మత సిద్ధాంతాలకు విరుద్ధమైన వాటిని వదిలివేయి, కాని ఖండించకు.

## 5. తెలుగు గడ్డపై ఉన్న సాంఘిక సమస్యలు – శాంతి స్థాపన ఎలా?

మన ఈ తెలుగు గడ్డపై ఫ్రాన్సిస్ పాపుగారు చెప్పిన సమస్యలున్నాయి. మతమంటే భావోద్వేగాలకు లోనవుతున్న జనం. అలాంటి పరిస్థితిలో సుహృద్భావ చర్చలు చక్కని ఫలితాలను ఇస్తాయి అని మన భారతీయ మేత్రానులే చెప్పారు. మన ఈ గడ్డపై బహుళ మతాలు, సంప్రదాయాలు ఉన్న స్థితిలో, ఒకరినొకరు గౌరవించుకోవాలి. పేదలపై చక్కని ప్రత్యేక దృష్టి నుంచి, అభివృద్ధి చేయాలి. అశాంతి, అన్యాయాలకు గురైన బాధితుల పట్ల సమైక్యత సాధన కలిగి జీవించాలి. ఇంత భిన్నత్వం ఉన్న చోట ఏకత్వం కావాలంటే సుహృద్భావ చర్చలకు ప్రాధాన్యత నివ్వాలి. సమాజాభివృద్ధి జరగాలంటే పురుష ఆధిపత్యం వీడి స్త్రీలను గౌరవించాలి. ఈ తెలుగు గడ్డపై సాంఘిక అభివృద్ధి జరగాలంటే సాంఘిక సూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, పేదలను ఆదరించి గౌరవించాలి. అన్ని మతాలను గౌరవించాలి. ఛాందసవాదం వీడి, నేను ఇతరుల అభివృద్ధికి బాధ్యుడనని గ్రహించాలి, కృషి చేయాలి. ఇలా సంఘాభివృద్ధి జరిగితే అదే సువార్త ప్రబోధంలో నిజమైన ఆనందం.

## ముగింపు

ద్వితీయ వాటికన్ మహాసభల్లో వెలిసిన పత్రిక, "ఆధునిక ప్రపంచంలో శ్రీసభ", సంఖ్య 1 ఇలా అంటుంది, 'లోక శ్రేయం, శ్రీసభ శ్రేయం; మానవ దు:ఖం శ్రీసభ దు:ఖం, లోకంలోని మానవులలో, మంగళకరమైన విషయాలన్నీ శ్రీసభకు ఆనందాన్ని కలిగిస్తాయి'. సువార్తీకరణలో ఆనందం ఎప్పుడంటే, మానవ సమాజం క్షేమంతో ఉన్నప్పుడు, మానవ క్షేమమే. శ్రీసభ్యుధ్యేయం; మానవ ఆనందమే, శ్రీసభ ఆహ్లాదం; సంఘ క్షేమమే, శ్రీసభ సంక్షేమం. మానవ మనుగడయే, సువార్త, ప్రేషిత కార్యాల స్వభావము, తత్వము.

శ్రీసభ తన సారమును తెలుసుకొని, క్రీస్తు నుండి దైవరాజ్య వ్యాప్తి చేయమనే ఆజ్ఞను పొంది, పేదలకు, నిరాశ్రయులకు, నిర్భాగ్యులకు అండగా ఉండి, ఇంకా ఇతర సంక్షేమ సంఘ సంస్థలతో కలిసి సంఘ మనుగడకు శ్రమించినట్లైతే, దానిలోనే నిజమైన, సంపూర్ణ సువార్తానందం కలదని పాపుగారి భావన.

# 4. నూతన సువార్తీకరణ - విశ్వాస వ్యాపనం

**- ఫాదర్ పోలిశెట్టి జయరాజు**



*ఫాదర్ పోలిశెట్టి జయరాజు గారు బెంగుళూరులోని సెయింట్ పీటర్స్ పొంటిఫికల్ సెమినరి నందు (యం.టి హెచ్.) ఉన్నత స్థాయిలో పట్టభద్రులయ్యారు. రోమా నగరంలోని పొంటిఫికల్ ఉర్బానియానా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందారు.*

## 1. ఉపోద్ఘాతము

సువార్త ప్రకటన శ్రీసభ ధర్మం. సువార్త ప్రబోధం లేకపోతే శ్రీసభ ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. సువార్తను బోధించమని ఆదేశించి తను ఎనుకున్న అపోస్తులను క్రీస్తు పంపాడు. "మీరు ప్రపంచమంతా తిరిగి సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మార్కు 16:15). ప్రభువాజ్ఞానుసారం అపోస్తులులు మొదలుకొని ఈనాటి వరకు అనేకమంది సువార్త ప్రకటన చేస్తున్నారు. సువార్త కోసం తమ ప్రాణాలను సైతం ధారవోసిన వారు కోకొల్లలు. ఈనాడు మనం వారిని పునీతులుగా, వేదసాక్షులుగా కొనియాడుతున్నాం. ఈనాడు మనమందుకొన్న ఈ రక్షణ వార్త అనేకుల కృషి, శ్రమ ఫలితం. మానవులందరూ రక్షించబడాలనే దేవుని కోరిక (1 తిమోతి 2:4) ప్రకారం సువార్తను విశ్వసించిన ప్రతి ఒక్కరు ఆ రక్షణ సువార్తను ఇతరులతో పంచుకొనే బాధ్యతను కలిగి ఉన్నారు.

కాని ఈనాడు మారిన పరిస్థితుల కనుగుణంగా సువార్తీకరణకు క్రొత్త పంథాను అనుసరించాలి. కాలాలు మారినా, తరాలు గతించినా విశ్వాసం మారదు. విశ్వాస వ్యాప్తి విధానాలు మాత్రం పరిస్థితులను బట్టి మారుతుంటాయి. అందువలననే శ్రీసభ అధిపతులైన పాపుగార్లు తమ విశ్వలేఖల ద్వారా కతోలిక

విశ్వాసులందరికి ఏవిధంగా సువార్త ప్రచారం జరపాలో దిశా నిర్దేశం చేస్తారు. మన ప్రస్తుత శ్రీసభ అధిపతి ఫ్రాన్సిస్ పాపుగారు తన అపోస్తోలిక ప్రబోధం సువార్తానందం ద్వారా నూతన సువార్తీకరణ ఆవశ్యకతను విశ్వాస వ్యాప్తికి చేపట్టవలసిన చర్యలను గూర్చి సకల క్రైస్తవ లోకానికి మార్గ దర్శనం చేస్తున్నారు. ఈ వ్యాసంలో నూతన సువార్తీకరణను గురించి, విశ్వాస వ్యాప్తికి దాని ఆవశ్యకత, తన అపోస్తోలిక ప్రబోధం సువార్తానందం ద్వారా పాపుగారు ప్రస్తావించిన కొన్ని అంశాలను మనకు అన్వయింప చేసుకుంటూ, సువార్త ప్రబోధంలో మన బాధ్యతను గుర్తు చేసికొని ఆచరణలో పెట్టే ప్రయత్నం చేద్దాం.

## సువార్తీకరణ అంటే ఏమిటి?

ముందుగా సువార్తీకరణ అంటే ఏమిటో తెలుసుకోవాలి. సులభంగా చెప్పాలంటే సువార్త ప్రకటన అంటే క్రీస్తు ప్రభు శుభవార్తను ఇతరులతో పంచుకోవడం. దేవుడు మనలను ప్రేమిస్తున్నాడని, మనము ఆయనచే రక్షించబడి నిత్యజీవములోనికి పిలువబడినామన్న సత్య శుభవార్తను కుటుంబాలకు, స్నేహితులకు, పొరుగువారికి తెలియజేయడం. ఆరవ పౌల్ పాపుగారు సువార్తీకరణ గురించి తన అపోస్తోలిక లేఖ "సువార్త ప్రబోధం"లో నిజమైన సువార్త ప్రబోధం గురించి వివరిస్తున్నారు. ఈ లేఖలో పాపుగారు సువార్తీకరణలో నాలుగు దశలను ప్రస్తావిస్తున్నారు.

1. సువార్త ప్రబోధంలో మొదటి ఆశ - మౌన సాక్ష్యం - తమ యొక్క క్రైస్తవ జీవితం ద్వారా ఇతరులకు సాక్ష్యమిస్తూ జీవించడం. మన యొక్క జీవిత విధానం, మనం చేస్తున్న మంచి పనులు ధార్మిక క్రియల ద్వారా మన పొరుగువారి జీవితాన్ని ప్రభావితం చేయగలగడం.

2. రెండవ దశలో తమ క్రైస్తవ విశ్వాస జీవితానికి మూల కారణమైన క్రీస్తును బోధించడం. క్రీస్తు ప్రభు నామాన్ని, ఆయన బోధనలను, ఆయన జీవితం, చేసిన వాగ్దానాలు, దైవరాజ్యం, క్రీస్తు దైవ కుమారుడన్న పరమ రహస్యమును చాటకపోతే అది నిజమైన సువార్తీకరణ కాదు. కాబట్టి క్రీస్తు ప్రభు నామాన్ని ప్రకటించకుంటే సువార్త ప్రబోధం జరగనట్లే.

3. మూడవ దశలో సువార్తను విశ్వసించిన వారందరూ దానికి స్పందిస్తూ ఒక సంఘంగా ఏర్పడి శ్రీసభ యొక్క దివ్య సంస్కార జీవితంలో పాలుపంచుకుంటారు. వీరు విశ్వాసంలో ఇంకా పరిపక్వత చెందాల్సిన అవసరం ఉంది.

4. ఇక నాల్గవ దశలో సువార్తను స్వీకరించినవారు సువార్తికులుగా మారాలి. సువార్త సేవలో ఇది ముఖ్యమైన అంశము. ఒక వ్యక్తి సువార్తను స్వీకరించి తిరుసభలో సభ్యుడై, దివ్య సంస్కార జీవితంలో పాలుపంచుకుంటూ, తన బాధ్యతగా ఆ సువార్తను ఇతరులతో పంచుకోకపోవడం అనేది మనం ఊహించలేని విషయం.

మొదటి సువార్తికుడు యేసు ప్రభువే. దైవరాజ్యాన్ని గూర్చిన సువార్తను బోధించడానికి ఆయన ఈ లోకంలో అవతరించాడు. "పేదలకు సువార్తను ప్రకటించుటకు అతడు నన్ను అభిషేకించెను" (లూకా 4:18). మొదటి సువార్తీకరణ పేదల జీవితాలలో వెలుగును నింపుతూ, వారిలో పరివర్తన కలిగించి క్రీస్తు యొక్క నూతనత్వాన్ని వారిలో నింపింది. ఈ సువార్తనే ప్రభు శిష్యులు, వారి వారసులు ప్రపంచమంతా బోధిస్తున్నారు.

## నూతన సువార్తీకరణ

నూతన సువార్తీకరణ నేపథ్యం ఏమిటి?

1990వ దశకంలో పాశ్చాత్య దేశాలలో క్రైస్తవ విశ్వాసం తగ్గిపోయింది. ప్రజలు లౌకిక విలువలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ క్రైస్తవ విశ్వాస జీవితాన్ని అశ్రద్ధ చేస్తున్న సందర్భంలో నూతన సువార్తీకరణ అంశం తెరపైకి వచ్చింది. పురాతన కాలం నుంచి క్రైస్తవ విశ్వాసంలో స్థిరంగా ఉంటూ విశ్వాసంలో జీవిస్తున్న పాశ్చాత్య వాసులు క్రమంగా విశ్వాస జీవితాన్ని వదలివేసి లౌకిక వ్యామోహాలలో మునిగి ఉన్నారు. "క్రొత్త సువార్తీకరణ" అనేది మొట్టమొదటి సువార్తీకరణ కంటే చాలా భిన్నమైన పరిస్థితులలో జరుగుతుంది. కొత్త సువార్తీకరణ అనేది గతంలో మత ప్రచారం చేయబడిన జనాభాలను లక్ష్యంగా చేసుకుంది, కానీ ఇప్పుడు వారు మతం పట్ల నమ్మకం తగ్గిపోయిన మతాతీత వాతావరణంలో జీవిస్తున్నారు. మతం ఒక వ్యక్తిగతమైన వ్యవహారంగా మారిపోయింది. కొన్నిసార్లు రాజకీయ శక్తులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మతానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. తిరుసభలో

ఇటువంటి ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు తన విశ్వలేఖలో నూతన సువార్తీకరణ అవసరాన్ని గూర్చి వివరించారు. పురాతన క్రైస్తవ మూలాలున్న దేశాలు, ఈ మధ్యకాలంలో సువార్త ప్రకటించబడిన కొన్ని దేశాలలో కూడా ఒక మధ్యంతర పరిస్థితి నెలకొని ఉంది. జ్ఞానస్నానం పొందిన అనేకమంది తాము క్రైస్తవులమన్న సంగతిని మర్చిపోయి జీవిస్తున్నారు. తమను తాము శ్రీసభ సభ్యులుగా పరిగణించుకొనక, క్రీస్తుకు, సువార్త విలువలకు దూరంగా జీవిస్తున్నారు. ఈ సందర్భంలోనే మనకు నూతన సువార్తీకరణ లేక పునర్ సువార్తీకరణ అవసరం. నూతన సువార్తీకరణను గూర్చి మాట్లాడుతున్నప్పుడు, ప్రథమ సువార్తీకరణ రద్దు చేయబడింది అని కాని, విఫలమైంది అని కాని అర్థం కాదు. సువార్త విషయాలు (ఎవన్‌జెలిఇనున్నియాంది) ఎప్పుడూ ఒక్కటే. దానిని ఇతరులకు అందించే విధానంలోను, బోధించే పద్ధతులలో నూతనత్వం ఉండాలి.

## తెలుగు శ్రీసభలో నూతన సువార్తీకరణ ఆవశ్యకత

నూతన సువార్తీకరణ నేపథ్యం తెలిసిన తరువాత మనకు కలిగే అనుమానం – మన ప్రాంతాల్లో నూతన సువార్తీకరణ లేదా రెండవ సువార్తీకరణ అవసరముందా? మన కతోలిక విశ్వాసుల జీవితం అంతగా దిగజారిందా? నేడు మన తెలుగు రాష్ట్రాలలో క్రైస్తవులు తమ క్రైస్తవ విశ్వాసం పట్ల మరీ అంత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం లేదనే చెప్పాలి. పాశ్చాత్య దేశాలలో లాగ మన కతోలికులు క్రైస్తవ విశ్వాసాన్ని పూర్తిగా వదలివేసి లౌకిక జీవితంలో మునిగిపోవడం లేదు. మతాన్ని, దేవుని పూర్తిగా విడనాడడం లేదు. పశ్చిమ దేశాలలో ఉన్నంత దీనస్థితి మన దేశంలో లేదనే చెప్పాలి. ఎక్కువమంది క్రైస్తవులు ఇంకా దేవుని పట్ల విశ్వాసం కలిగి ఉన్నారు. అలాగని అందరూ సంపూర్ణ విశ్వాసం కలిగి క్రీస్తు సువార్తకు, క్రైస్తవ విలువలకు లోబడి సాక్షులుగా జీవిస్తున్నారని కాదు. కానీ ప్రపంచీకరణ కారణంగా ఈనాడు మన సమాజంలో కూడా పాశ్చాత్య సంస్కృతి వేళ్లూనుకుంది. ఇదే సంస్కృతి క్రైస్తవ సంఘాలలో కూడా ఉంది. ప్రసార మాధ్యమాల ద్వారా పాశ్చాత్య సంస్కృతితో పాటు వారి జీవిత విధానం, ఆలోచనా ధోరణి, వారి లౌకిక భావాలు, విలువలను కూడా మన జీవితంలో భాగం చేసుకున్నాం. ఈ

నేపథ్యంలో కొందరు కతోలిక క్రైస్తవులు తమ విశ్వాస జీవితానికి కట్టుబడి జీవించలేకపోతున్నారు. ఇది కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా జరగకపోయినా అటువంటి వారిని తిరిగి కతోలిక విశ్వాస జీవితంలో ఉత్తేజితులను చేయడానికిగాను నూతన సువార్తీకరణ అవసరముంది.

## నూతన సువార్తీకరణ ఎవరికి అవసరం?

'క్రైస్తవ విశ్వాస వ్యాపనం కోసం నూతన సువార్త ప్రబోధం' అనే అంశంపై 2012 అక్టోబర్‌లో జరిగిన ప్రపంచ పీఠాధిపతుల సర్వసభ్య సమావేశాన్ని ఉటంకిస్తూ ఫ్రాన్సిస్ పాపుగారు మూడు రంగాల్లో నూతన సువార్తీకరణ ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. మొదటి రంగానికి చెందినవారు తమ విశ్వాసానికి కట్టుబడి జీవిస్తూ, వివిధ మార్గాల్లో విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంటారు కాని గుడికి రావడానికి దైవార్చనలో పాల్గొనడానికి ఇష్టపడరు. రెండవ రంగానికి చెందినవారు జ్ఞానస్నానం స్వీకరించి కూడా జ్ఞానస్నాన ప్రమాణాల ప్రకారం జీవించనివారు. వీరు శ్రీసభ జీవన విధానానికి దూరంగా జీవిస్తుంటారు. ఇక మూడవ రంగానికి చెందినవారు క్రీస్తుని ఎరుగనివారు. వీరికి సువార్త ప్రబోధం చేయాల్సిన బాధ్యత అందరికి ఉంది. ఈనాడు మన సమాజంలో ఈ మూడు వర్గాలకు చెందిన జనులున్నారు. వారికి సువార్త ప్రబోధం చేయడానికి మనల్ని మనము సంసిద్ధులను చేసుకోవాలి.

మన తెలుగు కతోలిక శ్రీసభ విషయానికొస్తే, సువార్త వ్యాప్తికై నూతన సువార్తీకరణ మనందరకూ వివిధ స్థాయిలలో అవసరమే. విశ్వాస జీవితంలో నిర్లిప్తత ఉన్న ప్రతీ ఒక్కరికి నూతన సువార్తీకరణ అవసరమే. వీరిని మూడు వర్గాలుగా విభజించవచ్చు. 1.గురువులు, మఠవాసులు, 2.గృహస్థ క్రైస్తవులు, క్రైస్తవ కుటుంబాలు, 3.యుతీయువకులు.

### 1. గురువులు, మఠవాసులు

ఫ్రాన్సిస్ పాపుగారు సువార్త పరిచారకులలో ఉన్న ఆధ్యాత్మికమైన ప్రాపంచిక దృక్పథం (స్పిరిచ్యువల్ వరల్డ్‌లీనెస్) గూర్చి హెచ్చరిస్తున్నారు. ఆధ్యాత్మిక ముసుగులో లౌకిక వ్యామోహాలున్నవారు, దేవుని మహిమను కోరుకోడానికి బదులు తమకు మానవులిచ్చే గౌరవాన్ని, కీర్తిని, వ్యక్తిగత శ్రేయస్సును కోరుకుంటారు.

ఈ తరహా భావాలు గల వారి వల్లే మన తెలుగు శ్రీసభలో కులతత్వం, వర్గతత్వం పెరుగుతోంది. తమ వ్యక్తిగత స్వార్థం కోసం ఇతరులను ఉపయోగించుకొంటూ సామాజిక రాజకీయ లబ్ధి పొందాలనే తపన వీరిలో ఉంటుంది. సువార్త ప్రబోధం మీద ఆసక్తి కన్నా తన వ్యక్తిగత విషయాల మీద శ్రద్ధ ఎక్కువగా ఉంటుంది. మన తెలుగు రాష్ట్రాలలోని కతోలిక శ్రీసభలో ముఖ్యంగా కొన్ని మేత్రాసనాలలో ఈ జాడ్యం మరీ ఎక్కువగా ఉంది. ఇటువంటి పరిస్థితి సువార్త పరిచారకుల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తుంది.

ఈ సందర్భంలో నూతన సువార్తీకరణ గురించిన ఆత్మ పరిశీలన గురువుల, మఠవాసుల స్థాయిలో ప్రారంభమవ్వాలి అని నా అభిప్రాయం. ఎందుకంటే వీరు తమ విశ్వాస జీవితం సువార్త పరిచర్య ద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన వారు. అయితే కొంతమంది తాము చేయాల్సిన పనిని మరచి ఇతరుల యొక్క వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ తమ బాధ్యతను మరచిపోతున్నారు. సువార్తకు సాక్షులుగా ఉండటానికి బదులు వ్యతిరేక సాక్షులుగా (కౌంటర్ విట్‌నెసెస్) తయారవుతున్నారు. మేత్రాసన గురువుల మధ్య కుల వర్గ విభేదాలు ఎక్కువయ్యాయి. ఇది విశ్వాస వ్యాప్తికి గొప్ప ఆటంకంగా తయారయింది. పునీత రెండవ జాన్ పాల్ పాపుగారు తన విశ్వలేఖ (రెదెంతోరి మిస్సియో)లో చెప్పినట్లు "ఈనాటి ప్రజలు మాటలకన్నా చేతలమీద, సిద్ధాంతాల కన్నా అనువజ్ఞులపైన మరియు బోధించే వారికన్నా సాక్షులుగా జీవించే వారిపైన ఎక్కువ నమ్మకం కలిగియున్నారు." ఒక క్రైస్తవ జీవిత సాక్షి మొట్టమొదట చిరస్మరణీయమైన సువార్త ప్రచార రూపం. కాబట్టి మనం ఎంత బోధించినా, దానిని ఆచరించలేకపోతే ఆ బోధ వ్యర్థమే. అది ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. కాబట్టి ప్రథమంగా గురువులు, మఠవాస జీవితం జీవించేవారు, సువార్త వ్యాప్తిలో సత్ఫలితాలు సాధించుటకు తమ జీవితంలో సువార్తకు సాక్షులుగా జీవిస్తూ, సువార్త ప్రబోధనకు ప్రథమ స్థానాన్ని ఇవ్వాలి.

## 2. గృహస్థ క్రైస్తవులు, క్రైస్తవ కుటుంబాలు

గృహస్థ క్రైస్తవులు చాలా వరకు తమ క్రైస్తవ జీవితాన్ని ఆదివారం నాడు దివ్యపూజలో పాల్గొనడం వరకే పరిమితం చేసారు. ప్రత్యక్ష సువార్త ప్రబోధంలో

చురుకుగా పాల్గొనడం లేదు అనేది వాస్తవం. దానికి కారణాలు అనేకమున్నాయి. కొందరికి అవకాశం లేదు. కొందరు గృహస్థ క్రైస్తవులు తమ కుటుంబ వ్యవహారాల్లో మునిగిపోయి సమయం లేక ఈ పరిచర్యలో భాగం కాలేకపోతున్నారు. ఇంకొందరు వారి జీవితంలో జరిగే కొన్ని పరిణామాల వల్ల కొన్ని పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు ఆధ్యాత్మిక ఆరాధన కార్యక్రమంలో పాల్గొనడానికి కూడా ఆసక్తి కనబరచుట లేదు. విచారణలో జరిగే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడానికి కూడా నిర్లిప్తత కలిగి ఉన్నారు. దీనికి ముఖ్య కారణం వారికి కతోలిక విశ్వాస పరిజ్ఞానం వారు బాల్యంలో నేర్చుకొన్న సత్యోపదేశానికి, ఆదివారం వింటున్న ప్రసంగాలకు మాత్రమే పరిమితమైంది. ప్రొటెస్టంట్ క్రైస్తవులు అడిగే ప్రశ్నలకు సమాధానాలిచ్చే స్థితిలో వారు లేరు. ఇలా చెప్పుకుంటూ పోతే మనకు అనేక కారణాలు కనిపిస్తాయి.

క్రైస్తవ కుటుంబాలలో కూడా మారిన జీవన విధానం, సంస్కృతిలో మార్పుల కారణంగా ప్రార్థనా జీవితం కుంటుపడుతోంది. పిల్లల చదువులు, తల్లిదండ్రుల ఉద్యోగ బాధ్యతల కారణంగా చాలా కుటుంబాలలో కుటుంబ సభ్యులందరూ కలిసి ఉండే సమయం అరుదైంది. దీనికి తోడుగా టి.వి., సాంఘిక సమాచార సాధనాలు వ్యక్తి జీవితంలో ఎక్కువ భాగాన్ని ఆక్రమించిన కారణంగా కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులలో కుటుంబ ప్రార్థనకు సమయమెక్కడుంటుంది? క్రైస్తవ కుటుంబ ఐక్యతకు కుటుంబ ప్రార్థన ప్రాణం. కలిసి ప్రార్థించే కుటుంబం కలిసి ఉంటుంది అనే నానుడి మనకందరకు తెలిసినదే. కాబట్టి కుటుంబ ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను క్రైస్తవ కుటుంబాలు గుర్తించునట్లు చేయాలి.

## 3. యువతీయువకులు

సమాజంలో వస్తున్న మార్పుల కారణంగా నేటి యువతకు, పెద్ద వారికి మధ్య అంతరం ఏర్పడుతుంది. తమ ఆశలను, ఆశయాలను, అవసరాలను పెద్దలు అర్థం చేసుకోవడంలేదని యువత తరచూ ఫిర్యాదు చేస్తుంటారు. ఇది కొంతవరకు నిజమే. అందువలననే చాలామంది కతోలిక యువజనులు తమ సంతోషం, ఆనందం బయట వెతుక్కుంటున్నారు. తమ జీవితంలో క్రైస్తవ విలువల

ప్రాముఖ్యతను మరచిపోయి లౌకిక విలువలకు ప్రాధాన్యత నిస్తున్నారు. అదే సమయంలో సమాజం కోసం సాటివారి సంక్షేమం కోసం నిస్వార్థ సేవలందిస్తూ స్వచ్ఛంద సేవకులుగా పనిచేస్తున్న యువజనులు లేకపోలేదు. ఆధునిక కుటుంబ జీవితంలో యువతకు స్వేచ్ఛ ఎక్కువ. కొన్నిసార్లు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడంలో సరియైన మార్గదర్శకత్వం లేక తప్పటడుగులు వేస్తున్నారు. మన తెలుగు శ్రీసభలో యువతకు సత్యోపదేశ బోధన ద్వారా కతోలిక విశ్వాసం పట్ల అవగాహన కలిగించి సువార్త విలువలను నేర్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా వారు చైతన్యవంతులై సంఘంలో సువార్త పరిచర్యలో భాగస్తులయ్యే ఆస్కారముంటుంది.

నూతన సువార్తీకరణ ద్వారా విశ్వాస వ్యాప్తి జరగాలంటే పైన పేర్కొన్న ఈ మూడు వర్గాల్లో మార్పు రావాలి. క్రైస్తవులుగా మనం దేశంలో, రాష్ట్రంలో అల్ప సంఖ్యాకులం. అయినప్పటికీ మన జీవితం ద్వారా, సువార్తకు క్రైస్తవ విలువలకు కట్టుబడి జీవించడం ద్వారా సంఘంలో ఇతరులను ప్రభావితం చేయగలం. అనగా క్రీస్తుకు సాక్షులుగా జీవించడం ద్వారా సువార్త పరిచర్యలో భాగం పంచుకోగలం. పులిసిన పిండి ఏ విధంగా మిగిలిన పిండిని పులియ చేస్తుందో, అదే విధంగా మైనారిటీగా ఉన్న క్రైస్తవ సంఘం సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలి. ఎందుకంటే శ్రీసభ ఎదుగుదల మతాంతీకరణ మీదను మత మార్పిడుల మీదనో ఆధారపడి ఉండదు. ఇతరులను ఆకర్షించే శక్తి వల్లనే శ్రీసభ ఎదుగుతుంది, విస్తరిస్తోంది.

❊ ❊ ❊ ❊

# 5. గాయపడి, బాధామయమై, మలినమైన శ్రీసభలో క్రీస్తు ముఖ దర్శనం

## ఫ్రాన్సిస్ పాపుగారి అపోస్తులిక ప్రబోధం “సువార్తానందం” నుండి కొన్ని ప్రతిపాదనలు

**– ఫాదర్ సగినాల ప్రకాశ్**



*ఫాదర్ సగినాల ప్రకాశ్ గారు రోమా నగరంలోని పొంటిఫికల్ ఉర్బానియానా విశ్వవిద్యాలయం నందు బైబిల్ దైవశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. హైదరాబాదులోని భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయంలో పవిత్ర దైవవాక్కు ఆచార్యులుగా సేవలు చేశారు. ప్రస్తుతం వీరు కడప మేత్రాసణంలో అధ్యక్షపతిగా (ఛాన్సలర్), విచారణ గురువుగా పని చేస్తున్నారు.*

### 1. ఉపోద్ఘాతము

పేదల పక్షాన నిలబడే ఒక మహా కవచం ఫ్రాన్సిస్ పాపుగారు. నిస్సహాయుల కోసం, నిర్భాగ్యుల కోసం నిరంతరం శ్రమించే అవిశ్రాంత క్రీస్తు సైనికుడాయన. బ్యూనస్ ఎయిర్స్‌లో అగ్రపీఠాధిపతిగా పని చేసినప్పుడు అక్కడున్న ఎత్తు పల్లాల సమాజాన్ని కళ్లారా చూసినవాడు. ఉన్న వారికి లేనివారికి మధ్యనున్న అగాధం గురించి పదే పదే ప్రశ్నించినవాడు. క్రైస్తవత్వంలోని ఆధ్యాత్మికత చైతన్యవంతమైనదే గాని, ఉదాసీనత, నిర్లక్ష్య ధోరణి, నిర్లిప్త వైఖరి అందులో ఉండకూడదని పదే పదే బోధించినవాడు. ఆయన మాటలలో పూర్వ నిబంధనలోని ప్రవక్త ప్రతిధ్వనిస్తాడు. వివిధ శృంఖాలతో బంధీలయిన అభాగ్యులకు విముక్తిని

కలిగిస్తూ, ప్రభుహితమైన సంవత్సరాన్ని ప్రకటించే క్రీస్తు ప్రభువు దర్శనమిస్తాడు. ఆయన రచించి ప్రజలను చైతన్యపరచే నేపథ్యంలో 2013లో "సువార్తానందం" అనే అపోస్తులిక ప్రబోధాన్ని వెలువరించారు. అందులోని ఆయన ఆలోచనలను, అమలు చేయవలసిన సందేశాన్ని వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

## 2. గాయపడి బాధామయమయ్యే శ్రీసభ

తన చుట్టూ తాను భద్రతా వలయాన్ని గీసుకుని ప్రజలకు దూరంగా ఉండే వ్యవస్థను శ్రీసభ ఆశించకూడదు. ఒక పదిలమైన స్థితిని తాను కోరుకుంటూ కష్టపడే ప్రజల గోడును పెడచెవిని పెట్టే పరిస్థితి శ్రీసభకు రాకూడదు. ప్రజల కోసం శ్రమించే శ్రీసభగా ఉండాలి. ఆ ప్రయత్నంలో గాయపడిన తిరుసభ, మట్టి కొట్టుకుపోయి, మలినమై, ప్రజల బాధను తన బాధగా అనుభవిస్తూ, వారి కోసం శ్రమించే శ్రీసభగా ఉండాలి. తన భద్రత తాను చూసుకుంటూ నాలుగు గోడల మధ్య కుచించుకుపోయి అనారోగ్యంతో బాధపడే వ్యవస్థ కాదు తిరుసభ. అదొక చైతన్య స్థితి... ప్రజల కోసం పరితపించిన ఓ కరుణామయుని అడుగు జాడలలో మార్గాన్ని అన్వేషించే ఒక సజీవ వ్యవస్థ. కాపరి లేని గొఱ్ఱెల కోసం ఒక కాపుకాయాలని కోరుకున్న ఓ మంచి కాపరి నెలకొల్పిన మార్గమిది. కాపరులే మేపరులైనప్పుడు ఆయన వారిని గర్హించినవాడు. కొందరు తమ బాధను అందరి బాధగా చేస్తారు... మరికొందరు అందరి బాధను తమ బాధగా చేసికొంటారు. పై చెప్పిన ఆలోచనలను "సువార్తానందం" ద్వారా మనకు ప్రబోధించిన ఫ్రాన్సిస్ పాపుగారు రెండవ కోవకు చెందినవారు. పాపుగారి మాటల్లో "నేను – తనచుట్టూ తాను గిరిగీసుకుని ప్రజలకు దూరంగా ఉండి అనారోగ్యకరమైన శ్రీసభ కంటే, తాను ఏర్పరచుకున్న భద్రతా వ్యవస్థకు తానే ఆదుకొని ఉండే పదిలమైన శ్రీసభ కంటే – నడివీధుల్లో సామాన్య జనం మధ్యకు వెళ్లి, గాయపడిన శ్రీసభను, బాధామయమైన శ్రీసభను, మలినమైన శ్రీసభనే ఇష్టపడతాను. అంతేకాదు – అన్నింటా అగ్రస్థానాన్ని కేంద్రీయ స్థానాన్ని కోరుకుంటూ, ఆ స్థానాన్ని నిలుపుకొనే ప్రయత్నంలో భాగంగా అసంఖ్యాక విధివిధానాల వలయాల్లో చిక్కుబడి ఉండే శ్రీసభను నేను కోరుకోవటం లేదు" (సు 49). గాయపడిన శ్రీసభ అంటే ఒక మంచి ప్రయత్నంలో జరిగే ఆటుపోట్లను తట్టుకోవడం... ఎదురు దెబ్బలకు

ఎదురొడ్డి పోరాడటం. కొందరిలో ఆ పోరాట పటిమ లేకపోవడం.. సులభంగా రాజీపడటం కూడదంటారు ఫ్రాన్సీస్ పాపుగారు.

నిజానికి – మనమందరమూ ఆందోళన చెందవలసిన విషయం, మన అంతరాత్మలను కలవరపరచే విషయం ఏదైనా ఉన్నదీ అంటే – అది సాటి సహోదరి సహోదరులపట్ల మనకు గల నిర్లిప్తధోరణి, పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న వైఖరి. ఈనాడు మన సోదరీ, సోదరులలో అనేకమంది యేసుక్రీస్తు సహవాసానికి సాన్నిహిత్యానికీ నోచుకోవడం లేదు. ప్రభు సాంగత్యం వలన లభించే అంతరంగిక కాంతికీ శాంతికి దూరమై అంధకారంలో దు:ఖ భారంతో కుమిలిపోతున్నారు. అలాంటి దీనజనులు, విశ్వాసుల సంఘం ఆదరణను అండదండలను పొందలేక పోతున్నారు. వారు తమ జీవితాలకు నిర్దిష్ఠమైన గమ్యంగానీ అర్థం పరమార్థం గానీ లేకుండా నిరాశా నిస్పృహలతో బతుకులీడ్చుతున్నారు. ఇది మనకందరికీ ఆందోళన కలిగించవలసిన వాస్తవం.

ఈ నేపథ్యంలో – మనం దారి తప్పుతామేమోనన్న భయం కంటే, కృత్రిమ భద్రత కోసం వ్యవస్థాగత నిర్మాణాలలో బందీలమవుతున్నామనే భయం మనల్ని కదిలించాలి, కనువిప్పు కలిగించాలి. మనం ఏర్పరచుకున్న నియమ నిబంధనలు విధివిధానాలే మనలను ఇతరుల పాలిట కాఠిన్యం గల తీర్పరులనుగా చేస్తున్నాయి. మన ముంగిటనే దీనజనులు ఆకలిదప్పులతో అంగలార్చుతూ ఉంటే, మన పరిధులలో మనం పదిలమనే భావనతో నిర్లప్తంగా ఉండిపోతున్నాం. మరోపక్క – అన్నార్తులైన ప్రజలవంక చూస్తూ యేసుప్రభువు మనలనుద్దేశించి "మీరే వీరికి కావలసిన భోజన సదుపాయములను చేయుడు" (మార్కు 6:37) – అంటూ ఘోషిస్తూనే ఉన్నారు. ఇకనైన మనం ప్రభువు పిలుపునకు బదులు పలకాలి, అన్నార్తులను అభాగ్యులను అక్కున చేర్చుకోవాలి, ఆదరించాలి!

## 3. "సువార్తానందం" గుర్తు చేసిన బాధ్యతలు

### 3.1. విశ్వాస ప్రకటన – సామాజిక బాధ్యత

రక్షణ సందేశాన్ని సామాజిక శ్రేయస్సు నుండి విడదీయలేం. రక్షణ సందేశానికి, సహోదర ప్రేమకూ మధ్యగల సంబంధాన్ని గురించి – పవిత్ర

గ్రంథం అనేక సందర్భాలలో ఉపదేశిస్తుంది. ఆయా పవిత్ర వచనాలను భక్తి శ్రద్ధలతో పఠిస్తూ ధ్యానించడం ద్వారా మనకున్న సామాజిక బాధ్యతలను స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాం. రక్షణ సందేశ ప్రభావంతో సామాజిక జీవనంలో కలిగే సత్పరిణామాలను గుర్తించగలుగుతాం.

సాధారణంగా మనం – రక్షణ సందేశానికీ మన వ్యక్తిగత జీవితాలకు సామాజిక జీవనానికీ మధ్య గల సంబంధాన్ని అర్థం చేసుకోకుండానే, దైవోపదేశాలను యాంత్రికంగా వల్లె వేస్తూ ఉంటాం. దీని వలన సువార్తా గ్రంథం బోధించే సహోదర ప్రేమ, సామాజిక న్యాయ సందేశాలను ఆచరించటం ద్వారా లభించే పుణ్యఫలాలను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కోల్పోతాం. ఇది హానికరమైన పరిణామం.

నిజానికి – మన తోటి సహోదరీ సహోదరులందరు మనుష్యావతారుడైన ప్రభువుకు ప్రతిరూపాలు. కనుకనే యేసు ప్రభువు ఇలా అన్నారు "ఈ నా సోదరులలో అత్యల్పుడైన ఏ ఒక్కనికి మీరు ఇవి చేసినపుడు, అవి నాకు చేసితిరి" (మత్తయి 25:40). మనం మన సాటి మానవుల పట్ల ఏ విధంగా ప్రవర్తిస్తామో, అదే ప్రమాణం మనకూ వర్తిస్తుంది. "మీరు ఏ కొలతతో కొలిచెదరో ఆ కొలతతోనే మీకును కొలవబడును" (మత్తయి 7:2). తదనుగుణంగానే మనం తండ్రి దేవుని కనికరానికి పాత్రులం కాగలుగుతాం. "మీ తండ్రివలె మీరును కనికరము గలవారై ఉండుడు. పరులను గూర్చి మీరు తీర్పు చేయకుడు. మిమ్ము గూర్చి తీర్పు చేయబడదు. పరులను ఖండింపకుడు, అపుడు మీరును ఖండింపబడరు. పరులను క్షమింపుడు, మీరును క్షమింపబడుదురు. పరులకు మీరు ఒసగుడు, మీకును ఒసగబడును. మీరు ఏ కొలతతో కొలుతురో, ఆ కొలతతోనే మీకును కొలవబడును" (లూకా 6:36-38).

ఈ సువార్తా ప్రబోధాలను చూస్తే – మనం మన సాటి మనుష్యులకు ఎంతటి ప్రాధాన్యం ఇవ్వాలో స్పష్టంగా బోధపడుతుంది. అందుకుగాను – మనం మన స్వార్థ ప్రయోజనాలకు అతీతంగా ఆలోచించాలి, సాటివారి ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇదే ప్రధానమైన రెండు ఆజ్ఞలలో రెండవ ఆజ్ఞ.

అంతే కాదు – దేవుడు ఉచితంగా ప్రసాదించే ఆధ్యాత్మిక అభివృద్ధిని అంచనా వేయడానికి అనువైన పడికట్టురాయి కూడా ఇదే. ప్రేమ అనే వెలుగులో నిజానిజాలు, చీకటి వెలుగులు కనుగొని సరిచేసుకొనే అవకాశం కలుగుతుంది.

ఈ కారణం చేతనే "సాటి మానవులపట్ల ప్రేమతో చేసే సేవా కార్యక్రమాలు శ్రీసభ ధర్మనిర్వహణలో అంతర్భాగాలవుతాయి, శ్రీసభ ఉనికికి స్పష్టమైన ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి". అంతేకాదు సువార్తా ప్రబోధం చేయడం శ్రీసభ సహజ ప్రవృత్తి కనుక, అందులో భాగంగా సాటి మానవుల పట్ల ప్రేమతో సేవలు చేయడంలో కూడా శ్రీసభ ముందంజలో ఉంటుంది. సాటివారి పట్ల కనికరంతో మెలుగుతుంది, సహృదయంతో వారిని అర్థం చేసుకుంటుంది, వారికి అండగా ఉంటుంది, ప్రోత్సహిస్తుంది.

### 3.2. దైవరాజ్యం విసరే సవాళ్లు

పవిత్ర గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పఠిస్తే మనకు మరొక సత్యం కూడా బోధపడుతుంది. దేవుని పిలుపునకు మనం ప్రేమతో బదులు పలకడమూ అంటే – అవసరాలలో ఉన్న సాటి వ్యక్తులకు చిన్న చిన్న ఉపకారాలు చేయటమో, మన అంతరాత్మను ఉపశింపజేయడానికి ఏవో కొన్ని ధార్మిక కార్యాలు చేయడమో కాదు. సువార్తా సందేశ ప్రధాన ప్రబోధం – దైవరాజ్యం, భగవత్పాలన (చూడండి లూకా 4:43). మన సమకాలీన ప్రపంచాన్ని పరిపాలిస్తోన్న దేవుని త్రికరణశుద్ధిగా ప్రేమించాలన్నదే సువార్తా సందేశ సారాంశం. దేవుని పిలుపునకు మనమిచ్చే జవాబులో ఇది ప్రధాన భాగం. పునీత పౌలుని నిర్వచనంలో దైవరాజ్యమంటే నీతి, న్యాయం, శాంతి, పవిత్రాత్మ ఒసగే సంతోషము (చూడండి రోమీ 14:17).

దైవరాజ్యం ఏ మేరకు మనలో నెలకొని ఉంటుందో, దేవుని పాలన ఏ మేరకు మనలో వర్ధిల్లుతూ ఉంటుందో – ఆ మేరకు మన చుట్టూ ఉన్న సమాజంలో సర్వ మానవ సౌభ్రాత్రం, న్యాయం, ధర్మం, శాంతి, సమాధానాలు, మానవ గౌరవం మొదలైన విలువలు వర్ధిల్లుతూ ఉంటాయి. మరో మాటలో చెప్పాలంటే – క్రైస్తవులముగా మనం చేసే ప్రబోధాలు, మన క్రైస్తవ జీవనం మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రభావితం చేయగలగాలి.

అవును. మనం ఈ లోకంలో ముందుగా వెదకవలసినది, దైవరాజ్యమేనని సువార్తా సందేశం బోధిస్తోంది. "మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడు. అప్పుడవి అన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33). తన తండ్రి రాజ్యాన్ని ఆవిష్కరించటమే ఈ లోకంలో యేసు ప్రభువు నిర్వర్తించిన ప్రధాన ధర్మం. "పరలోక రాజ్యము సమీపించినది" (మత్తయి 10:7) అని ప్రకటించుమని ప్రభువు తన శిష్యులను ఆదేశించారు. దీనిని బట్టి కూడా – సువార్తా సారాంశం దైవరాజ్యమేనన్న సత్యం వెల్లడవుతుంది.

మన మధ్యనే నెలకొని ఉన్న దైవరాజ్యం మన మధ్యనే వర్ధిల్లుతోన్న దైవరాజ్యం ప్రతి దశలోను మన జీవితాలపై తన ప్రభావాన్ని చూపుతూ ఉంటుంది, సత్యాసత్య విచక్షణకు పరమ ప్రమాణంగా నిలుస్తుంది. ఆరవ పౌలు జగద్గురువులు చెప్పినట్లు "ప్రతి మనిషి సమగ్ర వికాసానికి, మానవులందరి పురోభివృద్ధికీ" దైవరాజ్య జ్ఞానాన్ని సద్వినియోగం చేయాలి.

"సువార్తా సందేశానికి, మానవుల వ్యక్తిగత జీవితానికీ సామాజిక జీవనానికీ మధ్యగల సన్నిహిత సంబంధాన్ని పరిగణలోనికి తీసుకొనకపోతే సువార్తా ప్రబోధం సంపూర్ణం కాదు".

లోకంలోని సకల జనులను రక్షించాలన్నది తండ్రి దేవుని ప్రణాళిక అని సువార్తా సందేశం స్పష్టం చేస్తున్నది. అవును. మానవులలోని ప్రతి ఒక్కరూ – స్త్రీ పురుషులందరు – రక్షణ పొందాలన్నది తండ్రి దేవుని సంకల్పం "దివియందలి భువియందలి సమస్త సృష్టిని క్రీస్తు నాయకత్వమున ఒకటిగా చేయుటయే దేవుని ప్రణాళిక" (ఎఫెసీ 1:10). యేసుప్రభువు మనకిచ్చిన ఆజ్ఞ కూడా అదే:

"మీరు ప్రపంచ మందంతట తిరిగి, సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మార్కు 16:15) ఎందుకంటే – "దేవుడు తన పుత్రులను వ్యక్తమొనర్చుటకై సృష్టియంతయు ఆతురతతో ఎదురు చూచుచున్నది" (రోమీ 8:19). ఇక్కడ "సృష్టి" అంటే మానవ జీవితానికి సంబంధించిన సర్వస్వమని అర్థం. అంటే – యేసు క్రీస్తు సువార్తా సందేశం లోకంలోని సమస్తానికీ వర్తిస్తుంది, సమస్తాన్నీ ప్రభావితం చేయగలుగుతుంది.

కనుకనే – "యేసుక్రీస్తు సువార్తలోని ప్రేమ సేవాజ్ఞ లోకంలోని సమస్తానికీ, సకల మానవులకు, సామాజిక జీవనంలోని అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే – మానవ సంబంధమైన ప్రతిదీ ప్రభు ప్రేమాజ్ఞ పరిధిలోనికి వస్తుంది".

## 3.3 చైతన్యవంతులైన గురువులు కావాలి

కొన్నిసార్లు మనకై మనమూ నిర్మించుకొన్న చట్రాలలో మనవే నిర్బందించుకుంటాము. మనం బిగించుకున్న చట్రాలకు మనమే బంధీలం. చట్టాల వలయంలో కొన్నిసార్లు కఠినమైన న్యాయాధిపతుల్లా వ్యవహరిస్తాం.. మనం కట్టుకొన్న గోడల మధ్య మనం క్షేమంగా ఉన్నామనుకొంటాం. కాని మన ముంగిట, మన తలవాకిట ఆకలికి అలమటించే ప్రజలున్నారనే స్పృహ ఉండదు. కాని మనం కొలిచే రక్షకుడు మాత్రం "వారికి తినడానికి ఏదైనా ఇవ్వండి" అంటూ అలుపెరుగని అభ్యర్ధన చేస్తూనే ఉంటాడు. సువార్తను ప్రజల చేరువలోనికి తీసుకురావడంలో గురువులకు తిరుసభ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచింది. అందుకని వారు వారి పిలుపుకు ధీటుగా స్పందించడం అలవరచుకోవాలి. గురు జీవిత ప్రస్థానంలో అనేక సవాళ్లు ఎదురవుతుంటాయి. కానీ వాటినన్నిటినీ అధిగమిస్తూ క్రీస్తు ప్రభువు చూపిన బాటలో పయనించడమే వారి కర్తవ్యం అంటూ గురువులకు పాపుగారు కొన్ని సూచనలు చేశారు.

## 3.4. పూజా ప్రసంగాల ప్రత్యేకత

దైవార్చనల్లో చేసే దైవవాక్యోపదేశాలు, అందులోనూ దివ్యపూజల్లో చేసే ప్రసంగాలు – ప్రధానంగా ధ్యానానికీ సత్యోపదేశానికీ ఉద్దేశించినవి కావు: అలాగే – మానవ రక్షన చరిత్రలోని వివిధ ఘట్టాలను, దేవుడు చేసిన మహత్కార్యాలను వెల్లడించే సందర్భంగాని, దేవునితో మానవులు చేసుకున్న ఒడంబడికకు సంబంధించిన నియమ నిబంధనలను గుర్తు చేసుకొనే సమయం గానీ ఇది కాదు".

దివ్యపూజలో చేసే ప్రసంగానికీ ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ఇది అన్ని రకాల సత్యోపదేశాలకంటే అతీతమైనది. సర్వోత్తమమైనది. దివ్యపూజలో

జరిగే దైవవాక్యార్చనలో – దైవ మానవ సంభాషణ ఉన్నత స్థాయిలో జరుగుతుంది. అది దేవునికీ మానవులకు మధ్య అన్యోన్య సహవాసాన్ని పెంపొందిస్తుంది.

దివ్యపూజలో గురువు చేసే ప్రసంగం – ప్రభువు తన ప్రజలతో జరిపే ఆత్మీయ సంభాషణకు కొనసాగింపుగా ఉండాలి. అందుకుగాను గురువుకు తన సంఘం నాడి తెలిసి ఉండాలి. విశ్వాసులకు దేవునితో గల ప్రేమానుబంధం ఏ యే అంశాలలో ఎంత బలీయంగా ఉన్నదో, ఒకప్పుడు సజావుగా సాగిన దైవమానవ సంబంధాలు ఇప్పుడు ఎందుకు దెబ్బతిన్నాయో, విశ్వాసుల జీవితాలెందుకు మోడువారిపోయాయో గురువులు క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి.

దివ్యపూజలో గురువులు చేసే ప్రసంగాలు – సమాచార మాధ్యమాలు ప్రసారం చేసే వినోద కార్యక్రమాల వంటివి కావు. అవి దివ్యబలి సాంగ్యాలకు ప్రాణప్రతిష్ట చేసేవిగా ఉండాలి. దివ్యపూజలో విశ్వాసులు అర్థవంతంగా పాల్గొనడానికి తోడ్పడాలి. గురువుల ప్రసంగాలు పవిత్ర దైవార్చనలో ప్రధాన భాగాలుగా ఉంటాయి. కనుకనే అవి ప్రత్యేక వర్గానికి చెందిన ప్రబోధాలవుతాయి (ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటాయి).

దివ్యపూజలో చేసే ప్రసంగాలు – సాధ్యమైనంత క్లుప్తంగా ఉండాలి. సూటిగా స్పష్టంగా ఉండాలి. అవి బహిరంగ వేదిక మీద చేసే సుదీర్ఘ ఉపన్యాసాల మాదిరిగానో, క్లాసులో టీచర్లు చెప్పే క్లిష్టమైన పాఠాలుగానో ఉండకూడదు. కొందరు బోధకులు తమకున్న వాక్చాతుర్యంతో గంటసేపు (గంటలకొద్దీ) ప్రజలను కట్టిపడేస్తూ ప్రసంగించగలరు. మంచిదే, కానీ అలాంటి సందర్భాలలో బోధకుల వాక్చాతుర్యమే ప్రజలను ఆకట్టుకుంటుంది. గానీ, ప్రధాన దైవార్చనం ప్రధాన సందేశం వెనుకబడతాయి. అంటే – దివ్యపూజకు ఇవ్వవలసిన ప్రాధాన్యం – ప్రసంగానికీ బోధకుల వ్యక్తిగత ప్రతిభకూ ఇచ్చినట్లవుతుంది. అదీగాక – దివ్యపూజలో ప్రసంగాలు ఎంతకూ తరగనంత సుదీర్ఘంగా ఉంటే – దైవార్చనలో ఉండవలసిన రెండు ముఖ్యాంశాలు – సమతూకం, లయబద్ధత దెబ్బతింటాయి. కనుక ప్రసంగాలలో క్లుప్తత, స్పష్టత పాటించాలి.

అలాగే గురువులు చేసే ప్రసంగాలు దివ్యపూజార్పణంలో సమతుల్యంగా ఇమిడిపోతే – అవి కూడా దివ్యబలిలో మనం దేవునికి సమర్పించే

కానుకలవుతాయి, ప్రభువు మనకు అనుగ్రహించే కృపావరాలకు వాహికలవుతాయి. అంటే – దివ్యపూజలో చేసే ప్రసంగాలు (వాక్యపరిచర్య) – ఇటు దైవ ప్రజలు అటు అర్చకుడు (బోధకుడు) కూడా క్రీస్తు ప్రభువుతో సన్నిహిత సహవాసాన్నీ ఆత్మీయ బంధాన్ని ఏర్పరచుకోవడానికి, తద్వారా తమ జీవితాలలో మేలైన మార్పులు తెచ్చుకోడానికి సహాయపడాలి.

మరో మాటలో చెప్పాలంటే – దివ్యపూజలో ప్రసంగించే బోధకుల (గురువుల) మాటలు మితంగా ఉండాలి. క్లుప్తంగా ఉండాలి. బోధకుల కంటే అధిక ప్రాధాన్యం ప్రభువుకు దక్కేలా చూడాలి. విశ్వాసుల దృష్టి బోధకుడి ప్రతిభ మీద కంటే, ప్రభుతత్వ మహాత్వాల మీద కేంద్రీకరింపబడేట్లు జాగ్రత్త వహించాలి.

## 3.5. వసుదైక కుటుంబము – గురువుల ప్రయత్నము

ఇంతకు ముందు చెప్పుకున్నట్లు – శ్రీసభ తనలో పనిచేస్తోన్న పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం – నిరంతరము తనకు తానే సువార్తా ప్రబోధం చేసుకుంటూ ఉంటుంది. నూతనోత్తేజం పొందుతుంటుంది. ఈ సూత్రీకరణం నుంచి వాక్య పరిచారకులు (ప్రబోధకులు) నేర్చుకోవలసిన పాఠం, తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే – శ్రీసభ మన తల్లి. ఒక తల్లి తన బిడ్డతో ఎలా ప్రేమతో ఆత్మీయంగా మాట్లాడుతుందో, అలాగే మన తల్లి శ్రీసభ కూడా అంతే ప్రేమానురాగాలతో మనకు సత్య ప్రబోధం చేస్తుంది. తన మీద, తాను చేసే ప్రబోధం మీద తన బిడ్డకు పూర్తి నమ్మకం ఉంటుందన్న యథార్థం తల్లికి తెలుసు. అలాగే తల్లి ఏది బోధించినా అది తన మేలు కొరకేనన్న నిజం బిడ్డకు తెలుసు.

అంతేకాదు – మంచి తల్లి తన బిడ్డకు దేవుడు చేస్తున్న మేలులను, వారి జీవితాల్లో తెస్తోన్న మార్పులను వారిని తీర్చిదిద్దుతోన్న తీరును ఎప్పటికప్పుడు గ్రహించగలుగుతుంది. అలాగే మంచి తల్లి తన పిల్లల మాటలను శ్రద్ధతో ఆలకిస్తుంది, వారి ఆశలను ఆకాంక్షలను గ్రహిస్తుంది, తన పిల్లల నుంచి పాఠాలు నేర్చుకోడానికి కూడా వెనుకాడదు.

నిజానికి – కుటుంబంలో నెలకొని ఉండే ప్రేమపూరిత వాతావరణమే ఆ తల్లీ బిడ్డల సంభాషణలను ప్రభావితం చేస్తుంది, వారు పరస్పరం ప్రేమతో సంభాషించుకోడానికి తోడ్పడుతుంది. తల్లీబిడ్డలు ఒకరికొకరు బోధించుకుంటారు,

ఒకరి నుంచి ఒకరు పాఠాలు నేర్చుకుంటారు, ఒకరినొకరు సరిదిద్దుకుంటారు, మంచిని మనస్సుకు హత్తుకుంటూ కలిసి ఎదుగుతారు.

గురువులు (దివ్యపూజలో) చేసే ప్రసంగాల విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. సువార్తల రచనకు మౌళిక ప్రేరణగా నిలిచిన పవిత్రాత్మ ప్రభువు నేడు బోధకులను కూడ తన దివ్యశక్తితో ప్రేరేపిస్తున్నారు. అలాగే దైవ ప్రజల భక్తి విశ్వాసాలను శ్రద్ధగా గమనిస్తూ, తదనుగుణంగా ప్రసంగించే సృజనాత్మక శక్తిని పవిత్రాత్మ ప్రభువే బోధకులకు అనుగ్రహిస్తున్నారు. అంటే తాము అందించదలచుకున్న సందేశానికి అనువైన విధానాన్ని ఎంపిక చేసుకొని సూటిగా స్పష్టంగా ప్రసంగించడానికి పవిత్రాత్మ తోడ్పడతారు. ఆ విధంగా బోధకుడు (గురువు) – దైవ ప్రజల హృదయాలలోను, వారి సంస్కృతులలోను జీవపు ఊట అయిన పవిత్రాత్మను కనుగొనగలుగుతాడు. అంతేకాదు – పవిత్రాత్మ సహాయంతోనే గురువు తన ప్రసంగంలో ప్రజలకు ఏ సందేశాన్ని అందించాలో, ఆ సందేశాన్ని ఎలా ప్రబోధించాలో తెలుసుకోగలుగుతాడు.

ఇకపోతే – సాధారణంగా మనమందరమూ ఇతరులు మనతో మన మాతృ భాషలోనే మాట్లాడాలని కోరుకుంటూ ఉంటాం. అలాగే – విశ్వాసానికి సంబంధించిన విశేషాలను నిగూఢ సత్యాలను కూడా మనం మన మాతృ సంస్కృతి (మదర్ కల్చర్)లో, మన మాతృభాషలోనే వినాలని కోరుకుంటాం (చూడండి . 2 మక్కబీ 7:21,27). మన మాతృభాష శ్రావ్యమైన సంగీతంలా వినిపిస్తుంది, సద్భావనలను ప్రేరేపిస్తుంది, మనలను ప్రోత్సహిస్తుంది, బలపరుస్తుంది, ఉత్సాహంతో ముందంజ వేయిస్తుంది.

ఇలా – ప్రసంగాలు – ప్రభువుకు తన ప్రజలకు మధ్య సాగే ఆత్మీయ సంభాషణల్లా కొనసాగాలి. అలాగే – ప్రసంగించే గురువులు విశ్వాసుల పట్ల ఆదరాభిమానాలు, వారి కంఠ స్వరంలో పలికే కారుణ్యం, కపటంలేని వారి మాటతీరు, ఆత్మానందాన్ని వ్యక్తం చేసే హావభావాలు – ఇవన్నీ ప్రసంగాలకు ప్రాణప్రతిష్ఠ చేయాలి.

కొన్నిసార్లు గురువుల ప్రసంగాలు కటువుగాను నిరుత్సాహకరంగాను ఉండవచ్చును. కానీ తల్లి శ్రీసభ మాతృత్వపు వాత్సల్యంతోను, ఔదార్యంతోను

గురువులు చేసే ప్రసంగాలు కటువుగా వినిపించినప్పటికీ చివరికి అవి సత్ఫలితాలనే ఇస్తాయి. ఒక తల్లి పలికే మందలింపు మాటలు వినడానికి కటువుగా ఉన్నప్పటికీ, కాలక్రమంలో ఎలా ఆ మాటలు బిడ్డల జీవితాలను ఫలభరితం చేస్తాయో, అలాగే వాత్సల్యపూరిత హృదయాలతో గురువులు చేసే ప్రసంగాలు కటువుగా ఉన్నప్పటికీ, క్రమక్రమంగా అవి విశ్వాసుల జీవితాలను వికాసవంతం చేస్తాయి.

అదే విధంగా – యేసుప్రభువు ప్రజలతో సంభాషించేటప్పుడు, తన నిగూఢ సత్యాలను అందరికీ వెల్లడించేటప్పుడు, అనుసరించిన విధానాలు ఆశ్చర్యకరంగాను ప్రశంసనీయంగాను కనిపిస్తాయి. నిజానికి – ప్రభువు తన సాటి ప్రజలను చూచిన దృష్టి కోణంలోనే ఆయన విజయ రహస్యం దాగి వున్నదని పాపుగారు వివరిస్తున్నారు. ప్రభువు ఎప్పుడూ ప్రజల బలహీనతలను పరాజయాలను పరిగణలోనికి తీసుకోలేదు. వాటికి అతీతమైన ఉదారదృష్టితో వారిని చేరదీశారు ఆదరించారు. "ఓ చిన్నమందా! భయపడవద్దు. మీకు రాజ్యమును ఇచ్చుట మీ తండ్రికి ఇష్టము" (లూకా 12:32). అలాగే యేసుప్రభువు ఆత్మసాక్షిగా ప్రసంగించారు, పవిత్రాత్మ ప్రసాదించిన ఆత్మానందంతో ప్రబోధించారు. అందులో భాగంగానే – చిన్న బిడ్డలను చేరబిలిచి నిగూఢ సత్యాలను తెలియపరచిన తండ్రి దేవుని మనసారా కీర్తించారు. "ఓ తండ్రీ! పరలోక భూలోకములకు అధిపతీ! ఈ విషయములు నీవు జ్ఞానులకును, వివేకులకును మరుగుపరచి, పసిబిడ్డలకు వీనిని తెలియపరచినందులకు నీకు ధన్యవాదములు" (లూకా 10:21). అంతేకాదు – యేసుప్రభువు ఆనందోత్సాహాలతో ప్రజలతో సంభాషించేవారు (ప్రబోధించేవారు), ప్రబోధిస్తూనే ప్రభువు పరమానంద భరితులయ్యేవారు. ప్రతి గురువు, ప్రతి బోధకుడు ప్రభువు అడుగు జాడల్లో నడవాలి – ఆంనదోత్సాహంతో ప్రసంగించాలి, ప్రసంగిస్తూ పరమానందభరితులు కావాలి, తాము పొందే ఆత్మానందాన్ని ఆలకించే ప్రజలందరితో పంచుకోవాలి.

## 3.6. సామాజిక సమస్యలు – సమగ్ర వికాసం

శ్రీసభ సామాజిక ప్రబోధాలను సమకాలీన సమాజంలోని వాస్తవస్థితి గతులకు అన్వయించుకోగలిగినపుడే, నేటి సమాజంలోని క్లిష్టమైన పరిస్థితులను అవి ప్రభావితం చేయగలుగుతాయి. జటిలమైన సమస్యలకు సైతం అవి తగిన పరిష్కారాలను సూచించగలుగుతాయి.

అంతేకాదు – సువార్తా ప్రబోధం పరమలక్ష్యం సమాజంలోని ప్రతి మనిషి సమగ్రవికాసానికి దోహం చేయడమే గనుక ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ప్రతి అంశం మీద మాట్లాడేహక్కు ప్రతి సమస్య గురించి చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేవాక్కు – శ్రీసభ పరిచారకులు (గురువులు) అందరికీ ఉంటుంది. మతం కేవలం వ్యక్తిగత వ్యవహారమనీ, మానవుల ఆత్మలను మోక్షానికి చేర్చడం మాత్రమే మతం చేయగవలసిన పని అనీ చేసే వాదనలిక చెల్లవు (182).

## 3.7. సామాజిక స్పృహ – సమిష్టి శ్రేయస్సు

తండ్రి దేవుడు – తన సంతానమైన మానవులందరు ఈ లోకంలో సుఖశాంతులతో సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నారు. మానవ జీవితం పారలౌకికమైన నిత్యజీవ ప్రాప్తితోనే పరిపూర్ణ మవుతుందన్నది యథార్థమే అయినప్పటికీ మానవుల ఇహలోక జీవనం కూడా ఆనందమయంగా గడవాలన్నది దేవుని సంకల్పమని గ్రహించాలి. నిజానికి లోకంలోని సమస్తాన్నీ దేవుడు “మనము సంతోషముగా అనుభవించుటకు ధారాళముగా” వొసగారు (1 తిమోతి 6:17). లోకంలోని ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించడానికే దేవుడు సమస్తాన్నీ సృష్టించారు.

ఈ నేపథ్యంలోనే – యథార్థమైన క్రైస్తవుడు “సామాజిక జీవనానికీ, సమిష్టి శ్రేయస్సుకు” సంబంధించిన తన అభిప్రాయాలను తప్పక సమీక్షించు కుంటాడు, తన నమ్మకాలను సవరించుకుంటాడు. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా తనను తాను సంస్కరించుకుంటాడు.

కనుక, మతాన్ని కేవలం మనిషి ఆత్మకూ అంతరంగానికి మాత్రమే పరిమితం చేయాలని ఎవరూ నిర్బంధించలేరు. జాతీయ జీవన స్థితిగతులకూ మతానికీ ఎలాంటి సంబంధమూ లేదనిఎలాంటి సంబంధమూ ఉండరాదనీ ఎవరూ నిర్దేశించలేరు. అదే విధంగా సామాజిక వ్యవస్థలు, పౌరపాలనా సంస్థల మంచీ చెడులపై మాట్లాడే అవకాశంగానీ, సమాజాన్ని ప్రభావితం చేస్తోన్న వివిధ సంఘటనల పట్ల తన అభిప్రాయాలను వెల్లడించే హక్కుగానీ మతానికి ఉండదనీ ఎవరూ తీర్మానించలేరు (183).

పునీత అస్సిసీ ఫ్రాన్సిస్ గారి సందేశాన్ని గానీ, పునీత థెరీస్సా ఆఫ్ కలకత్తా (మదర్ థెరిస్సా) గారి సందేశాన్ని గానీ గుడిలో బంధించగలవారెవరు, గుడికే (మతానికే) పరిమితం చేయగలవారెవరు? అది సాధ్యం కాదు.

## 4. ముగింపు

విశ్వమానవ శ్రేయస్సు కోరి సువార్తానందం చేసిన ఈ ప్రబోధనలు సమాజంలో సమానత్వం, సమతుల్యత, సర్వమానవ సౌభ్రాతృత్వం, సమాజ శ్రేయస్సు కోరి చేసినవి. క్రైస్తవులు ఈ ప్రస్థానంలో ముందుండి ఇతర ప్రజలకు మార్గదర్శకులు కావాలి. ఇవి ఫ్రాన్సిస్ పాపుగారు కోరుకున్న చొరవతో కూడిన ప్రయత్నాలు – ఆచరించవలసిన ప్రతిపాదనలు.

ఈ భూగోళం మన ఉమ్మడి కుటుంబం. మానవులమైన మనమందరం అన్నదమ్ములం, అక్కాచెల్లెంద్రం. "సమాజాన్ని, దేశాన్నీ న్యాయబద్ధంగా పరిపాలించడం రాజకీయ వ్యవస్థ ప్రధాన ధర్మమే అయినప్పటికీ న్యాయస్థాపన కృషిలో, న్యాయ సాధన పోరాటంలో శ్రీసభ నిర్లిప్తంగా ఓ పక్కన నిలబడి ప్రేక్షకపాత్ర వహించదు, నిరాసక్తంగా చూస్తూ ఊరకుండిపోరాదు". క్రైస్తవులందరు – వారి సంఘ పరిచారకులతో (గురువులతో) సహా – అందరు మెరుగైన సమాజ నిర్మాణంలో మెరుగైన ప్రపంచ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. ఇది క్రైస్తవ ప్రధాన ధర్మాలలో ఒకటి. ఈ ప్రయత్నంలో శ్రీసభ గాయపడి, బాధామయమయినా ఆశ్చర్యపోనవసరం లేదు.

నిజానికి – యథార్థమైన విశ్వాసం సమకాలీన ప్రపంచంలో మంచి మార్పులు తేవాలని తపిస్తుంది. మెరుగైన సమాజాన్ని నిర్మించాలనే ఆకాంక్ష కలిగి ఉంటుంది. అలాగే యథార్థమైన విశ్వాసం ప్రపంచానికి ఉదాత్తమైన విలువలను అందించాలనీ, మనం జన్మించే నాడున్న ప్రపంచాన్ని కొంతయినా మెరుగుపరచి నిష్క్రమించాలనీ కోరుకుంటుంది. ఆ అభివృద్ధిలో మన పాత్ర కొంతయినా ఉండాలి.

దేవుడు మనకు అనుగ్రహించిన, మనకొక ఉనికినిచ్చిన ఈ మహత్తరమైన భూగోళాన్ని మనం గాఢంగా ప్రేమించాలి. అలాగే – ఈ భూగోళం మీద జీవనం సాగిస్తోన్న యావత్ మానవ కుటుంబాన్నీ అంతే గాఢంగా ప్రేమించాలి. ఎన్ని సంక్షోభాలు, ఎన్ని ఆశలు ఎన్ని నిరాశలు, ఎన్ని బలాలు ఎన్నెన్ని బలహీనతలు – అన్నింటితోనూ మనం మానవ సమాజాన్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకోవాలి.

❊ ❊ ❊ ❊

# 6. సువార్తానందం : ఆంధ్ర, తెలంగాణ శ్రీసభలో సమతుల్య ఆధ్యాత్మికత

– ఫాదర్ దొడ్డ రాజా



*ఫాదర్ దొడ్డ రాజా గారు రోమా నగరంలోని ఆంజలికం విశ్వవిద్యాలయం నందు ఆధ్యాత్మిక దైవశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయంలో సందర్శన ఆచార్యులుగా సేవలు చేస్తున్నారు. వీరు ప్రస్తుతం వరంగల్ మేత్రాసణంలోని సుబేదారి విచారణలో విచారణ గురువులుగా సేవలందిస్తున్నారు.*

ఫ్రాన్సిస్ జగద్గురువుల అపోస్తులిక ప్రబోధం "సువార్తానందం" 'ఎవాంజెలిఇ గౌదియుం' నవ్య సువార్తీకరణను బలోపేతము చేయుటకు అందించబడినది. ఇది ఆధ్యాత్మిక జీవితం గురించి వ్రాయబడిన గ్రంథం కాదు. ఆయన "తాను క్రైస్తవ ఆధ్యాత్మికతను సమీక్షించదలచుకోలేదని, ప్రార్థన గురించి గాని, దివ్యసత్ప్రసాద ఆరాధన గురించిగాని, లేదా విశ్వాసంతో కొనియాడే ఇతర దైవార్చనల గురించిగాని సవివరంగా చర్చించదలచుకోలేదని వ్రాసారు. ఎందుకంటే, దీనికి సంబంధించిన శ్రీసభ అధికకారిక ప్రబోధాలు అనేకం, ఉన్నాయని అలాగే ప్రసిద్ధులైన రచయితలు చేసిన ప్రఖ్యాత రచనలెన్నో మనకు అందుబాటులో ఉన్నాయని అందువలన తాను వాటికంటే విశిష్టమైన ప్రభావాలు చేయగలనని గాని, అమూల్యమైన ఆ రచనలను కొంతవరకైన మెరుగుపరచగలనని

గానీ తాను భావించడం లేదు" అని వ్రాసారు. (ఇ.జి. 260) అయినప్పటికిని ఆధ్యాత్మికతను ఒక కోణంలోనే చూడకూడదు. అందుకే క్రీస్తు కేంద్రీకృత, పవిత్రగ్రంథ ఆదారిత ఆధ్యాత్మికతను ఉద్భోధిస్తూ సువార్త సేవకు అంకితం కావాలని పిలుపునిస్తూంది.

క్రైస్తవ జీవితమనగా ఆత్మానుసారముగా జీవించటం. దేవుని ఆత్మలో నడుపబడిన ప్రతి ఒక్కరు దేవునికి చెందినవారని పునీత పౌలుగారు వ్రాసిన రోమ 8:9లో చదువుచున్నాము. ఎస్క్వెర్డా బిఫెట్ క్రైస్తవ ఆధ్యాత్మికత అనగా 'అది ఒక జీవిత విధానం లేక ఆత్మతో నడిపించబడిన జీవితం' అనగా క్రీస్తు ప్రభు రక్షణ కార్యములో విశ్వాస పాత్రముగా, బాధ్యతాయుతముగా పాల్గొనుటకు ఆత్మచే ప్రభావితం చేయబడిన జీవితమని నిర్వచించారు. పై ఇద్దరి భావాలను విశ్లేషిస్తే క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితమంటే క్రీస్తు ఆత్మతో నడుపబడిన జీవితమని, సువార్తకు అనుగుణంగా మలచబడిన జీవితమనీ, సువార్తను కార్యరూపంలో పెట్టే జీవన విధానమని మనకు అవగతమౌతుంది.

సువార్తానందంలో నేటి క్రైస్తవ ఆధ్యాత్మిక జీవితంలో ఉన్న లోపాలను విశ్లేషిస్తూ, వాస్తవమైన ఆధ్యాత్మికతను చూపించుటకు ఫ్రాన్సిస్ పాపు గారు కృషిసలిపారు. మారుతున్న ప్రపంచానికనుగుణంగా క్రైస్తవుల జీవన శైలీ మారింది. ఆ మార్పు క్రైస్తవ ఆధ్యాత్మిక భావనల మీద పడింది. నాటి క్రైస్తవులు స్వార్థాన్ని వీడి పరమార్థాన్ని కాంక్షిస్తే, నేటి క్రైస్తవులు వ్యక్తిగత ప్రయోజనాలను ఆశిస్తున్నారు. ప్రార్థన కూడ వ్యక్తిగతమైపోయిన సందర్భంలో జీవితాలను సువార్తా ప్రచారానికి అంకితం కావించుకోవడానికి నిరాకరిస్తున్నారు. పై పై తళుకులతో మురిపిస్తున్న కపటపు ఆధ్యాత్మిక రీతులను ఆశ్రయించి నష్టపోతున్నారు.

పవిత్ర గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో పఠిస్తే మనకొక సత్యం బోధపడుతుంది. ఆధ్యాత్మిక జీవితమంటే దేవునితో మన వ్యక్తిగత సంబంధం మాత్రమే కాదని, దేవునికి మనపై గల ప్రేమను ఎరుకపరచేదని తెలియజేస్తుంది. దేవుని రాజ్యం ఏమేరకు మనలో వర్ధిల్లుతూ ఉంటుందో ఆ మేరకు మన చుట్టూ, మన సమాజంలో సర్వ మానవ సౌభ్రాత్రం, న్యాయం, ధర్మం, శాంతి సమాధానాలు, పరస్పర

గౌరవాదరాలు మొదలైన విలువలు వర్ధిల్లుతూ ఉంటాయని తెలియజేస్తుంది. (ఇ.జి. 180) ఫ్రాన్సిస్ పాపుగారు సువార్తకు అనుగుణమైన ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రజలు కోరుకోవాలని ఆశిస్తున్నారు.

క్రైస్తవుల యథార్థమైన విశ్వాసం సమకాలీన ప్రపంచలో మార్పులు తేవాలని తపిస్తుందని, మెరుగైన సమాజాన్ని నిర్మించాలనే ఆకాంక్ష కలిగి ఉంటుందని, ప్రపంచానికి ఉదాత్తమైన విలువలను అందిస్తుందనీ తెలియ పరుస్తున్నారు. ఫ్రాన్సిస్ గారి సువార్తానందం క్రీస్తు కేంద్రీకృతమైన ఆధ్మాత్మికతకు, సువార్తీకరణ కొలమానాలను సూచిస్తుంది. "ఆత్మప్రేరిత సువార్త ప్రబోధమంటే, సాక్షాత్తూ పవిత్రాత్మ ప్రభువు తోడుగా ఉండి మార్గ విర్దేశం జేస్తూ తన సంకల్పానుసారం జరిపించే సువార్తా ప్రబోధం" (ఇ.జి. 261) అని నిర్వచిస్తు సువార్తీకులలో పవిత్రాత్మయే ప్రధాన ప్రతినిధిగా పనిచేస్తున్నట్లు తెలుపుచున్నారు. కాబట్టి క్రైస్తవ ఆధ్యాత్మికత అంటే ప్రపంచం నుండి పారిపోవడం కాదని లేదా సామాజిక బాధ్యతలను విస్మరించడం కాదని, ప్రపంచంలో చురుకైన పాత్రను అది పోషించాలి.[3] సువార్తీకరణే ఆధ్మాత్మికతకు నిజమైన కొలమానం.

## 1. నేటి ఆధ్యాత్మిక జీవితానికి ఎదురౌతున్న ప్రమాదకర పరిస్థితులు, సవాళ్లు

1. ఒకప్రక్క నిరాశా నిస్పృహలు, ఆగ్రహావేశాలు, స్వార్థపూరిత ప్రయోజనాలు, మరోప్రక్క అత్యాశతో చెలరేగే అలజడులు, అశాంతి, ఆవేదనలు, ఇంకోప్రక్క నీతి బాహ్యమైన ఆనందాలకోసం వెంపర్లాటలు, అన్నింటినీ మించి మొద్దుబారుతున్న అంతరాత్మలు– ఇవన్నీ నేటి ఆధ్యాత్మిక జీవితానికి ఎదురయ్యే ప్రమాదకర సంకేతాలే. (ఇ.జి. 2)

2. నేటి మన సువార్తా పరిచారకుల్లో అనేక మంది తమ వ్యక్తిగత స్వేచ్ఛ కోసం ఆరాటపడుతాన్నారు. విశ్రాంతి విరామాల కోసం ఎక్కువగా తాపత్రయ పడుతున్నారు. అత్యంత ప్రధానమైన సువార్తా పరిచర్యను తమ జీవితానికి జత చేయబడిన అదనపు భాగంగా, అది తమకెంతో భారంగా భావిస్తున్నారు. సువార్తా పరిచర్య తమ అస్థిత్వంలో అంతర్భాగమని గ్రహించలేకపోతున్నారు. తాము ఇతరుల మాదిరి ఉండాలని, ఇతరులు చేసే పనులు తామూ చేయాలని, ఇతరులు సంపాదించుకొన్నవి తామూ సంపాదించుకోవాలని

ఉబలాటపడుతున్నారు. ఫలితంగా తాము చేస్తున్న పరిచర్య పట్ల అనాసక్తతను పెంచుకుంటున్నారు. సువార్తా పరిచర్యను బలవంతంగా అప్పజెప్పబడిన బాధ్యతగా భావిస్తున్నారు. ఆసక్తి లేకపోవడంతో దానికి అతి తక్కువ సమాయాన్ని, అతి తక్కువ శ్రమ శక్తిని వెచ్చిస్తున్నారు. ఫలితంగా తాము చేస్తున్న సువార్తా ప్రబోధం ద్వారా పొందే అంతరంగిక ఆనందాన్ని కోల్పోతున్నారు. (ఇ.జి. 78-79).

3. సువార్తీకులు సువార్తా పరిచర్యకు తమ జీవితాలను అంకితమొనర్చుకోవడానికి బదులు ఆర్థిక భద్రతకు, లౌకిక అధికారానికీ, లౌకికమైన పేరు ప్రఖ్యాతులకు ప్రాధాన్యమిస్తున్నారు (ఇ.జి. 80).

4. కొందరు సువార్తీకులు తమకు అప్పగింపబడిన సువార్తా పరిచర్యను చేపట్టడానికి సహితం వెనుకాడుతున్నారు. అలాంటి పరిచర్యను చేపడితే తమ ఖాళీ సమయమంతా వృధా అవుతుందని భయపడుతున్నారు. సువార్తా పరిచర్యకు తమను తాము సంపూర్ణంగా సమర్పించుకొని అంకిత భావంతో పనిచేయని వారు అచేతనత్వంతో అకారణమైన అలసటతో పీడింపబడుతున్నారు. (ఇ.జి. 81)

5. ఈ రోజుల్లో సువార్తీకులు ఎదొర్కొంటున్న తీవ్రమైన శోధనలు – నిరాశావాదం, పోరాడక ముందే పరాజయాన్ని అంగీకరించే తత్త్వం మొదలైనవన్నీ సువార్తా ప్రచారానికి అవరోధాలే. (ఇ.జి. 85).

6. ఆధ్యాత్మికత లౌకికత ప్రమాదం : ఆధ్యాత్మికత ముసుగులో లౌకిక వ్యామోహాలు గలవారు దేవుని మహిమను కొనియాడటానికి బదులు తమకు మానవులిచ్చే గౌరవాన్ని, కీర్తిని, వ్యక్తిగత శ్రేయస్సును కోరుకుంటూ ఉంటారు. లౌకికత అనే వినాశకరమైన అగ్నికి రెండు మార్గాలుగా సాక్షాత్కరిస్తుంది. ఒకటి జ్ఞానవాదం. ఒక సిద్ధాంతం నిజంగా ప్రమాణికమైనది, అవసరమైనది. అయితే అది స్వీయ ప్రేమికులనుగా మార్చదు. ఇలాంటి వారు తమ హృదయ ద్వారాలు తెరచి దేవుని కృపను ఆహ్వానించడానికి బదులు సత్కార్యాచరణకు తమ శక్తి యుక్తులను ధారవోయడానికి బదులు ఇతరులను విమర్శించుటలోనే ఇతరుల

మంచి చెడులను ఎంచడంలోనే తమ శక్తి సామార్థ్యాలన్నింటినీ వృధా చేస్తుంటారు (ఇ.జి. 93-94).

7. సువార్తా ప్రచారకులలో విభజనలు : కొన్ని క్రైస్తవ సంఘాలలో, దైవాంకితులలో కూడా అకారణంగా విభజనలు, శత్రుత్వాలు పెరుగుతున్నాయి. ఎవరికి వారుగా విడిపోతూ దుష్ప్రచారాలతో పరస్పరం నిందారోపణలు చేసుకుంటున్నారు. ఇవన్నీ చూస్తూ కొందరు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. ఆధ్యాత్మిక భావనలు కొరవడటమే వీటన్నిటికీ మూలకారణమని చెప్పవచ్చు (ఇ.జి. 100).

8. మన దేశంలోని పలురకాల రుగ్మతలైన కులతత్వం, అంటరానితనం, బాలకార్మిక వ్యవస్థ, పేదరికం, దోపిడి, మహిళలు, బాలకలపై వివక్ష వంటివన్నీ సువార్తీకులపై ప్రభావం చూపిస్తున్నాయి. ప్రపంచీకరణ ఒక ప్రక్క ప్రగతికి బాటలు వేస్తూ మరో ప్రక్క నిరుపేదల, అట్టడుగు వర్గాల ప్రజలను బలిచేస్తుండడం వారిని విస్మయపరుస్తోంది.

9. స్థానిక తెలుగు శ్రీ సభ ఎదుర్కొంటున్న సవాళ్ళు - ప్రచార, ప్రసార మాధ్యమాలు, కతోలిక సంఘం పట్ల సానుకూలత లేకపోవడం, అవకాశవాదులు సృష్టించే నూతన సంఘాలు, కులతత్వం, కలహాలు, అపనిందలు, క్రైస్తవ మౌలిక సంఘాలు చురుకుగా ఉన్నా ప్రజల భాగస్వామ్యం లేకపోవడం, ఇతర మత ఛాందసవాదులు సువార్తా ప్రచారకులను హింసించడం.

## 2. నూత్నీకరణకు పిలుపు

అనేక ప్రమాదాలు, సవాళ్ళున్న ఈ తరుణంలో క్రైస్తవులు జీవితాలకు నూత్నీకరణ తప్పని సరి. జగద్గురువు ఫ్రాన్సిస్ "ప్రపంచ వ్యాప్తంగా గల క్రైస్తవులందరికి... నేనొక విజ్ఞప్తి చేయదలచుకున్నాను. అదేమిటంటే మీరు మరో మారు యేసుక్రీస్తు ప్రభువును వ్యక్తిగతంగా కలుసుకొనే ప్రయత్నం చేయండి. కనీసం మిమ్మల్ని కలుసుకొని మీతో సాన్నిహిత్యాన్ని పెంచుకొనే అవకాశాన్నయినా ప్రభువుకు కల్పించండి. యేసు ప్రభువుతో మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ప్రభువుతో ఇలా చెప్పండి. 'ప్రభూ' నన్ను నేను చేజేతుల మోసాలకు గురి

చేసుకున్నాను. మోసపోయాను. లెక్కలేనన్ని మార్లు మీ ప్రేమను నేను తిరస్కరించాను. అయినా ప్రభూ మరల నేను మీతో నా ఒప్పందాన్ని నూత్నీకరించుకోవాలని ఆశపడుతున్నాను" (ఇ.జి. 3).

"సువార్తాప్రబోధం నా కల, నిజానికి సవార్తా సందేశానికి పరివర్తనా శక్తివుందని అది సర్వస్వాన్ని తనకు అనువుగా మలుచుకుంటుందని నేను నమ్ముతున్నాను. అంటే శ్రీ సభలోని ఆచార వ్యవహారాలు, కార్యనిర్వహణ విధానాలు, సమయాలు, సమయపాలన పద్ధతులు, వివిధ భాషలు, విభిన్న వ్యవస్థలు మొదలైన అన్నింటిని సువార్తా ప్రబోధానికి అనువుగా మార్చుకోవాలి. శ్రీ సభలోని ప్రతి వ్యవస్థ, ప్రతి సంస్థ సువార్తా ప్రబోధం కోసం, సువార్తా ప్రబోధమే లక్ష్యంగా పని చేయాలి తప్ప కేవలం తన (శ్రీసభ) ఉనికిని కాపాడుకోవటం కోసం పనిచేయకూడదు" (ఇ.జి. 27).

"సువార్తా ప్రబోధానికి అంకితమై మన విశ్వాస వికాస నూత్నీకరణకు పిలుపునిస్తున్నాను" అన్నారు. (ఇ.జి. 25) ఎందుకంటే 'మన అంతరంగిక జీవితం ఎప్పుడు స్వార్థపూరితమై ఉంటుందో మనం ఎప్పుడు స్వప్రయోజనాల వేటలో కూరుకొనిపోతామో అప్పుడు మన జీవితాలలో ఇతరులకు, పేదసాదలకు చోటు లేకుండా పోతుంది. దానితోపాటు మన అంతరంగం దేవుని స్వరాన్ని ఆలకించడం మానివేస్తుంది. దేవుని ప్రేమానుభవం వలన కలిగే అపూర్వానంద అనుభవం కోల్పోవడం జరుగుతుంది. మంచి పనులు చేయాలనే ఆలోచన క్రమ క్రమంగా తెరమరుగౌతుంది. (ఇ.జి. 2) అందువల ఫ్రాన్సిస్ పాపుగారు ఆధ్యాత్మిక నిరాసక్తిని, లౌకికత్వాన్ని తిరస్కరిస్తూ "ఈ దుస్థితి నుంచి బయట పడాలంటే – శ్రీ సభ నిరంతరమూ తన స్వీయ బంధానాలనుంచి విడుదల పొందుతూ ప్రస్తుతం తానున్న స్థితి నుంచి ముందుకు కదలి వెళ్తూ ఉండాలి. తన దృష్టిని పూర్తిగా ప్రభు క్రీస్తుపై కేంద్రీకరించి భక్తి శ్రద్ధలతో నిర్వర్తిస్తూండాలి. పేద ప్రజల పట్ల తనకు గల బాధ్యతకు పునరంకితం అవుతుండాలి. ఊపిరాడనీయని లౌకికతతో వ్యాధి గ్రస్తమైన శ్రీ సభను స్వస్థపరచాలంటే – అందులో పవిత్రాత్మ ప్రాణవాయువును ప్రవేశ పెట్టాలి. పవిత్రాత్మ మనలను స్వార్థపరత్వం నుంచి దేవునికి చోటులేని యాంత్రీకమైన మతాచరణం నుంచి విముక్తి చేయగలుగుతారు. (ఇ.జి. 97)

నిజమైన ఆధ్యాత్మిక జీవితం సాగించుటకు పవిత్రాత్మలో నూత్నీకరణ, మన దృక్పథంలో మార్పు, సువార్తీకరణకు అంకితమౌటం నేడు యెంతైనా అవసరం.

### 3. ఆనందమే మౌళిక అంతరంగిక దృక్పథం

ఈ అపోస్తులిక ప్రబోధం పేరే 'సువార్తానందం' కనుక అంతరంగిక ఆనందం గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. క్రీస్తు పుట్టుక సమయంలో దేవదూత గొల్లలతో "సమస్త ప్రజలకు పరమానందము కలిగించు శుభ సమాచారమును మీకు వినిపించెదను" అని చెప్పినట్లుగా సువార్త ఒక ఆనంద శుభ సమాచారం (లూకా 2:10) సువార్తాంశాన్ని ఒక సిద్ధాంతంగా మాత్రమే చూడకూడదు. దానిని 'ఆనంద' శుభ సమాచారంగా చూడాలి. ఎందుకంటే మన అంతరంగిక ప్రధాన దృక్పథానికి, సువార్తా ప్రబోధసారానికి సువార్తానందం తోడ్పడుతుంది (ఇ.జి. 4) సువార్తీకరణ అనగా ప్రకటించటం కంటే జీవించటం ప్రధానం. దేవుని అనుగ్రహంతో సువార్తను ఆశించడం, ఆచరించటము, ఆ తరువాత ప్రకటించటం జరగాలి. దీని ఫలితమే ఆనందం ఫ్రాన్సిస్ జగద్గురువులు "యేసు ప్రభువును తెలుసుకున్న వారి హృదయాలు, ఆయనను కలుసుకున్న వారి జీవితాలు సువార్తానందంతో పొంగిపొరలుతూ ఉంటాయి. యేసు ప్రభువు ప్రసాదించే రక్షణ వరాన్ని స్వీకరించిన వారు పాపం నుంచి, దు:ఖ భారం నుంచి అంతరంగిక శూన్యం నుంచి, ఏకాకితనం నుంచి విముక్తులవుతారు. ప్రభువు తోడుగా ఉంటే ఆత్మానందం ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది." అంటారు. (ఇ.జి. 1) దేవుడు ప్రేమించే మన అంతరంగం నుంచి ఆ ఆనందం ఎప్పుడూ జాలువారుతుంటుంది. మన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎక్కువ శాతం అల్పవర్గానికి, పేదవర్గానికి చెందినవారైనప్పటికి, నిరాశనిస్పృహలకు లోనుకాకుండా, క్రీస్తు తెలుసుకున్నామన్న ఆనందంతో ప్రజ్వరిల్లుతూ ఉండాలి. క్రీస్తు సిలువ తేజంతో ప్రకాశించే పవిత్ర గ్రంథం అడుగడుగున మనలను ఆనందంగా జీవించమని ఆహ్వానిస్తుంది. కాని కొంతమంది క్రైస్తవుల జీవితాలను చూస్తే అవి ఈస్టరులేని తపస్కాలాలుగా ఎప్పుడు విచారగ్రస్తమై ఉంటాయి. (ఇ.జి. 5) లేదా అప్పుడే భూస్థాపిత కార్యం నుండి వచ్చిన సువార్తీకులుగా ఉంటారు. (ఇ.జి. 80) మనము ఉత్థాన క్రైస్తవులం. పునరుత్థాన క్రీస్తు ఎల్లప్పుడు

మనలోనే ఉంటాడు (మత్తయి 28:16) యేసు ప్రభువు తోడుగా ఉంటే జీవితంలో ఎదురయ్యే ప్రతీది అర్థవంతమవుతుంది. జీవితంలో జరిగే ప్రతి సంఘటనలో గల అర్థపరమార్థాలను గ్రహించగలుగుతాం. (ఇ.జి.246) దేవుడు మనలను ప్రేమిస్తున్నాడని, క్రీస్తు మనలో ఉన్నాడన్న అవగాహనతో ఆనందాన్ని దూరం చేసుకోరాదు.

## 4. ప్రార్థనా జీవితం

"మనం యేసు ప్రభువుతో ఏకమై ఉన్నప్పుడు ప్రభువు దేనిని కోరుకుంటాడో దానినే మనము కోరుకుంటాము. ప్రభువు దేనిని ప్రేమిస్తాడో దానినే మనము ప్రేమిస్తాము" (ఇ.జి.267) యేసు ప్రభులా ఉండటం, చూడటం, నడవటం, క్రైస్తవ ఆధ్యాత్మికత యొక్క ప్రత్యేకత. నిజమైన ఆధ్యాత్మికతకు పునాదులు వేయుటకు అనగా విశ్వాసులలో క్రీస్తు రూపాన్ని ఏర్పరచటానికి పునీత పౌలు విశిష్ట కృషి చేశారు. "నా బిడ్డలారా మీయందు క్రీస్తు రూపము ఏర్పడు వరకు, స్త్రీ ప్రసవ వేదన వలె నేను మరల మిమ్ము గురించి బాధపడుచున్నాను" (గలతీ 4:19) క్రీస్తు యేసు నందు గల ఈ మనస్తత్వమును మీ యందు ఉండనిందు" (ఫిలిప్పీ2:5).

ఈ రోజు మనకు కావాలసినది అతిగా పనిచేసే వారు కాదు. కాని క్రీస్తును తమ గమ్యస్థానంగా పరిగణించే వారు కావాలి. ఈ ఆలోచన లేనిచో మన సువార్తా ప్రబోధము ఉన్నత, లోతైన ఆధ్యాత్మికత లేని జీవితమవుతుంది.

## 4. ఎ. వ్యక్తిగత ప్రార్థనా జీవితం

వ్యక్తిగత ప్రార్థనకు యేసుక్రీస్తు గొప్ప ఉదహరణ. ఉదయం, సాయం సమయాలలో క్రీస్తు ప్రభువు కొండపైకి వెళ్ళి తన తండ్రిలో లీనమైపోయేవాడు, (మార్కు 1:35) "ప్రార్థన వ్యక్తిగతంగాగానీ, సమిష్టిగా గానీ చేయతలపెట్టిన మంచి పనులను సమర్థవంతంగా కొనసాగించడానికి అవసరమైన... అంతర్గత శక్తిని, అవసరమైన ప్రేరణను బలాన్నిస్తుంది, చేసే పనులను అర్థవంతం, ఫలప్రదంగా చేయిస్తుంది." (ఇ.జి.261) ఇలా మన వ్యక్తిగత ప్రార్థనే మనలను ముందుకు నడిపిస్తుంది.

ప్రార్థన ద్వారా క్రీస్తులో మమేకమైనప్పుడే సువార్తా ప్రబోధంలో అలసిసొలసిన వారికి ఊరట లభిస్తుంది. "భారముచే అలసిసొలసియున్న సమస్త జనులారా నా యొద్దకు రండు, నేను మీకు విశ్రాంతి నొసగెదను" (మత్తయి 11:28).

ఒకప్పుడు చర్చికి ఎల్లప్పుడూ వచ్చే తెలుగు క్రైస్తవులు నేడు అప్పుడప్పుడు చర్చికి రావడం, వివిధ క్రైస్తవ సంఘాలలో చేరిపోవడం జరుగుతుంది. వ్యక్తిగత ప్రార్థన ద్వారా దేవునితో సంభాషించినప్పుడే వారి విశ్వాసం బలపడి, వారి పరిస్థితిలో మార్పుతెస్తుంది. ఆధ్యాత్మిక శూన్యత, లౌకికతత్వంతో కష్టాలు పడే వారికి "నేను సాధుశీలుడననియు, వినమ్ర హృదయుడననియు మీరు నా నుండి నేర్చుకొనండి" అని క్రీస్తు బోధిస్తున్నారు (మత్తయి 11:29) ఐక్యతకు, శాంతికి, అడ్డంకులుగా ఉన్న కుల, ప్రాంతీయ బేధాలను తొలగించి, క్రీస్తు ప్రభులోని వినమ్రత, దీనత గుణాలు మనలను శాంతి, ఐక్యతల వైపు నడిపిస్తాయి.

## 4. బి. వ్యక్తిగత ప్రార్థనా జీవితం

ప్రతి దినం బైబిలు పఠించటం చాల ముఖ్యం. ప్రజలలో నూత్నీకరణను తెచ్చేది బైబిలు పారాయణమే. దేవుని వాక్కు రెండంచుల ఖడ్గంలాంటిది. జీవాత్మాల సంయోగ స్థానము వరకును, కీళ్ళు, మజ్జ కలియు వరకును ఛేదించుకొనిపోగలదు" (హెబ్రీ 4:12) దేవుని వాక్కు మనిషిలో మార్పును తెస్తుంది. దైవ వాక్కుపై ప్రేమ కలిగి ఉండాలని ఫ్రాన్సిస్ పాపుగారు మనలందరిని ఆహ్వానిస్తున్నారు. ఎందుకుంటే దేవుని వాక్కు శక్తివంతమైనది. యేసు క్రీస్తు శిష్యులు ఈ నిజాన్ని తెలుసుకొని, ప్రభూ! మేమెవరి వద్దకు వెళ్ళాలి. నిత్య జీవపు మాటలు గలవాడవు నీవే" అని అన్నారు (యోహాను 6:68) సువార్తా ప్రబోధం చేసే వారికి తప్పనిసరిగా పవిత్ర గ్రంథ పరిజ్ఞానం అవసరం. కనుక – ప్రతి పీఠంలోను ప్రతి విచారణలోను, ప్రతి కతోలిక సంఘంలోను పవిత్ర గ్రంథాన్ని భక్తి శ్రద్ధలతో పఠించి, ధ్యానించే అవకాశాలు కల్పించాలి. (ఇ.జి. 175) తెలుగు క్రైస్తవులు ప్రార్థన పుస్తకాల నుండి ప్రార్థనలు చదివి మేము ప్రార్థించాము అని తృప్తి పడే అవాటుంది. దైవ వాక్కు ప్రాముఖ్యతను వారు ఇంకనూ గుర్తించవలసియుంది. తమ దైనందిన జీవితంలో దైవ వాక్కును పఠించి, ధ్యానించి, అనుసరించే మార్గాన్ని వారికి నేర్పవలసియున్నది.

అప్పుడే వారి జీవితాలు ఫలిస్తాయి. "దప్పిక గొనువాడు నా యొద్దకు వచ్చి తన దప్పిక తీర్చుకొనును గాక! లేఖనములో చెప్పబడినట్లు నన్ను విశ్వసించువాని అంతరంగము నుండి జీవజలనదులు ప్రవహించును" అని క్రీస్తు ఆహ్వానిస్తున్నారు. (యోహాను 7:37-38) జీవజలము వైపు విశ్వాసుల దృష్టిని మరల్చినప్పుడే నిజమైన సువార్తా బోధకులవుతారు.

### 4. సి. దివ్య సంస్కారాలు

దివ్య సంస్కారాలు దేవుని అనుగ్రహాన్ని ఇవ్వడమే కాకుండా, ఆ అనుగ్రహాన్ని సరియైన స్థితిలో పొందే అవకాశాన్ని సరియైన విధముగా దేవుని ఆరాధించటం, సహాయ గుణాన్ని అలవరుచుకోవటానికి సంస్కారాలు నిర్వహణ తోడ్పడుతుంది. అన్ని సంస్కారాలలో దివ్య సత్ప్రసాదము క్రైస్తవ జీవితానికి ప్రధానమైనది, ప్రాధాన్యతను ఇస్తుందని, రెండవ వాటికన్ మహాసభ తెలియజేసింది. ఈ దివ్యసత్ప్రసాదము కష్టాలకడలిలో ఉన్న పేదల చెంతకు మనలను నడిపిస్తుంది. క్రీస్తు ఒసగిన ఈ బహుమానం సువార్తీకరణకు మనము పొందిన పిలుపును గ్రహించునట్లు చేసి, మనం ఇతరులకు ఆశీర్వాదకరంగా మార్చి ప్రజలను ఉత్తేజపరులై, స్వస్థతలు పొందుచు, రక్షింపబడిన వారిగా జీవించుటకు కృషి చేయునట్లు చేస్తుంది. తెలుగు కతోలికులకు తరుచుగా దివ్యసంస్కారాలు స్వీకరించడం నేర్పించాలి. ఆదివార పూజలో పాల్గొంటే చాలని చాలమంది నేటి కతోలికులు తలంచుచున్నారు. వీరిలో కొంత మంది పూజకు ప్రార్థనా సదస్సులకు మధ్య ఉన్న తేడాను గుర్తించలేకపోతున్నారు. ఈ రోజుల్లో అత్యంత అనాదరణకు గురియైన సంస్కారం పాపసంకీర్తనం. దివ్యబలిపూజలో పాల్గొని దివ్యసత్ప్రసాదం స్వీకరిస్తారు గాని పాప సంకీర్తనం చేయాలన్న ధ్యాసను కలిగి ఉండరు. ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణాలలో సరిపడినంత దైవ పిలుపులున్నాయి. విచారణలలో గురువులు దివ్య సంస్కారాలు నిర్వహించడానికి అందుబాటులో ఉన్నారు. వారు ఆత్మతో ప్రేరేపింపబడిన సువార్తీకుల వలె తమ ప్రసంగాలకు సిద్ధపడి, బోధించాలి. (ఇ.జి. 106-110).

### 4. డి. ప్రజాదరణ పొందిన భక్తి కృత్యాలు

దివ్యబలి పూజలో పాల్గొనినంత మాత్రాన సరిపోదు మిగతా భక్తికృత్యాలలో కూడా పాలుపంచుకోవాలని రెండవ వాటికన్ సభ తెలియజేసింది.

"సదా ప్రార్థింపుడు" అని పునీత పౌలు తెలియజేశాడు (1 తెస్స 5:17). ఇలా ప్రార్థించాలంటే మిగతా భక్తి ప్రార్థనలు సహాయ పడతాయి. అవి ఏమనగా, పవిత్రయాత్రలు, నొవీన ప్రార్థనలు, ప్రదక్షిణలు, మాత భక్తి పండుగలు, పునీతుల పండుగలు జపమాల, త్రికాల - జపము, సిలువ మార్గము, మొదలగునవి. విశ్వాసులు సజీవక్రీస్తును కలుసుకొనే మార్గాలుగా ఈ భక్తి కృత్యాలు ఉపయోగపడుతాయని రెండవ జాన్‌పౌలు పాపుగారు ప్రకటించారు.

"ఈ సామాన్యజన భక్తకృత్యాలన్నీ సమాజంలోని అట్టడుగు ప్రజల సంస్కృతిలో ఆకృతిదాల్చిన ఆధ్యాత్మికతలో అంతర్భాగాలే. ఈ సామాన్యజన ఆధ్యాత్మికతకు సైతం సైద్ధాంతిక భూమికవంటి నిగూఢ సత్యాలుంటాయి. ఇవి తార్కిక చర్చల ద్వారా కంటే, సంజ్ఞలు, సంకేతాలు, ద్వారా వ్యక్తం చేయబడతాయి. ఈ సామాన్య జన భక్తి మార్గం "విశ్వాసాన్ని వ్యక్తం చేసే న్యాయబద్ధమైన జీవన విధానం, శ్రీసభలో అంతర్భాగంగా వర్ధిల్లే విధానం, సామాన్య ప్రజలు సువార్తా బోధకులుగా, సువార్తా విలువలకు సాక్షులుగా జీవించే విధానం" ఇలా సాటి విశ్వాసులతో కలసి తీర్థయాత్రలకు వెళ్లటం పుణ్యక్షేత్రాలను సందర్శించడం, ఇతర భక్తికృత్యాలలో చిత్తశుద్ధితో పాల్గొనడం, పిల్ల పాపలతో కలిసి, ఇరుగుపొరుగు వారితో కలిసి భక్తికృత్యాలు ఆచరించటం - ఇవన్నీ సువార్తా ప్రబోధంలో అంతర్భాగమే అవుతాయి అని పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు తెలియజేస్తున్నారు." (ఇ.జి. 124) ఆంధ్ర, తెలంగాణలలో అనేక సామాన్య జన భక్తి కృత్యాలున్నాయి. బాలయేసు, తిరుహృదయం, మరియమాత, పునీత అంతోని, పునీత యూదాకు సంబందించిన భక్తి కృత్యాలు చాలా చోట్ల ఆచరణలో ఉన్నాయి. పండుగ సమయాలలో అనేక మందిని ఆకర్షించే తీర్థయాత్ర స్థలాలున్నాయి. వీటి వలన విశ్వాసులు క్రీస్తును మరింత తెలుసుకుంటారు. కనుక వీటిని మరింతగా ప్రచారం చేయాలి. వీటి వలన విశ్వాసం కూడా దృఢపడుతుంది. కనుక ఇలాంటి సువార్తా ప్రబోధక శక్తిగల సామాన్య జన భక్తికృత్యాలకు మనం ఎలాంటి ఆటంకాలు కలుగజేయరాదు. నియంత్రణ పేరుతో అవరోధాలు కల్పించే ప్రయత్నం చేయతగదు (ఇ.జి. 124).

మనం దీర్ఘకాల దివ్యసత్ప్రసాద ఆరాధనలో గడపలేకపోయినా, దైవ వాక్కును ప్రార్థనా పూర్వకంగా పఠించి ధ్యానించడంలో ఉదాసీనంగా

వ్యవహరించినా, ప్రభువుతో మనస్సు విప్పి మాట్లాడక పోయినా మనంచేసే సువార్తా పరిచర్య నిరర్థకమవుతుంది (ఇ.జి. 262) కనుక మన సువార్తా ప్రబోధనకు ఉత్సాహాన్నిచ్చే మన వ్యక్తి గత ప్రార్థన జీవితం ఎంతో అవసరం.

## 5. కార్యరూప ఆధ్యాత్మికత

అంతరంగిక ఆధ్యాత్మిక జీవితం సువార్త ప్రబోధం కొరకేనని సువార్తానందం స్పష్టంగా తెలుపుతుంది. జగద్గురువు గారి మాటల్లో ఈ సువార్తా ప్రబోధం అనేది క్రొత్తదేమి కాదు. లేదా అనుకోకుండా ఉద్భవించిందికాదు. కాని ఆధ్యాత్మికతకు ఈ సువార్తా ప్రబోధం గమ్యం లాంటింది. "ఈ లోకంలో నేనొక సేవాధర్మాన్ని, మూర్తీభవించిన సేవాధర్మాన్ని; ఆసేవా ధర్మ నిర్వహణ కోసమే సేవా ప్రపంచంలో ఉన్నాను" (ఇ.జి. 273) నేను, నా సువార్తా ప్రబోధం రెండు వేరు కాదు. ఏక కాలంలో మనం యేసు ప్రభువు పట్ల, ప్రజలపట్ల ప్రగాఢమైన ప్రేమ భావం కలిగి ఉన్నపుడే యథార్థమైన సవార్తా బోధకులం కాగలుగుతాం (ఇ.జి. 268).

మనుష్యావతారుడైన దైవకుమారిని పట్ల మనకున్న విశ్వాసం యథార్థమైనదే అయితే, ధృఢమైనదే అయితే – మనమూ ప్రభువులా స్వసుఖానికి, స్వప్రయోజనాలకు అతీతంగా ప్రవర్తించగలుగుతాం, సంఘంలో బాధ్యత గల సభ్యులుగా మెలగుతూ, సాటివారికి చిత్తశుద్ధితో సేవలు చేయగలుగుతాం. తోటి వారితో ఎప్పటికప్పుడు సఖ్యపడుతూ సామరస్యంగా జీవించగలుగుతాం (ఇ.జి. 88) మనలను ప్రజలకు సన్నిహితులను చేసే ఈ సువార్తా ప్రబోధం విధానానికి అత్యుత్తమ మాతృక ప్రభుయేసు బోధనా విధానమే. "తాను భాగ్యవంతుడై ఉండి కూడా, తన పేదరికము వలన మనలను భాగ్యవంతులను చేయుటకు ఆయన నిరుపేద అయ్యెను" (2 కొరింతీ 8:9).

## 5. ఎ. సువార్తా ప్రచారము – సాక్ష్యము

"మనం పొందిన యేసు ప్రేమానుభవమే మనం సువార్తా ప్రబోధం చేయడానికి ప్రధాన కారణం" (ఇ.జి. 264) ప్రతి క్రైస్తవుడు, ప్రతి సంఘం క్రీస్తు చూపిన మార్గాన్ని గుర్తించాలి. 'ముందుకు వెళ్ళండి' అని ప్రభువు యిచ్చిన పిలుపును

విధేయించి, (ఇ.జి.24) తమ "భద్రతా ప్రాంగాణలను వదిలి వెళ్ళి, సువార్తా కాంతులు ప్రసరించవలసిన ప్రతి చోట సువార్తా ప్రబోధం చేయాలి (ఇ.జి.20) ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో యింకా అనేక మంది సువార్తను తెలుసుకోవలసిన వారున్నారు. ఈ విషయంలో మన మందరం సువార్తా ప్రబోధంలో నడుం బిగించి ముందుకు సాగాలి.

భారతదేశంలో, ఆంధ్ర, తెలంగాణలలో పెరుగుతున్న మత అసహనం వలన దైవవాక్కును ప్రకటించడం కష్టతరమౌతుంది. మత మార్పిడి వ్యతిరేక చట్టాలు, సువార్తా ప్రచారకులపై దాడులు పెరిగిపోతున్నాయి. ఉపకారం పొందినవారే అపకారం తలపెట్టి మనల్ని బాధించినపుడు – సిలువ పై వ్రేలాడే యేసుప్రభువును చూచి శ్రమలను ఓర్పుతో భరించటం నేర్చుకోవాలి. శ్రమలకు వెరచి సాటివారితో సౌహార్థ సంబంధాలను ఏర్పరచుకోవడానికి, వారితో శాంతియుత సహజీవనం గడపడానికి వెనుకంజవేయకూడదు (ఇ.జి.91) ఇతరుల దృష్టిలో పేరుకు మాత్రం క్రైస్తవులమని, సువార్తాకు తగినట్లుగా మన జీవితాలు లేవు అందువలన చాలా మంది ఇతర మతస్థులకు శ్రీసభలో ప్రత్యేకత ఏమి కనిపించడం లేదు.

శ్రీసభ పరిపాలన, సంస్థలు మాత్రం వారికి కనబడుతున్నాయి. మంచి విద్య, సమాజ సేవ మినహా వారికి ఉన్న ఆధ్యాత్మిక విలువలకంటే మినహా శ్రీసభలో వారికి మరియేమి కనిపించడం లేదు. మనలో నైపుణ్యత తప్ప సువార్తా విలువలు కానరావటం లేదని యితరులు భావిస్తున్నారు. కనుక ఆంధ్ర, తెలంగాణ శ్రీసభ సువార్తా విలువలు కానరావటం లేదని యితరులు భావిస్తున్నారు. కనుక ఆంధ్ర, తెలంగాణ శ్రీ సభ సువార్తా విలువలకు సాక్ష్యంగా నిలబడి సువార్త వైపు ఇతరులను ఆకర్షించాలి (ఇ.జి.12) అనగా సువార్తా ప్రచారం కష్టంగా ఉన్న ఈ తరుణంలో జీవిత సాక్ష్యం ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. పరిశుద్ధి రెండవ జాన్‌పాల్ గారి మాటల్లో "నేడు నిజమైన క్రైస్తవ జీవన సాక్ష్యం అవసరత ఎంతో ఉన్నది. ఎందుకంటే నేడు ప్రజలు, బోధన కన్నా సాక్ష్యం వైపు, బోధనకన్నా అనుభవం వైపు, తత్వం కన్న జీవితము, ఆచరణ వైపు మొగ్గుచూపుతున్నారు. క్రీస్తును అనుసరించుచు పేదలతో మమేకమై, మనం సాధారణ జీవన విధానంతో

మొక్కవోని విశ్వాసంతో అందరి పట్ల, నిష్కపటమైన ప్రేమ, ముఖ్యంగా పేదలపట్ల ప్రేమ గల్గి ఉండటం లాంటి సాక్షీభూతమైన జీవితాలు ప్రకాశవంతమైన సువార్త సంజ్ఞలుగా నిలుస్తాయి.

### 5. బి. అవసరంలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రేమతో ముందుకు సాగాలి.

మనుష్యావతారుడైన దైవకుమారుడు వలె మనం కరుణ గలిగి దయామయులుగా జీవించాలి (ఇ.జి. 88) "యేసు ప్రభువు - మానవ దు:ఖాన్ని చేరువగా చూడమంటున్నారు. శోకతప్తమైన జీవితాలను కరుణతో స్పృశించమంటున్నారు" (ఇ.జి. 270) "నిజానికి - సాటి వారి సంక్షేమంలోను, సాటి వారి ఆనందంలోనే తమ ఆనందాన్ని వెదుకుకొనేవారు - యథార్థమైన సువార్తా బోధకులు కాగలుగుతారు". (ఇ.జి. 272) సువార్తా ఎవరికైతే బోధింపబడినదో వారిని ఆదరించినప్పుడే సువార్తీకరణ అవుతుంది. వారి హృదయంలో ఉన్న ఆనందాన్ని, నమ్మకాలను, కష్టాలను పంచుకోవాలి. "దేవుని ప్రేమించు, నీ పొరుగు వారిని ప్రేమించు" అని క్రీస్తు ప్రభువు ప్రవక్తల ప్రబోధాలన్నింటిని ఈ ఒక్క మాటలో చెప్పారు. (మత్తయి 22:40) రెండవ వాటికన్ మహా సభ ప్రకారం "ప్రతి క్రైస్తవుడు తనకున్న సామర్థ్యాలతో, దేవుడిచ్చిన వరాలతో బాద్యతతో విశ్వాస జీవితంలో ముందుకు సాగుతున్నప్పుడు నమ్మకాన్ని నింపుతూ ప్రేమతో పనులను చేసుకో కలుగుతాడు. ప్రేమ పవిత్రకు దారి" పేదల, అవసరంలో ఉన్న వాళ్ళ, రోగగ్రస్తుల, వృద్ధుల, అనాథల సేవలోనే క్రైస్తవ పరిపూర్ణత కలిగి ఉంటుంది (ఇ.జి. 179).

తెలుగు శ్రీసభ, పేదల కొరకు శ్రీసభగా గుర్తింపు పొందింది. సమాజ సేవా కేంద్రాల ద్వారా, విద్య వైద్య సేవల ద్వారా ఇక్కడి శ్రీసభలో ఎంతో సహాయాన్ని అందిస్తున్నది. కాని క్రైస్తవులెప్పుడు సహాయం పొందేవారేగాకుండా, తమకున్న దానిలో యితరులకు పంచుకోవడం కూడా అవసరమని తెలుసుకోవలసిన సమయం అసన్నమైనది. ప్రస్తుతం మన ప్రాంతంలో ఉన్న కథోలికులు అధిక శాతం పేదవారైనప్పటికిని, వాటి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారి పట్ల కరుణ, దయను చూపించాలి. రోగస్తులను, ఆకలి ఉన్న వారికి ఆహారమివ్వడం,

గూడు, గుడ్డ లేని వారికి సహాయం చేయడం లాంటివి చేయాలి. పేదలకు సేవ చేస్తున్న వారికి సహాయ సహకారం అందించాలి. నిజానికి సువార్తా ప్రబోధకులు (సువార్తా బోధక సంఘం) తమ మాటల ద్వారా చేతల ద్వారా ప్రజలతో సన్నిహిత సంబంధాలను ఏర్పారచుకుంటారు, వారి దైనందిన జీవనంలో తామూ ఒకరవుతారు, వారి కష్టసుఖాలను కలసి పంచుకుంటారు. తద్వారా ప్రజలకూ తమకూ మధ్యగల అంతరాలకు సుహృద్భావ సంబంధాలనే వంతెనలతో తరిస్తారు, ఈ ప్రయత్నంలో అనేకానేక అవమానాలను భరించడానికి, తమను తాము చిన్న బుచ్చుకోవడానికి తలదించుకోడానికీ కూడ సిద్ధపడతారు. సువార్తా బోధకులు - బాధిత ప్రజలను ఆదరించి సేవించడం ద్వారా - వారిలో ప్రత్యక్షమయ్యే బాధామయ సేవకుని (క్రీస్తు ప్రభువును) ఆలింగనం చేసుకుంటారు (ఇ.జి. 24).

## 5. సి. మానవ నిర్మిత హద్దులకు అతీతమైన ఐక్యతాసహజీవనం

సహాజీవన ఆధ్యాత్మికత అనేది నిజమైన కతోలిక ఆధ్యాత్మికత. త్రియేక దేవుని సహజీవనంలో ఈ ఆధ్యాత్మికత నాందిని పొందుతుంది. సృష్టితో, అందరితో సహాజీవనానికి కతోలిక ఆధ్యాత్మికత పిలుపునిస్తుంది. క్రైస్తవ జీవన విలువల ప్రకారం - మనం అన్ని రకాల సంశయాలను అధికగమించాలి. ప్రతి వారినీ అనుమానించే అలవాట్లను వదలి పెట్టాలి. ఇతరులతో కలిసి మెలిసి ఉంటే మనకు వ్యక్తిగత జీవితం లేకుండా పోతుందేమోనని భయపడటం మానుకోవాలి. అలాగే సమకాలీన ప్రపంచ ప్రభావంతో - మనం చేసే తప్పులను కూడ మనం సమర్థించుకోనే ధోరణులను వదలుకోవాలి (ఇ.జి. 88) ఇలాంటి సహజీవన ఆధ్యాత్మికత ప్రేమతో శ్రీసభలో కలిసిమెలసి జీవించే స్ఫూర్తిని ఇస్తుంది, క్రైస్తవ సమైక్యతకు అంకిత భావాన్ని, ప్రపంచం పట్ల సహృదయభావాన్ని, ఇతర మతాల మంచి మనసు గల వారితో సానుకూలత, మానవ హక్కులు, సామాజిక న్యాయం పట్ల, సృష్టిని, పర్యావరణాన్ని పరిరక్షించడం వైపు దారి చూపుతుంది.

ఆంధ్ర, తెలంగాణ శ్రీసభలో ఐక్యతకు స్ఫూర్తికి తరుణం ఆసన్నమైనది. సువార్తనందంలో "పవిత్రకరణ పొందిన కొందరు వ్యక్తులు - వారు తమ చుట్టూ ఉన్న సంఘంలో చిలవలు పలవలుగా విస్తరిస్తోన్న దుష్టత్వాన్ని చూస్తూ కూడ, నిమ్మకునీరెత్తినట్లు ఊరకుండిపోతున్నారు. తమ చుట్టూ ఉన్న ప్రజల మధ్య

శత్రుత్వాలు పెరుగుతున్నా, ఎవరికి వారుగా విడిపోతున్నా, దుష్ప్రచారాలతో ఒకరినొకరు కించపరచుకుంటున్నా, పరస్పరం నిందారోపణలు చేసుకుంటున్నా, కక్షకార్పణ్యాలు పెంచుకుంటున్నా, అసూయగ్రస్తులవుతున్నా, తమ ఆలోచనలను, ఆశయాలను ఇతరులపై బలవంతానరుద్ద ప్రయత్నం చేస్తున్నా, చివరికి తమతో ఏకీభవించని వారిని చిత్రహింసల పాలు చేస్తున్నా – మన క్రైస్తవ సంఘాలవారు, క్రైస్తవ పరిచారకులు నిస్సహాయంగా చూస్తూ ఉండి పోతున్నారు" అని జగద్గురువు ఫ్రాన్సిస్ గారు వ్యక్తం చేస్తున్నారు (ఇ.జి.100)

మనం సోదరప్రేమ గలవారమైతే – సాటి వారిలో పొరుగు వారిలో ఉన్న పవిత్రతను, ఘనతను గుర్తించగలగాలి. ప్రతి మనిషిలో దేవుని రూపాన్ని దర్శించగలగాలి (ఇ.జి.92) యావత్ శ్రీసభ మంచికి అంకితమై, ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ, అందరికి స్థానం కల్పిస్తూ సాగిపోవాలి (ఇ.జి.236).

ఇతర క్రైస్తవ సంఘాలతో ఐక్యత, సహజీవనం, నేటి భిన్నత్వంలో ఏకత్వానికి సుహృద్భావ చర్చలే మార్గాలు. ఒకరినొకరు విశ్వసించడం ద్వారానే అది సాధించగలుగుతాం. విభిన్నమైన క్రైస్తవ సంఘాలకు చెందిన క్రైస్తవులు – ఎదుటి వారిలో పవిత్రాత్మ ప్రభువు వెదజల్లిన కృపావర బీజాలను గుర్తించటం ఆత్మవరాలను పరస్పరం పంచుకోవడం ద్వారా ఇరుపక్షాల క్రైస్తవుల మధ్య ఏకతాబంధాన్ని ఏర్పరస్తుంది, బలపరస్తుంది (ఇ.జి.246) "అందువలన ఒకరినొకరు తమ వారిని దొంగలిస్తున్నారని నిందించుకోకుండా మన మధ్య ఉన్న సిద్ధాంత పరమైన సమాన భావాలను బయటకి తీసి కలిసి మెలసి సహజీవనం చేసే అవకాశాన్ని తెచ్చుకొని ఒకరినొకరు గౌరవించుకొనుచూ జీవించాలి. బహుమత భారతేదశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలలో వివిధ మతాల మధ్య నీతి నిజాయితీతో కూడిన చర్చలు ఎంతో అవసరం. ఇలాంటి చర్చలే శాంతికి దోహదరపడతాయి. ఇది కతోలికుల, యితర క్రైస్తవుల బాధ్యత" అని ఫ్రాన్సిన్ పాపుగారు గుర్తిస్తున్నారు (ఇ.జి250) ఒకరినొకరు ప్రతిఘటించుకోకుండా, సహృద్భావముతో చర్చల పరిచర్యను సాగించుకోవాలి (ఇ.జి.251).

## 5. డి. శాంతి సమాధానాలు

క్రైస్తవ మతం ప్రధానంగా శాంతి మతం, యేసు నామం, శాంతికి తార్కాణం. (కురియకోస్ 349) యేసు ఈ లోకం వీడిపోతూ తన శిష్యులకిచ్చిన బహుమతి శాంతి, "శాంతిని మీకు అనుగ్రహించుచున్నాను. నా శాంతిని మీకు ఇచ్చుచున్నాను" (యోహాను 14:27). జగద్గురువు ఫ్రాన్సిస్ గారు, శాంతిని స్థాపించే బాధ్యతను నిపుణులకే ఇవ్వకుండా అందరికి ఆ బాధ్యతను ఇస్తున్నారు. జ్ఞానస్నానం పొందిన ప్రతి వ్యక్తి శాంతి స్థాపకుడు కావాలని ఆయన కోరుకున్నాడు. అంతేగాకుండా మారుమనసు పొందిన వ్యక్తిగా రూపొందాలని పిలుపునిస్తున్నారు. "ప్రశాంతతను, పవిత్రను కాపాడుకుంటూ, పేద ప్రజలకు చెందవలసిన సంపదను వారికి పంచుతూ శ్రీసభ నిజమైన శాంతిని నెలకొల్పే పనిని చేపట్టాలి." (ఇ.జి. 219) నిజమైన శాంతిని దేవుడొక్కడే ఇవ్వగలుగుతాడన్న నిజాన్ని తెలుసుకోవాలి. (ఇ.జి. 219) ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణలలో శ్రీసభ అప్పుడప్పుడు శాంతి కొరకు ప్రార్ధనలు, ప్రదక్షిణలు చేపడుతుంది. ఇవి మాత్రమే సరిపోవు. జ్ఞాన స్నానం పొందిన ప్రతి క్రైస్తవుడు, కుటుంబం, ఊరు పరిస్థితులలో స్వార్థం, బృంద ప్రయోజనాలు, కుల భేదాలను విడిచిపెట్టి శాంతి సమాధానాల కోసం ఆశించాలి. అందరు దేవుని బిడ్డలే అని భావిస్తూ విశ్వాసానికి సాక్షులుగా జీవించాలి.

## 6. మరియమాత శైలిలో సువార్తీకరణ

సువార్తానందంలో శ్రీసభ చేసే సువార్త ప్రచారంలో మరియమాత 'శైలి' కనిపిస్తుంది. మరియమాత సహాయముతో విశ్వాసులు అనుగ్రహ జీవితములో వృద్ధి చెందుతారు. ఉనికి ప్రజల మధ్య ఎప్పటికీ నెలకొనే ఉంటుంది. ఆనాడు పవిత్రాత్మ కొరకు ప్రార్థించే సందర్భంలో కూడా మరియమాత ప్రభు శిష్యులు మధ్యనే ఉన్నారు. (అ.కా. 1:14) పెంతేకోస్తు నాడు శిష్యులు పవిత్రాత్మను పొందడానికి, వారు తొలి సువార్తా ప్రచారం చేయడానికి మరియమాత సహకరించారు. ఆమె లేకుండా నవ్య సువార్తీకరణను మనము నిజముగా అర్థము చేసుకోలేము. (ఇ.జి. 284). సువార్తా ప్రచారంలో మనం అనేక సార్లు నిరుత్సాహానికి గురవుతాం. చీకటిలో దారి తప్పుతున్న అనుభూతినీ పొందుతాం. ఒక్కోసారి అలసట, నిస్సత్తువ మనల్ని ఆవరిస్తాయి. యేసుప్రభు నజరేతులో గడిపిన

బాల్యదశలో మరియమాత కూడా ఇలాంటి ఆధ్యాత్మిక సంక్షోభాన్నే చవిచూశారు. ఇవన్నింటిని మౌనంగా భరించి ప్రార్థనలో దేవునికి అర్పించారు. క్రైస్తవులంతా మరియమాతలా మన కష్టాలను, అర్థంకాని సమస్యలను, బాధలను, సవాళ్ళను ప్రార్థనాపూర్వక ఆలోచనల ద్వారా ఎదుర్కొని నిలబడగలగాలి.

రెండవదిగా, కానాపల్లెలో మరియమాత చూపిన ప్రేమ, కరుణ, అణుకువ వంటి సుగుణాలను అలవరుచుకొని వాటిని సువార్తా ప్రచారంలో అభివ్యక్తం చేయాలి. వాటకనుగుణంగా జీవించగలగాలి. ఇలాంటి సుగుణాలున్నవారు తమను తాము గొప్పవారుగా చెప్పుకోవటానికి సాటివారిని ఎంత మాత్రం చిన్నచూపు చూడరు. అవసరంలో ఉన్న వారిని కూడా మన మందలోని వారిగా గ్రహించి, వారి ముఖంలో యేసుని చూడగలగాలి వారి స్వరాల్లో, వారి ఆర్తనాదంలో యేసుని వినగలగాలి (ఇ.జి. 99).

మూడవదిగా, మరియమాత విప్లవాత్మక గీతం దేవునిపై నమ్మకం, నీతిమంతుడైన దేవున్ని చూపిస్తుంది. "అధిపతులను ఆసనముల నుండి పడేవసి, దీనులను లేవనెత్తెను, ఆలకిగొన్నవారిని సంతృప్తి పరచి, ధనవంతులను వట్టి చేతులతో పంపివేసెను" (లూకా 2:53-54) ఈ విషయం మనం న్యాయం కొరకు నిలుచుటకు ఒక శక్తిగాను, ప్రోత్సాహకరంగాను ఆమె ఉంది.

**ముగింపు**

సవార్తానందం సువార్తీకులందరికీ సమతుల్యతను అందిస్తుందని సుస్పష్టంగా చెప్పవచ్చు. ప్రార్థన ద్వారా ప్రభువుతో మనమేర్పరచుకునే లోతైన సాన్నిహిత్యం కార్యచరణ ఆధ్యాత్మిక చింతనకు మార్గమేర్పరుస్తుంది. ప్రభుతో సాన్నిహిత్యం లేనియెడల మనలో సానుకూల భావాలు కరువై, మనం చేస్తున్న సేవలన్నీ ఫలితంలేని వృధా ప్రయాసలవుతాయి. నిజమైన ఆధ్యాత్మికతను అనగా దేవునిపై అచంచలమైన విశ్వాసం కలిగియుండటం వలన సువార్తా ప్రచారం, సమాజ సేవ చేయాలనే ఆకాంక్ష దృఢతరం కావాలి. ఆత్మతో నింపబడిన సువార్తా ప్రచారకులు ప్రార్థనను అంతర్భాగం చేసుకుంటూ పనిచేసే ప్రచారకులుగా పలువురికీ స్ఫూర్తిధాయకమవ్వాలి (ఇ.జి. 262).

క్రైస్తవలందరు, పటిష్టమైన క్రైస్తవ సమాజాన్ని నిర్మించడానికి పిలువ బడ్డారు. పనిచేయుటలో నిమగ్నమైన మార్తలా, ఆధ్యాత్మిక చింతనలో ఉన్న మేరిలా కలివిడిగా ఉండాలని సువార్తానందం సవాళ్ళిస్తోంది. ప్రార్థన పనిని, పని ప్రార్థనను ఒకదాన్ని మరొకటి బలపరుస్తాయని గ్రహించాలి.

సువార్తా బోధకులలో ఆధ్యాత్మికత, సామాజిక సేవ సమపాళ్ళలో ఉండాలి. అంతరంగంలో దైవసాన్నిధ్యానికి సముచితమైన స్థానం కల్పించాలి. ఆధ్యాత్మికతను ఎప్పటికప్పుడు ప్రార్థన ద్వారా చిగురింపచేసుకోవాలి. అప్పుడే మనం చేసే పనులకు, పనిపాటల్లో చూపే అంకితభావానికి అర్థమూ, పరమార్థమూ చేకూరుతాయి.

ప్రస్తుత ప్రాంతీయ సవార్తీకులు క్రైస్తవ మతపరమైన సంజ్ఞలకు, బాహ్యంగా కనిపించే వాటిల్లో మాత్రమే నిమగ్నమవకూడదు. వారు తమ భద్రతా ప్రాంగణాలను వదలిపెట్టి సువార్తా కాంతులు ప్రసరించవలసిన ప్రతిచోట సువార్తా ప్రబోధం చేయాలి. ఆధ్యాత్మికతతో ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలి. సుహృద్భావ చర్చలు, శాంతి సాధన మార్గాలతో దైవరాజ్యస్థాపనకై ముందడుగేయాలి.

ఆ సమతుల్య ఆధ్యాత్మికత తెలుగు రాష్ట్రాల సామాన్య క్రైస్తవులను, సువార్తీకులను, ప్రార్థనాపరులుగా, దయార్థ హృదయం కలిగిన క్రీస్తును పోలిన వారిగా నిలపాలి.

## ఫుట్ నోట్స్

1. పోప్ ఫ్రాన్సిస్ అపోస్తోలిక ప్రబోధం సువార్తానందం. (Evangelii Gaudium) ఈ నాటి ప్రపంచంలో సువార్తా ప్రకటన (24, నవంబర్ 2013) బ్రాకెట్‌లో వున్న నెంబర్లు ఈ క్లుప్త అక్షరములు (E.G.) ఈ పత్రంలో ఉన్న అంకెలు పై పేర్కొన పుస్తకము నుండి గ్రహింపబడినవి.
2. ఎస్క్వేర్డా బిఫెట్ Theology of Evangelization: Missionary Spirituality, (ఉర్బానియాన యూనివర్సిటి ప్రెస్, రోమ్ 1992) 47.
3. పూవత్తుంకుడి కురియాకోస్, ‘Spirit filled Evangelizers’ Perspectives from Evangelii Gaudium, *Word & Worship* (సంఖ్య, 47, నం. 2, 2014) 337.

4. పొపార్ట్, Challenge of Witnessing the Faith in Indian Culture, జెనిత్, 9 డిసెంబర్ 2006 గోవా ఇండియా.
5. ఎ.పి.బి.సి (ఇప్పుడు టి.సి.బి.సి) వార్షిక పత్రం 2005–2006.
6. ఉచ్చెన్న జె.ఒజ్యోకో "Evangelii Gaudium": A Precious Treasure for Cultivating the Missionary Spirituality, ఆల్ఫాఒమేగా (XIX, No.2, 2016) 235.
7. Ibid 235.
8. పి. కురియాకోస్, 337.
9. Ibid 337.
10. ద్వితీయ వాటికన్ మహాసభ, అధికారిక పత్రం, లోకానికి వెలుగు శ్రీసభ (*Lumen Gentium*) (1965) 11.
11. ద్వితీయ వాటికన్ మహాసభ, ద కాన్సిట్యూషన్ ఆఫ్ ద సెక్రెడ్ లిటర్జి (*Sacrosanctum Concilium*) (1963) 12.
12. రెండవ జాన్ పౌలు జగద్గురువుల, అపోస్తోలిక ప్రబోధం, అమెరికా శ్రీసభ (*Ecclesia in America*) వాషింగ్టన్, డిసి (1999) 16.
13. జె. గోరంట్ల, "ఆంధ్రరాష్ట్రంలో క్రైస్తవ సువార్తా పరిచర్య" Integral Mission Dynamics: An Interdisciplinary Study of the Church in India, ed. కంజెమాల అగస్టీన్, (1995) 202.
14. రెండవ జాన్ పౌలు జగద్గురువులు, పత్రం Redemptoris Missio (1990) 42.
15. రెండవ జాన్ పౌలు జగద్గురువులు, అపోస్తోలిక ప్రబోధం ఆసియాలో శ్రీసభ (*Ecclesia in Asia*), (Libreria Editrice Vaticana, 1999) 34.
16. ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రం లోకానికి వెలుగు శ్రీసభ (*Lumen Gentium*) 39.
17. పి. కురియాకోస్, 349.
18. ద్వితీయ వాటికన్ మహాసభ అధికార పత్రం లోకానికి వెలుగు శ్రీసభ (*Lumen Gentium*) 63.

❊ ❊ ❊ ❊

# పారిభాషక పదకోశం

1. Compendium of the Social Doctrine of the Church: శ్రీసభ సాంఘిక సిద్ధాంత సంగ్రహం
2. Community Level: వర్గస్థాయి
3. Consumerism: వినిమయతత్త్వం
4. Dominus Iesus: Jesus the Lord, (దోమినుస్ యేసుస్) యేసే ప్రభువు, 16వ బెనెడిక్ట్ పాపుగారు కార్డినల్ జోసఫ్ రాట్సింగర్‌గా ఉన్నప్పుడు 2000లో ఈ సైద్ధాంతిక పొత్తాన్ని వ్రాసారు.
5. Establishment Process: వ్యవస్థీకరణ
6. Evangelii Gaudium: (ఎవన్జెలిఇ గౌదియుం) సువార్తానందం, జగద్గురువు ఫ్రాన్సిస్ గారు 24.11.2013 నాడు విడుదల చేసిన అపోస్తోలిక ప్రబోధం
7. Human Trafficking: మానవ రవాణా వ్యాపారం
8. Little ones: అల్పులైనవారు
9. Localisation: స్థానీకరణం
10. Macro Relationship: స్థూలస్థాయి సంబంధం
11. Manifesto: సంకల్ప పత్రం
12. Materialistic Context: భౌతిక నేపథ్యం, ద్రవ్యప్రాధాన్య సందర్భం, నిరీశ్వర హదను
13. Micro Relationship: సూక్ష్మస్థాయి సంబంధం
14. Mission: ధర్మకార్యం, సువార్తా ప్రచారం
15. Missionary Conversion: సువార్తా ప్రబోధ పరివర్తన
16. Mother Culture: మాతృ సంస్కృతి
17. Preferential Option: ఉద్దేశింపబడిన ప్రాధాన్య ఎంపిక
18. Redemtori Missio: Mission of the Redeemer, రక్షకుని ధర్మకార్యం (ఇది 22 జనవరి 1991 నాటి రెండవ జాన్ పౌలు పాపుగారి విశ్వలేఖ)

19. Reference Point: నమూన సూచీ
20. Segregation: విభజన
21. Spiritual Worldiness: ఆధ్యాత్మికమైన ప్రాపంచిక దృక్పథం
22. Stabilization: స్థిరీకరణ
23. Statement: ఉద్ఘాటన పత్రం
24. Theology from Above: పరలోక దైవశాస్త్రం
25. Theology from Below: ఇహలోక దైవశాస్త్రం
26. Universality: సార్వజనీనత
27. Visiting Professor: సందర్శన ఆచార్యులు

❋ ❋ ❋ ❋




తెలుగు కథోలిక వేదశాస్త్ర సమాఖ్య ఐదవ సదస్సు
23-24 ఆగస్టు 2017







తెలుగు కథోలిక వేదశాస్త్ర సమాఖ్య ఐదవ సదస్సు


తెలుగు కథోలిక వేదశాస్త్ర సమాఖ్య ఐదవ సదస్సు
23-24 ఆగస్టు 2017






**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org


*Holycrossprinters 9848145417*